13

تفهيم السنة

كتاب الطلاق

# తలాఖ్ ఆదేశాలు



సంకలనం

ముహమ్మద్ ఇఖ్బాల్ కైలాని

హదీస్ పబ్లికేషన్స్, హైదరాబాద్

**Talaaq ke Masael** كتاب الطلاق

Talaaq Adeshalu *(Talaaq ke Masael)* (Telugu)

Writer : Muhammad Iqbal Kailani

Edited by : Hafiz MD. Abdul Rawoof Umari

Translator : Muhammad Azeezur Rahman

***All Rights Reserved with Publishers***

First Edition : October 2012

Copies : 3000

**Price : Rs. 50/-**

**Published by**

**HADITH PUBLICATIONS**

**S. Abdul Wahid**

H.No. 8-4-549/314, Netaji Nagar,

Erragadda, Hyderabad-18 (A.P.) India. Phone: 23700081

*Copies can be had from* పుస్తకాలు లభించు చిరునామా

**AZIZUR RAHMAN YUNUS**
S/o. **H.Md. Abdur Rawoof Umari**
# 80-11/129E-5-1,
Abbas Nagar, Karnool-2
Cell: 9849492445 Cell: 8121217938

**NIZAM MOHIUDDIN**
# 51-987A, Plat No.17,
SBI Colony, Near Water Tank
Kurool .-518 003. Tel : 251525

**DECCAN TRADERS**
Moghalpura, Near Water Tank
Hyderabad.
Tel: 040-66490230

**HAFIZ FAROOQ MADANI**
Islamic Guidence Centre,
Haili, KSA.
Cell: 00966502985504

**FAROOQ KHAN**
H.No. 11-1-25, B.R.P. Road,
Islampet, Vijayawada -520001
Phone: 9849378668

**MD. ABDUL KALAM**
H.No. 16-415/29, Gangula Thota,
Machilipatnam
Krishna Dist.-521002
Cell : 9247234211, 9640230442

**SYED NOOR**
Al-Ahasaa- Al Afoo,
Kingdom of Saudi Arebia
Cell: 00966507947212

**MOHD. ALI & SON'S**
Moter Parts, RS Road, Nandyal
Kurnool Dist.
Cell: 9949787587

teluguislam.net



# విషయ సూచిక


| క్ర.సం. | అధ్యాయం పేరు | పేజీ నం. |
|---|---|---|
| 1. | ముందు మాట | 05 |
| 2. | సంకల్పం | 35 |
| 3. | తలాఖ్ ఎంతో అవాంఛనీయమైనది | 37 |
| 4. | దివ్యఖుర్ఆన్ వెలుగులో తలాఖ్ | 39 |
| 5. | ఆదర్శ భర్త లక్షణాలు | 44 |
| 6. | ఆదర్శ ఇల్లాలి లక్షణాలు | 46 |
| 7. | భర్త హక్కుల ప్రాముఖ్యత | 49 |
| 8. | భర్త హక్కులు | 50 |
| 9. | భార్య హక్కుల ప్రాముఖ్యత | 53 |
| 10. | భార్య హక్కులు | 55 |
| 11. | దైవప్రవక్త (స) జీవితం అత్యుత్తమ ఆదర్శం | 58 |
| 12. | తలాఖ్ రకాలు | 61 |
| 13. | తలాఖ్ (ఇచ్చే)పద్ధతి | 63 |
| 14. | విడాకుల నేపథ్యంలో సమ్మతమైన విషయాలు | 64 |
| 15. | ఏక కాలంలో మూడు విడాకులివ్వటం | 65 |
| 16. | ఖులా ఆదేశాలు | 66 |
| 17. | లియాన్ (శాప ప్రమాణం) ఆదేశాలు | 68 |
| 18. | జిహార్ ఆదేశాలు | 71 |
| 19. | ఈలా ఆదేశాలు | 72 |
| 20. | ఇద్దత్ ఆదేశాలు | 74 |
| 21. | స్త్రీ భరణం | 77 |
| 22. | శిశు పోషణ - సంరక్షణ | 78 |

# మహిళాభ్యుదయ సంఘాలకు మనవి

మహిళాభ్యుదయ ఉద్యమాలు నడిపే వారందరికీ మేము మనస్ఫూర్తిగా పిలుపు ఇస్తున్నాము- ఇస్లాం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తెచ్చిన సామాజిక జీవన శైలిని భక్తీ విశ్వాసాలతో కాకపోయినా కనీసం ఒక సంస్కరణాత్మక ఉద్యమం రూపంలోనయినా ఒకసారి ప్రశాంత మనసుతో అధ్యయనం చేయాలి. ఆ తరువాత చెప్పాలి.....!

- ఆడ పిల్లలను సజీవంగా పాతిపెట్టే అమానుష దురాచారాన్ని నిర్మూలించినదెవరు?
- ఒక్కో స్త్రీతో ఏకకాలంలో పదేసి మంది పురుషులు వివాహమాడే అజ్ఞాన సంప్రదాయాన్ని అరికట్టిందెవరు?
- మహిళామణులను మగరాయుళ్ళ దౌర్జన్యం నుండి రక్షించేందుకు అంతులేని విడాకుల ఆటవిక శాసనాలను రద్దు పరచిన దెవరు?
- ఆడపిల్లను పోషించి, చక్కని శిక్షణ యిచ్చిన వారు నరకాగ్ని నుండి రక్షించబడతారన్న శుభవార్తను మోసుకు వచ్చినదెవరు?
- స్త్రీ జాతిని విద్యా విషయకంగా తీర్చిదిద్దే ప్రక్రియను ప్రారంభించిందెవరు?
- స్త్రీ జాతిని ఆర్థిక బరువు బాధ్యతల నుండి గౌరవ ప్రదంగా విమోచనను ఇచ్చిందెవరు?
- వితంతువులు, విడాకులు పొందిన మహిళల పునర్వివాహాన్ని ప్రోత్సహించి సమాజంలో వారిని సముద్ధరించినదెవరు?
- శీలాన్ని, మానమర్యాదలను కాపాడుకుంటూ జీవించిన మహిళామణికి స్వర్గం లభిస్తుందని హామీ ఇచ్చిందెవరు?
- స్త్రీ మానమర్యాదలను మంటగలిపే కిరాతకులను రాళ్లు రువ్వి శిక్షించాలన్న చట్టాన్ని తెచ్చిందెవరు?
- కన్నతల్లి అయిన కారణంగా సద్వ్యవహారానికి మగవానికన్నా స్త్రీ మూడు రెట్లు ఎక్కువ హక్కుదారు అని లోకానికి చాటిచెప్పిన దెవరు?

యుగయుగాలుగా మానవ చరిత్రలో అవమానాలకు, అణచివేతకు గురవుతున్న ఆ అభాగ్యురాలిని కఠినాత్ముల, శాడిస్టుల చెర నుండి విడిపించి మానవత ముందు ఆమెను ఒక తల్లిగా, చెల్లిగా, కూతురుగా, అర్ధాంగిగా ఆవిష్కరించిన ఘనత ముమ్మాటికీ మానవ మహోపకారి ముహమ్మద్ (సఅసం)కే దక్కుతుందని మేము నిర్ద్వంద్వంగా, నిస్సంకోచంగా చెప్పగలము. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారు సభ్య ప్రపంచంలో ఆమె హక్కులను నిర్ధారించారు. సమాజంలో ఆమెకు గౌరవప్రదమైన స్థానం కల్పించారు.

యదార్థానికి నారీ జగత్తు ప్రళయం వరకూ ప్రయత్నించినా మహనీయ ముహమ్మద్ (సఅసం) చేసిన ఉపకారాల బరువును దించుకోలేదు.

(వ సల్లల్లాహు అలా నబియ్యినా ముహమ్మద్ వ అలా ఆలిహీ వ అస్హాబిహీ అజ్మయీన్)

teluguislam.net



بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

# ముందు మాట

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ వస్సలాతు వస్సలాము అలా రసూలిహిల్ కరీమ్ - వల్ ఆఖిబతు లిల్ ముత్తఖీన్ - అమ్మాబాద్....

వ్యక్తి గత జీవితమైనా, సామూహిక జీవితమైనా ఇస్లామ్ మౌలికంగా క్రమశిక్షణను, సంఘీభావాన్ని, ఐకమత్యాన్ని, ప్రేమానురాగాలను అభిలషిస్తుంది. అనైక్యతను, మనస్పర్థలను, క్రమశిక్షణారాహిత్యాన్ని, సంబంధాల విచ్ఛిత్తిని, విభేదాలను గర్హించదగిన పోకడగా భావిస్తుంది. క్రమశిక్షణతో, పరస్పర ఐకమత్యంతో జీవితం గడిపే విషయానికి ఇస్లామ్ ఎంతగా ప్రాధాన్యత ఇస్తుందంటే, ఒకవేళ ముగ్గురు వ్యక్తులు కలసి ప్రయాణం చేస్తున్నప్పటికీ వారిలో ఒకరిని నాయకుని (అమీర్)గా చేసుకుని మరీ ప్రయాణం చేయాలని చెబుతోంది (అబూదావూద్). రక్త సంబంధీకుల హక్కు గురించి చెబుతూ మహనీయ ముహమ్మద్ (సఅసం), "రక్త సంబంధాన్ని త్రెంచినవాడు స్వర్గంలో ప్రవేశించడ"ని అన్నారు (బుఖారీ, ముస్లిం). మరో హదీసులో ఇలా అనబడింది: "రక్త సంబంధం (రెహ్మ్) అల్లాహ్ సింహాసనానికి వ్రేలాడుతూ ఉంటుంది. ఎవడు నన్ను కలుపుతాడో అల్లాహ్ అతన్ని కలుపుతాడు. ఎవడు నాతో తెగత్రెంపులు చేసుకుంటాడో అల్లాహ్ అతనితో తెగత్రెంపులు చేసుకుంటాడు" అని అది అంటూ ఉంటుంది (బుఖారీ, ముస్లిం). సాధారణంగా ముస్లింలంతా పరస్పరం కలసి మెలసి ఉండాలని, ఒండొకరి యెడల ప్రేమానురాగాలతో మెలగాలని తాకీదు చేయబడింది. "ఏ ముస్లింకి కూడా సాటి ముస్లిం సోదరునితో మూడు రోజుల కన్నా ఎక్కువగా సంబంధాలు త్రెంచుకుని ఉండటం (మాట్లాడకుండా ఉండటం) ధర్మసమ్మతం కాదు. మూడు రోజులకన్నా అధికంగా సంబంధాలు త్రెంచుకున్న స్థితిలో గనక అతను మరణిస్తే అగ్నికి ఆహుతి అవుతాడు (అహ్మద్, అబూదావూద్) అని మహనీయ ముహమ్మద్ (సఅసం) ప్రవచించారు. "ఎవడయితే ఏడాది కాలంపాటు సాటి సోదరునితో తెగత్రెంపులు చేసుకుంటాడో అతనిపై హత్య చేసినంత పాపభారం పడుతుంది" (అబూదావూద్) అని కూడా హెచ్చరించటం జరిగింది.

సామూహిక స్థాయిలో పరిపాలనా వ్యవస్థలో తిరుగుబాటు, అనైక్యతలాంటి చెడుగులను నిరోధించటానికి ఈ విధంగా ఉపదేశించబడింది: "ఒకవేళ మీపై ముక్కుతెగిన, చెవి తెగిన వ్యక్తి పరిపాలకుడుగా చెయ్యబడినాసరే- అతను గనక దైవగ్రంథానుసారం ఆదేశాలిస్తే మీరు అతని మాటలను శిరసావహించండి. అతనికి విధేయత చూపండి" (ముస్లిం). ప్రవక్త (సఅసం) వారు ఇంకా ఇలా ఉపదేశించారు: "ఒకవేళ ఎవరయినా తమ పాలకునిలో ఏదన్నా చెడు విషయం చూస్తే అతను ఓర్పు వహించాలి. ఎందుకంటే (తిరుగుబాటు చేసి ముస్లింల సమూహం నుండి) వేరుపడి ఒక జానెడు దూరమైనా సరే

వెళ్ళినవాడు అజ్ఞానకాలపు చావు చచ్చాడు" (బుఖారీ, ముస్లిం). ఈ ఆదేశాలను బట్టి ఇస్లామ్ వ్యక్తిగత జీవితంలోగానీ, సామూహిక జీవితంలోగానీ క్రమశిక్షణకు, ఐకమత్యానికి, సంగరితత్వానికి ఎంతగా ప్రాధాన్యత యిస్తున్నదో ఊహించటం కష్టమేమీ కాదు. ఇవైతే సాధారణంగా సమాజంలోని వ్యక్తులను ఏకం చేసి క్రమశిక్షణతో జీవితం గడిపేందుకు అది యిచ్చే శిక్షణ. ఇక స్త్రీ-పురుషుల దాంపత్య జీవితానికి సంబంధించి ఇస్లాం దృక్పథం ఏమిటంటే, ఈ బంధం (అంటే వివాహ బంధం) జీవితాంతం తోడూనీడగా ఉంటూ, ఒకరికొకరు సహాయకులుగా మసలుకునే అపురూప బంధం. అందుకొరకే అల్లాహ్ ఆలు మగల హృదయాలలో ఒండొకరి పట్ల ప్రత్యేకమైన ప్రేమను, దయార్ద్ర గుణాన్ని ప్రోది చేశాడు. వారుభయులూ పరస్పర కలయిక ద్వారా సుఖసౌఖ్యాలను పొందుతారు. ఒండొకరిని విడిచి ఉండలేమన్న భావనకు లోనవుతారు. దాంపత్య జీవితంలోని ఈ చిన్నపాటి 'యూనిట్'లో అంతర్లీనమై ఉన్న సంగరితత్వానికి, ఏకీభావానికి, ప్రేమానురాగాలకు ఇస్లాం చాలా పెద్దపీట వేసింది. వారిరువురికీ ఒండొకరిపై ఉన్న హక్కులు-బాధ్యతలను అది చాలా స్పష్టంగా విశదీకరించింది. మహనీయ ముహమ్మద్ (స) వారు ఇలా ఉద్బోధించారు: "ఒకవేళ నేను (అల్లాహ్ తప్ప) వేరొకరికి సాష్టాంగ ప్రణామం చేయమని ఆజ్ఞాపించవలసి వస్తే, తన భర్తకు సాష్టాంగ ప్రణామం చేయమని భార్యకు ఆజ్ఞాపించేవాణ్ణి" (తిర్మిజీ). వేరొక హదీసులో ఇలా అనబడింది: "ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! భర్త తన భార్యను పడక మీదికి పిలిచినప్పుడు భార్య నిరాకరిస్తే నింగినున్నవాడు సయితం ఆమె పట్ల అసంతృప్తంగా ఉంటాడు- ఆమె భర్త ఆమె యెడల ప్రసన్నుడు కానంతవరకూ (ఆయన కూడా) ప్రసన్నుడవడు" (ముస్లిం). వేరొక సందర్భంలో ఇలా ప్రవచించబడింది: "భర్త భార్య కొరకు స్వర్గమో లేక నరకమో అయి ఉంటాడు" (అహ్మద్).

దీంతోబాటు భార్య హక్కులను కూడా ఇస్లామ్ నిర్ధారిస్తూ వాటిని నెరవేర్చాలని భర్తకు గట్టిగా తాకీదు చేసింది. ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ఉద్బోధించారు: "మీరు తినేదే మీ శ్రీమతికీ తినిపించండి. మీరు ధరించే (దుస్తుల్లాంటి)వే ఆమెకూ సమకూర్చండి. మీ ఇల్లాలిని శంకించకండి" (ముస్లిం). "భార్యను తిట్టకండి" (ఇబ్నెమాజా). "అర్ధాంగిని ద్వేషించకండి. ఒకవేళ ఆమెలోని ఏదన్నా ధోరణి మీకు నచ్చకపోతే ఆమెలోని ఇతరత్రా విషయాలు మీకు నచ్చవచ్చు" (ముస్లిం). "ఇల్లాలిని బానిసరాలి మాదిరిగా బాదకండి" (బుఖారీ). "భార్యలు మీ దగ్గర ఖైదీల మాదిరిగా ఉన్నారు. కనుక వారి యెడల మేలుతో కూడిన మాట చెప్పండి" (తిర్మిజీ). ఇంకా ఇలా ఉద్బోధించారు: "మీ భార్యల యెడల ఉత్తముడైనవాడే మీ అందరిలోకీ ఉత్తముడు" (తిర్మిజీ).

కాస్త ఆలోచించండి! అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించే ఏ స్త్రీ-పురుషుడైనా దాంపత్య జీవితంలో పైన పేర్కొనబడిన ఉపదేశాలను విస్మరించి ఇస్లాం ప్రసాదించిన కుటుంబ వ్యవస్థను అకారణంగా అతలాకుతలం చేసుకుంటాడా??

అయినప్పటికీ మానవ స్వభావంలో, అలవాట్లు అభిరుచులలో గల వైవిధ్యం కారణంగా జీవితంలో ఎగుళ్ళు దిగుళ్ళనేవి తప్పవు. జీవితంలోని ఇతరత్రా విభాగాల సంగతి

teluguislam.net


ఎలావున్నా దాంపత్య జీవితంలో కష్టాలు, పరీక్షలు కాస్త ఎక్కువగానే ఉంటాయి. షైతాను మానస పుత్రులు, అనుంగు అనుచరులు సర్వత్రా, సర్వావస్థల్లో సాంసారిక జీవితాన్ని తలక్రిందులు చేయటానికి పాదరసంలా పారుతూ తమ పని చేసుకుపోతుంటారు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ఇబ్లీసు సింహాసనం నీటిపై ఉంటుంది (వాడు అక్కడినుంచే కోరిన చోటికి) తన పైశాచిక దళాన్ని పంపిస్తూ ఉంటాడు. అన్నిటికన్నా పెద్ద ఉపద్రవాన్ని రేకెత్తించినవాడు షైతాను దృష్టిలో అత్యంత ప్రియతముడై ఉంటాడు. అతని అనుంగు అనుచరుల్లో ఒకడు (తిరిగి వచ్చినమీదట) "నేను ఫలానా ఫలానా ఘనకార్యం సాధించాన"ని రిపోర్టు ఇస్తాడు. దానికి సమాధానంగా ఇబ్లీసు "నీ బొంద! నువ్వేమీ చెయ్యలేద"ని అంటాడు. వేరొకడు వచ్చి, "నేను ఆలుమగలను వెంటాడాను. చివరికి వారిద్దరినీ విడదీసిగాని వదలిపెట్టలేదు" అంటాడు. ఇబ్లీసు సంతోషించి అతన్ని తన ప్రక్కన సింహాసనంపై కూర్చొబెట్టుకుంటాడు. "నువ్వు చాలా మంచి పని చేశావ్" అంటూ మెచ్చుకుంటాడు (ముస్లిం). ఈ విధమైన షైతానీ కార్యకలాపాల మూలంగా అనూహ్యమైన ఉపద్రవాలు తలెత్తి "పామూ చావదు, కర్రా విరగదు" లాంటి పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు బ్రతుకు దుర్భరమైపోతుంది. మనిషి శక్తియుక్తులన్నీ నిర్వీర్యమైపోతాయి. దిక్కుతోచని స్థితి దాపురిస్తుంది. మనిషికి ఎటూ పాలుపోదు. ప్రేమామృత కలశంలో హాలాహాలం చిలికించబడిన కారణంగా మనిషి భావోద్రేకాలకు ఎదురు దెబ్బ తగులుతుంది. పరస్పర నమ్మకాలు వమ్ము అయిపోతాయి. చేసుకున్న బాసలు చెరిగిపోతాయి. చెప్పుకున్న ఊసులు మాసిపోతాయి. కన్న కలలన్నీ భ్రాంతిగా మిగిలిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామ్ వీలయినంతవరకు కుటుంబ జీవితం కూలిపోకుండా చూస్తుంది. అందుకే ఎవరి భార్య అయినా పెడసరి ధోరణిని ప్రదర్శిస్తుంటే కోపోద్రేకంలో విడాకుల వరకూ పోరాదని ఆదేశిస్తోంది. దానికి బదులు ఆమెను ప్రేమతో నచ్చజెప్పాలనీ, అప్పటికీ వ్యవహారం దారికి రాకపోతే రెండో దశలో భార్యను మందలించాలని, ఇంట్లో ఆమె పడకను వేరు చేయాలని తాకీదు చేస్తుంది. అప్పటికీ భార్య ప్రవర్తనలో మార్పు రాకపోతే మూడవ దశలో మందలింపుతో పాటు తేలిగ్గా కొట్టేందుకు అనుమతి ఇవ్వబడింది (వివరాలకు సూరె నిసా 34వ ఆయతును చూడండి). అలాగే ఒకవేళ భర్త పెడసరిగా ప్రవర్తించినా, వేధింపులకు ఒడిగడుతున్నా భార్య తొందరపడి 'ఖులా' తీసుకునే నిర్ణయానికి రాకూడదని ఆదేశించబడింది. పైగా ఎంతో ఓర్పుతో, మరెంతో నేర్పుతో భర్తలోని వైముఖ్య ధోరణికి కారణాలు తెలుసుకునేందుకు యత్నించాలి. తన సంసారంలో సుఖశాంతుల కోసం ఆమె కొంతవరకు త్యాగభావంతో వ్యవహరించాలి (వివరాల కోసం సూరె నిసాలోని 128వ ఆయతును చూడండి).

తమ మధ్యనగల విభేదాలను దూరం చేసుకోవటానికి ఆలుమగలు శాయశక్తులా కృషి చేసినప్పటికీ ఇరువురి మధ్యా సయోధ్య కుదరకపోతే - అప్పటికీ వారు తొందరపడ కుండా తమ ఆత్మీయులను సంప్రతించాలి. భర్త తన కుటుంబీకులలోని ఒక వివేకవంతుణ్ణి, న్యాయశీలుడ్ని ఎంపిక చేసుకోవాలి. అలాగే భార్య తన వారి తరపున ఒక విజ్ఞుడ్ని, న్యాయ శీలుడ్ని ఎంపిక చేసుకోవాలి. వారిద్దరూ కలసి ఈ దంపతుల మధ్య జరిగే గొడవల్ని నిశిత

దృష్టితో పరిశీలించాలి. దంపతుల మధ్య అంగీకారానికి శాయశక్తులా ప్రయత్నించాలి (వివరాలకు సూరె నిసాలోని 35వ ఆయతు చూడండి). ఒకవేళ ఈ ప్రయత్నం కూడా ఫలించకపోతే తప్పనిసరి పరిస్థితిలో దంపతులు విడిపోవటానికి ఇస్లాం అనుమతి ఇస్తుంది. కాని కొన్ని హెచ్చరికలతో ఈ అనుమతిని ప్రదానం చేస్తుంది. అంటే - అకారణంగా విడాకులిచ్చే భర్తను మహాపరాధిగా ఖరారు చేస్తుంది (హాకిమ్). అకారణంగా విడాకులు (ఖులా) పుచ్చుకునే స్త్రీకై స్వర్గ సువాసన నిషేధించబడిందని చెబుతుంది (తిర్మిజీ). ఇన్ని ఆదేశాలు, ఉపదేశాల తర్వాత కూడా ఆ దంపతులు విడాకుల వైపుకే మొగ్గినట్లయితే, ఇస్లామీయ షరీయత్ వారి వేర్పాటుకు ఎంతో యుక్తితో కూడిన ఒక విధానాన్ని నిర్దేశించింది. విడాకులు ఇప్పిస్తూ కూడా ఆఖరి యత్నంగా ఓ అవకాశం యిచ్చి చూడాలన్నదే అందలి మర్మం. అందుకే అది ఏమని ఆజ్ఞాపిస్తుందంటే, భార్య బహిష్టు అయి ఉన్నప్పుడు ఆమెకు విడాకు (తలాక్) ఇవ్వకూడదు. దానికి బదులు ఆమె పరిశుద్ధ స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే విడాకులివ్వాలి. ఎందుకంటే బహిష్టు (రుతుస్రావం) అనేది ఒక విధంగా అస్వస్థతా స్థితి. ఆ కాలంలో ఆలుమగలకు ఒండొకరి పట్ల ఒకింత అనాసక్తత ఉంటుంది. అదే పరిశుద్ధ స్థితిలోనయితే వారిరువురూ పరస్పరం చేరువ అవుతారు. కాగా; ఇస్లాం సహజసిద్ధమైన గుణాలను విడియాకుల కోసం కాకుండా సఖ్యతకోసం, రాజీకోసం ఉపయోగించదలుస్తుంది. అందుకే 'అపరిశుద్ధావస్థ'లో తలాఖ్ ఇవ్వరాదని ఆదేశించబడింది. రెండు: తలాఖ్ ఇచ్చిన తరువాత మూడు మాసాల గడువును నిర్ధారించి భర్తకు ఆలోచించుకునే పూర్తి అవకాశం కల్పించబడింది. ఒకవేళ అతను తొందరపాటు వల్లనో లేక కోపంలోనో లేక ఏదయినా తాత్కాలిక సంఘటనకో ప్రభావితుడై భార్యకు విడాకులిచ్చి ఉంటే - ఈ మూడు మాసాలలోగా తన తప్పును సరిదిద్దుకుని ఆమె వైపు మరలేందుకు వీలుంటుంది. మూడు: ఈ 'గడువు' కాలంలో భార్యను తన స్వగృహంలో ఉంచి, మునుపటి వలెనే ఆమె పోషణాభారం వహించాలని కూడా భర్తపై ఆంక్ష విధించబడింది. ఈలోగా వారిద్దరి మధ్యన ఉన్న అరమరికలు తొలగిపోయి వారు అంగీకారానికి రాదలిస్తే ఈ గడువు (ఇద్దత్) కాలం వారికి వరంలా ఉపయోగపడుతుంది. ఈ ఆదేశాలన్నింటి ద్వారా అవగతమయ్యేదేమిటంటే ఇస్లాం ఆఖరి క్షణం వరకూ సంసారాన్ని చక్కదిద్దటానికి, కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం అవకుండా చూడటానికి ప్రయత్నిస్తుంది. భార్యాభర్తలిరువురూ కాపురం చేస్తూ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండటం ఇక తమవల్ల కాదని నిర్ధారణ అయ్యాకే విడాకులకు ఆమోదిస్తుంది.[1]

---

*1. ముందుకు సాగేముందు ఓసారి పాశ్చాత్య దేశాల కుటుంబ వ్యవస్థపై కూడా దృష్టిని సారించండి. ఆ దేశాల భౌతికాభివృద్ధిని, ప్రాపంచిక తళుకు బెళుకులను చూసి మన కళ్ళు చెదిరిపోతుంటాయి. ఆలోచించే, అర్థం చేసుకునే మన శక్తిసామర్థ్యాలు ఎలా చచ్చుబడిపోతున్నాయంటే మనం ఒక్కొక్కటిగా మన ఇస్లామీయ విలువలకు తిలోదకాలిస్తున్నాము. పాశ్చాత్య మేధావులు, ఆలోచనాపరులు సయితం తమ రచనల్లో స్వయంగా ఇలా అంగీకరించారు - పశ్చిమ దేశాల్లో కుటుంబ వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. పెళ్లి గిళ్ళీ లేకుండానే జీవితం గడపాలనే ధోరణి సమాజ స్థాయిలో బాధ్యతాభావనను సాంతం హరించివేసింది. పాశ్చాత్య సమాజం స్త్రీలను పురుషులకు దీటుగా ఉద్యోగాల మార్కెట్‌లోకి తెచ్చి, వివాహిత స్త్రీల స్థానే*

teluguislam.net



ఎట్టి పరిస్థితిలోనూ కుటుంబ వ్యవస్థను కాపాడాలనే విషయాన్ని దృష్టిలో పెట్టుకునే మేము ఈ పుస్తకం ప్రారంభంలో తలాఖ్ (విడాకుల)తో అసలేమాత్రం సంబంధంలేని కొన్ని అధ్యాయాలను, పై పెచ్చు ఉభయులూ ఎలా అన్యోన్యంగా మెలగాలో, ఏ విధంగా ఒండొకరి హక్కులను గుర్తించాలో, ఏ విధంగా ఒక ఆదర్శ కుటుంబంలా జీవించాలో తెలియజేసే అధ్యాయాలను పొందుపరిచాము. ఈ అధ్యాయాలలో ఆదర్శ భార్యలోని సుగుణాలు, ఆదర్శ భర్తలోని మంచితనం, భర్త హక్కుల ప్రాధాన్యత, భార్య హక్కుల ప్రాముఖ్యత విశదీకరించబడ్డాయి. దాంతోపాటే సన్మార్గ దర్శకులు, మానవ మహోపకారి ముహమ్మద్ (సఅసం) వారి పవిత్ర జీవితంలోని కుటుంబ జీవిత కోణాలు కూడా ఒక అధ్యాయంలో పొందుపరచబడ్డాయి. దంపతుల్లో నెలకొనే అపోహలు, అపార్థాలను దూరం చేసి కష్టాల గడపలపై నిలిచి ఉన్న దంపతులకు షరీయత్ వెలుగులో పరిష్కారమార్గం సూచించి, వారి జీవితాలను తీర్చిదిద్దాలన్నదే మా ఈ చిరుప్రయత్నంలోని ప్రధాన ఉద్దేశ్యం.

---

*సింగిల్ మదర్స్ (పెళ్ళి చేసుకోకుండానే తండ్రి అయిన పురుషుణ్ణి సింగల్ ఫాదర్, పెళ్ళి కాకుండానే తల్లి అయిన స్త్రీని సింగిల్ మదర్‌గా వ్యవహరిస్తారు)కి ఎక్కువ సౌలభ్యాలు సమకూర్చి వైవాహిక జీవిత (పరమార్థ) భావననే అంతమొందించింది ('తక్బీర్' వారపత్రిక- 1997 అక్టోబర్ 30). అమెరికా వారపత్రిక 'న్యూస్‌వీక్' రిపోర్టు ప్రకారం ఐరోపాలో 'సింగిల్ మదర్స్' రేటు నానాటికీ పెరిగిపోతోంది. పెళ్లి కాకుండానే తల్లులయ్యే వారిలో అత్యధికులు నవయువతులే. ముందు చూపు (వివాహం) లేకుండా తల్లికావటం ఎంత ఘోరమైన తప్పిదమో వారికి తెలీదు పాపం! న్యూస్‌వీక్ కథనం ప్రకారం స్వీడన్‌లో పుట్టే 50 శాతం శిశువులు పెళ్లికాని తల్లులకు చెందినవారే. ఫ్రాన్స్, బ్రిటన్‌లలో జన్మించే ప్రతి మూడవ శిశువు అక్రమ సంతతి క్రిందికే వస్తుంది. ఐర్లాండ్ పరిస్థితి కూడా ఇంచుమించు ఇంతే. డెన్మార్క్‌లో రోజురోజుకూ ప్రవర్ధమాన మవుతున్న సింగిల్ ఫాదర్స్, సింగిల్ మదర్స్ వల్ల అక్కడి సాంప్రదాయక కుటుంబ వ్యవస్థ క్రమక్రమంగా అంతరించిపోతోంది. తత్కారణంగా అక్కడి నవతరం నేర ప్రవృత్తికి అలవాటుపడుతోంది. ఆ కుర్రకారు మాదక ద్రవ్యాల సేవనానికి బానిసలై హింసకు పాల్పడుతున్నారు. ఈ విషయంలో డెన్మార్క్ కూడా మరో అమెరికాలా తయారవుతోంది ('తక్బీర్' వీక్లీ-1997 సెప్టెంబర్ 4). చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన 44 మంది మత నాయకులు ఒక ప్రకటనలో ఇలా అభిప్రాయపడ్డారు: "పెళ్ళి కాకుండానే సహజీవనం సాగిస్తున్న జంటలు ఏదో పాప కార్యం చేస్తున్నారనే విషయాన్ని ఇప్పుడు నమ్మటం లేదు. పెళ్లీ గిళ్లీ అని పట్టుబట్టడం ఇప్పుడు పాతచింతకాయ పులుసే. పెళ్లి చేసుకోకుండానే ప్రజలు సహజీవనం చేస్తామని అంటున్నప్పుడు చర్చీ పెద్దలు వారిని అడ్డుకోకూడదు." మాంచెస్టర్‌కు చెందిన బిషప్ క్రిస్టోఫర్ షెఫీల్డ్ ఇలా అంటున్నారు: "అవివాహిత జంటలపై పాపిష్టి జీవితం గడుపుతున్నారన్న లేబిల్‌ని అతికించటం వల్ల ఇప్పుడు ఒరిగేదేమీ లేదు." ఒక పాత్రికేయుని నివేదిక ప్రకారం పాశ్చాత్య సమాజాలలో మహిళలకు లైంగిక స్వేచ్ఛ పేరిట విచ్చలవిడిగా విహరించే అవకాశం ఇవ్వబడింది. వారికి గర్భనిరోధక మాత్రలు ఉచితంగా సమకూర్చబడుతున్నాయి. తత్ఫలితంగా వైవాహిక వ్యవస్థ (కుటుంబ జీవనం) అన్నిటికన్నా ఎక్కువగా దెబ్బతింటోంది. ఏటేటా విడాకులు పొందేవారి సంఖ్య పెరిగిపోతోంది. పెళ్ళి చేసుకోకుండానే సహజీవనం చేస్తున్న 'జంటలు' ఇప్పుడు 'కుటుంబ' స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. పర్యవసానంగా మంచి కుటుంబాలకు బదులు కూలిపోయిన కొంపల నుంచి బయటపడిన పిల్లకాయల దండు వీధుల్లో వాడల్లో నేరాలు చేస్తూ తిరుగుతున్నారు (తక్బీర్ వారపత్రిక- 1997 అక్టోబర్ 30).*

భాగ్యవంతులైన పురుషులు, స్త్రీలు మహా ప్రవక్త (సఅసం) వారి ఈ ఉపదేశాలను చదివి లేదా ప్రవక్త వారి ఆదర్శ జీవితాన్ని అధ్యయనం చేసి తమ ఆలోచనను మార్చుకోవచ్చు. తమ తప్పును తెలుసుకుని, ప్రళయదినాన దైవసన్నిధిలో జవాబు చెప్పుకోవలసి ఉందనే విషయాన్ని తలచుకుని స్వీయ సంస్కరణకు ప్రయత్నించవచ్చు. ఆ విధంగానయినా విద్వేషం స్థానంలో ప్రేమ చిగురించవచ్చు. రెండు కుటుంబాల మధ్య ఉన్న వైర వాతావరణం, అంతరాల అగాధం తొలగిపోయి, స్నేహ సంబంధాల వారధి ఏర్పడవచ్చు.

## కఠినమైన మార్గం

అత్తామామలు ఎంతో ఉత్సాహంతో, ఆశల పల్లకిలో తమ కోడలిని ఇంటికి తెచ్చు కుంటారు. కాని కోడలు పిల్ల వచ్చిన కొన్నాళ్ళకే ఇంట్లో అత్తాకోడళ్ళ మధ్య రగడ మొదలవు తుంది. ఈ రగడ మన సమాజంలో ఒక అనివార్య అంశంగా మారిపోయింది. 'అత్త మీది కోపం దుత్త మీద చూపినట్లు' అన్న సామెత ఉండనే ఉంది. 'అత్త లేని కోడలు గుణ వంతురాలే' అన్నది మరో లోకోక్తి. అత్తా ఒకింటి కోడలే నన్న సంగతి మరచిపోయి ఏదేదో అనేస్తుంది. కోడలు పిల్లతో కీచులాట మొదలైనప్పుడు నిరాశా నిస్పృహలతో, "నా దౌర్భాగ్యం గురించి ఏమని చెప్పేది! నేను కోడలినైనప్పుడు నాకు ఉత్తమురాలైన అత్త లభించలేదు. ఇప్పుడు అత్తనై కూర్చుంటే గుణవంతురాలైన కోడలు రాలేద"ని పెదవి విరుస్తుంది. మరి చూడబోతే ఈ అమ్మగారే ఒకప్పుడు కోడలిగా తన అత్తింటి ఆరళ్ళకు గురయింది. తీరా మరో ఆడది తన ఇంటికి కోడలుగా వస్తే తను కూడా అదే దాష్టీకానికి ఒడిగడుతుంది. ఎంత విచిత్రం!

అత్తాకోడళ్ళ కలహంలో అందరికన్నా ఎక్కువగా నలిగిపోయేది మగవాడే. అతని పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారవుతుంది. తల్లా? పెళ్ళామా? అని ఆలోచిస్తే ఒక వైపు షరీయత్ సూచించిన తల్లి హక్కులు విస్మరించరానివి. తల్లి మాటను జవదాటరాదన్నది ప్రవక్త (స) వారి ప్రవచనం. దాంతోపాటే "తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంద"ని కూడా మహనీయ ముహమ్మద్(స) సెలవిచ్చారు. వేరొక హదీసులో తండ్రి స్వర్గ ద్వారంగా ఖరారు చేయబడ్డాడు (ఇబ్నెమాజా). అంటే తల్లిదండ్రుల మనసు నొప్పించినవాడు స్వర్గభాగ్యానికి నోచుకోకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. మరో వైపు పరువం ఉరకలు వేసే సమయంలో అర్ధాంగితో అపురూపమైన అనుబంధం ఏర్పడి ఉంటుంది. కట్టుకున్న భర్త కోసం కన్నవారినే వదలి వచ్చిన ఆ కలకంఠి కంట వొలికే కన్నీళ్లకు అతడు తట్టుకోలేకపోతాడు. ఆమె కౌగిలింతలో కరిగిపోతాడు. ఎవరి మాట వినాలి? తల్లిదండ్రుల మాట వినకపోతే కష్టం! ఇల్లాలి మాట వినకపోతే కష్టం! సామాజిక జీవన వ్యవస్థలో ఇదొక దుర్గమమైన పర్వత మార్గం! దీన్ని ప్రతి మగవాడూ దాటవలసి ఉంటుంది!

ఒక్కోసారి ఈ గొడవ తారస్థాయికి చేరుతుంటుంది. ఒకప్పుడు ఎన్నో ఆశలు ఆకాంక్ష లతో కోడలిని తెచ్చిన అత్తగారే ఇప్పుడు రెచ్చిపోయి కోడలికి విడాకులు (తలాఖ్) ఇవ్వమని

teluguislam.net



కొడుకును పురమాయిస్తుంది. ఇలాంటి పరిస్థితిలో మగవాడు ఏం చేయాలి? తల్లి పురమాయింపుపై భార్యకు విడాకులివ్వాలా? లేక తల్లి మాటను వినీ విననట్లుగా దాట వేయాలా?

ఈ ప్రశ్నకు సమాధానం ఆ కుటుంబ పరిస్థితులపై, సంఘటనలపై ఆధారపడి ఉంటుంది. కాని ఒక విషయం మాత్రం తకీమని చెప్పవచ్చు. అదేమంటే షరీయతు కుటుంబ వ్యవస్థను పరిరక్షించేందుకు అడుగడుగునా మగవాణ్ణి తలాక్ (విడాకులు) ఇవ్వకుండా ఆపేందుకు ప్రయత్నిస్తుంది కాబట్టి అత్తా కోడళ్ళ గొడవను సాకుగా చూపి భార్యకు విడాకులివ్వటం ఏ విధంగానూ సబబు అనిపించుకోదు. మా ఈ అభిప్రాయంతోపాటే మేము ఈ 'త్రిమూర్తులకు' - అంటే అత్తా, కోడలు, కొడుకులకు- షరీయతు ఆదేశాల దృష్ట్యా మానసిక వాస్తవాల దృష్ట్యా కూడా కొన్ని నిర్దేశాలను ఇవ్వదలిచాము - వాటిని గనక పాటిస్తే అత్తాకోడళ్ళ రగడ పూర్తిగా సద్దుమణగకపోయినా తీవ్రత మాత్రం తప్పకుండా తగ్గిపోతుంది.

మొదటిది: మగవాడు ఒక వాస్తవాన్ని ఎన్నడూ మరువరాదు. అదేమంటే, తనను కన్న తల్లి, తనను సాకిన తల్లి, తనకు మమతానురాగాలు పంచిపెట్టిన తల్లి, పసితనం నుంచి తనను అల్లారుముద్దుగా పెంచుతూ టీనేజీకి చేర్చిన తల్లి, టీనేజీ నుంచి యౌవన దశకు చేర్చిన తల్లి, తన గురించి ఎన్నెన్నో కలలుగన్న తల్లి, తనకు పెళ్లి చేసి కోడల్ని ఇంటికి తెచ్చిన తల్లి - తన కొడుకు తననెప్పుడూ ఒకే విధంగా చూడాలని ఆశ పడుతుంది. కొడుకు చూపే ప్రేమాదరణలు రెండు భాగాలుగా పంపకం అవటాన్ని ఆమె జీర్ణించుకోదు. దాన్ని బలహీనత అన్నా అనండి, ఏమన్నా అనండి - ఇది మాత్రం నిజం. ఈ కోరిక వాస్తవ విరుద్ధమే. కాని కొడుకు ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. తల్లి ప్రేమాదరణల్లో ఏ లోటూ రాకుండా జాగ్రత్తపడాలి. కొడుకు ప్రేమ తల్లికి, పెళ్ళానికి మధ్య చెరి సగంగా విభజించ బడిందన్న భావన తల్లికి కలగనీయకూడదు. ఒకవేళ ఎప్పుడన్నా తల్లి ఆ మాటే చెప్పినా ఉత్తమ రీతిలో సముదాయించాలే తప్ప విసుగ్గా జవాబివ్వకూడదు. ఇలా సర్దుకుపోవటం కష్టమే. కాని ఈ సహన గుణం వృధాపోదు. ఇలాంటి సహనమూర్తుల కష్టాలు క్రమక్రమంగా దూరమవటమే కాదు, వాళ్ళ లోగిళ్ళలో ఆనందం నిండుతుంది. అనురాగం పడుతుంది. అలాంటి వారికి దేవుడు అపారంగా కటాక్షిస్తాడు కూడా. ఇది అనుభవపూర్వకంగా రుజువైన యదార్థం.

రెండవది: కోడలు కేవలం తన భర్త కోసమే తన కన్నవారిని, రక్త సంబంధీకులను విడిచి వస్తుందనేది నిజమేగాని ఆమె ఇక్కడ ఒక యదార్థాన్ని మరువకూడదు. అదేమంటే, ప్రకృతి ఒక గొప్ప పరమార్థం దృష్ట్యా ఆమె నుంచి ఈ త్యాగాన్ని కోరింది - ఇంతకీ ఆ గొప్ప ఆశయం ఏమిటి? ఒక కొత్త కుటుంబానికి పునాది వేయటం! ఓ కొత్త నిలయాన్ని వసింపజేయటం! ఈ మహదాశయం కొరకు ఆమె ఎన్నో త్యాగాలు చేయవలసి వస్తుంది. పతి ఆదరణే, పతి సేవే తన ప్రధాన కర్తవ్యమని భావించే ఆ సతి, తన పతిగారి మాతాపితలను కూడా ఆదరించాలి. శాయశక్తులా వారి సేవలు కూడా చేసి మన్ననలు పొందాలి. ఇంట్లోని

పెద్దలందరి యెడలా గౌరవ మర్యాదలతో ప్రవర్తించాలి. ఆ ఇంటి చిన్నలపై అవ్యాజాను రాగాలు కురిపించాలి. "పిన్నలపై దయచూపనివాడు, పెద్దలను గౌరవించనివాడు మా వాడు కాడు" అన్న ప్రవక్త(స) ప్రవచనం (తిర్మిజీ) చిరస్మరణీయం.

అత్త వారింటి సుఖ దుఃఖాలలో ఆమె పాలుపంచుకోవాలి. కలిమిలోనూ లేమిలోనూ, కష్టాలలోనూ సుఖాలలోనూ ఆమె మెట్టింటి వారికి చేదోడు వాదోడుగా నిలవాలి. మన పూర్వీకులు కూతురిని అత్తవారింటికి వీడ్కోలు చెబుతున్నప్పుడు "అమ్మా! ఏ ఇంటికి నీ పల్లకీ వెళుతున్నదో ఆ ఇంటి నుంచే నీ పేటిక వెళ్ళాలమ్మా. ఈ విషయం మరువకమ్మా!" అని హితబోధ చేసేవారు. దీని అంతర్యం ఏమిటి? ఆడపిల్ల ఏ ఇంట్లో అడుగు పెట్టిందో అదే ఆమెకు సర్వస్వం. ఆమె సుఖ దుఃఖాలు, జీవన్మరణాలు- అన్నీ ఇక ఆ ఇంటితోనే ముడిపడి ఉంటాయి. ఈ హితోపదేశం నిజంగానే అమూల్యమైనది. దీనివల్ల ఒక స్త్రీలో ప్రతికూల పవనాలను ఎదుర్కొనే ధైర్యం వస్తుంది. అలాగే కొత్త ఇంట్లో, కొత్త వాతావరణంలో అడుగిడిన మహిళలు వినయ వినమ్రతలతో, విశ్వాస పాత్రతతో, త్యాగభావంతో మెలిగి నట్లయితే ఆమె ప్రేమాదరణలకు నోచుకుంటుంది. దానికి బదులు గర్వం, అహంకారం, ఆత్మస్తుతి, స్వార్థంతో వ్యవహరిస్తే చెడ్డపేరు వస్తుంది. పరిసరాల వారు ఆమెను ఆదరించకపోగా, ఈసడించుకుంటారు.

మూడవది: పెండ్లి తరువాత భర్త భార్యవైపుకు మొగ్గటం, ఆమెను ప్రేమించటం, సంసార విషయాలలో ఆమెను తరచూ సంప్రతిస్తూ ఉండటం, భవిష్యత్తు గురించి వ్యూహరచన చేయటం సహజ విషయం. తమ కుటుంబంలో ప్రస్ఫుటమయ్యే ఈ పరివర్తనను పెద్దవాళ్లు సహృదయంతో అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్న వాళ్ళకు అసలు గొడవలే ఉండవు. కాని కుటుంబ సభ్యుల సమక్షంలో కొడుకు-కోడలు మాట్లాడుకున్నా, లేదా వాళ్లు ఏకాంతంలో కూర్చుని కాస్సేపు కబుర్లు చెప్పుకున్నా తప్పు పట్టడం సంస్కారం కాదు. అసలు గొడవలు మొదలయ్యేది ఇటువంటి అతివాదం వల్లనే. ఆ విధంగా రానురాను అత్తాకోడళ్ళ మధ్య అంతరాల అగాధాలు ఏర్పడతాయి. ఈ అంతరాలే పరస్పర ద్వేషానికి కారణం అవుతాయి. చీటికి మాటికి దెప్పిపొడవటం, కారాలు మిరియాలు నూరటం మామూలైపోతుంది. కడకు ఆ కాపురం రచ్చకెక్కుతుంది. సకాలంలో ఈ గొడవను అరికట్టకపోతే వ్యవహారం విడాకుల దాకా పోతుంది. ఈ సందర్భంగా అత్త పాత్రను పోషించేవారు విశాల హృదయంతో ఆలోచించాలి. ఒకవేళ తమ కూతురికే అత్తవారింట్లో అలాంటి పరిస్థితి ఎదురయితే తమకెలా ఉంటుంది? ఈ ప్రపంచం ఓ కార్యరంగం అన్న సంగతిని మరువరాదు. ఆ చేత్తో ఇచ్చి ఈ చేత్తో పుచ్చుకునే విధానం ఎల్లెడలా ఉన్నదే. ఈనాడు నాటిన విత్తనం రేపటి రోజున కోయక తప్పదు. తమ పంతంపై కోడలికి విడాకులిచ్చి వదిలించుకుంటే రేపు ప్రళయదినాన ఆ పాపభారం తమపై మోపబడుతుందన్న వాస్తవాన్ని షరీయతు దృష్ట్యా అత్తలు మరువరాదు. వారి ఈ పట్టింపుల వైఖరి వల్ల కన్న కొడుకు కాపురమే కూలిపోతుంది. ఇక అక్కడి నుంచి మరో కొత్త సమస్యల అధ్యాయం తెరువ బడుతుంది. పరిస్థితులు చక్కబడకపోగా మరిన్ని చిక్కు సమస్యలు ఎదురవుతాయి. ఆ

teluguislam.net



ఊబిలో నుంచి అటు కొడుకు, ఇటు తల్లిదండ్రులు కూడా బయటపడలేని గడ్డు పరిస్థితి! కాబట్టి శ్రేయస్కరమయిన మార్గం ఏమిటంటే అత్తవారు తమ కోడలి హక్కులను పెద్ద మనసుతో అంగీకరించాలి. తమ కూతురిలోని లోపాలను ఉపేక్షించినట్లే కోడలిలోని లోపాలను కూడా ఉపేక్షించాలి. తమ కూతురిలోని సుగుణాలను మెచ్చుకున్నట్లే తమ కోడలిలోని మంచి గుణాలను విశాల హృదయంతో మెచ్చుకోవాలి. ఈ విధంగా ఉద్రిక్తతను సడలించటానికి చిత్తశుద్ధితో పెద్దలు తమ వంతు పాత్రను పోషించినట్లయితే తప్పక పరిస్థితిలో మార్పు వస్తుంది. గొడవలు పూర్తిగా అంతరించకపోయినా తీవ్రత మాత్రం తప్పక తగ్గిపోతుంది.

# విడాకుల సాంప్రదాయిక పద్ధతి

దివ్యఖుర్‌ఆన్‌లో "అల్లాహ్ నిర్ధారించిన హద్దులు" (హుదూదుల్లాహ్)గా పేర్కొనబడిన ఈ వివాహం - విడాకుల నియమ నిబంధనల గురించి చాలా మందికి కనీస అవగాహన కూడా ఉండదు. గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడే వరకూ వాటిని గురించి తెలుసుకునేందుకు కూడా ప్రయత్నించరు. వ్యవహారం బెడిసికొట్టినప్పుడే విడాకులను ఆశ్రయిస్తారు. లేదా విడాకులు ఎలా యివ్వాలన్నది తెలీకపోవటంతో గంద్రగోళ స్థితి ఏర్పడుతుంది. అందుకే మేమిక్కడ తలాఖ్ ఇచ్చే మస్నూన్ (సాంప్రదాయిక) పద్ధతిని సులభమైన రీతిలో తెలియపరచేందుకు యత్నిస్తాము. తలాఖ్ పద్ధతికి ముందు కొన్ని ముఖ్య విషయాలను కూడా దృష్టియందుంచుకోవాలి.

# ముఖ్య నియమ నిబంధనలు

1. బహిష్టు స్థితిలో తలాఖ్ ఇవ్వకూడదు. ఒకవేళ రుతుస్రావ కాలంలో భార్యతో గొడవపడి, భర్త ఆమెకు విడాకులివ్వదలిచినా సరే - రుతుస్రావం ఆగేవరకూ భర్త నిరీక్షించాల్సిందే.
2. భర్త తాను ఏ పరిశుద్ధావస్థలో తలాఖ్ (విడాకు) ఇవ్వదలిచాడో ఆ పరిశుద్ధావస్థలో ఆమెతో సంభోగించకూడదు. రుతుస్రావ (బహిష్టు) కాలం తప్పించి మిగిలిన ఏ రోజుల్లో స్త్రీ నమాజ్ చేస్తుందో వాటిని "పరిశుద్ధావస్థ" అంటారు.
3. ఒకే సమయంలో ఒక తలాఖ్ (ఒక్క విడాకులు) మాత్రమే యివ్వాలి. ఏక కాలంలో మూడు విడాకులు ఇవ్వటం మహాపరాధం.
4. భార్యను వేర్పరచటానికి విడాకుల గరిష్ట సంఖ్య మూడు. కాని ఒక తలాఖ్‌తో వేరుపరచటమే షరీయత్ నిర్ధారించిన విధానం. రెండవ తలాఖ్, మూడవ తలాఖ్ అవసరం ఎప్పుడు, ఎలా ఏర్పడుతుంది? అనే ప్రశ్నకు సమాధానం రానున్న పుటలలో ఇస్తాము.
5. మొదటి తలాఖ్ అయినా లేదా రెండవ తలాఖ్ అయినా లేదా మూడవ తలాఖ్ అయినా - ప్రతి తలాఖ్ (విడాకుల) తరువాత భార్య మూడు బహిష్టులు లేదా మూడు రుతువుల వరకూ (సుమారు మూడు మాసాలుగా పరిగణించబడుతుంది)

వేచి ఉండవలసిందిగా ఆజ్ఞాపించబడింది. షరీయతులో ఈ నిరీక్షణా కాలాన్ని 'ఇద్దత్'గా వ్యవహరిస్తారు.

6. మొదటి, రెండవ విడాకుల తర్వాత గడువు కాలంలో (ఇద్దత్ వ్యవధిలో) భార్యతో రాజీపడటాన్ని షరీయతులో 'రుజువర్తన' అంటారు. ఈ రకమైన తలాఖ్‌ను 'తలాఖె రజ్యీ' గా వ్యవహరిస్తారు. ఈ విధమైన రుజువర్తనకు భార్యతో సమాగమం జరపటం తప్పనిసరి కాదు. పరస్పరం సంప్రదింపుల ద్వారా సర్దుబాటుకు వచ్చినా సరిపోతుంది.

7. మొదటి, రెండవ తలాఖ్ (విడాకుల) తర్వాత మూడు మాసాల వరకూ 'ఇద్దత్' గడపటంలోని అసలు ఉద్దేశ్యం ఏమిటంటే ఒకవేళ భర్త ఈ ఇద్దత్ (గడువు)లో తలాఖ్ ఇవ్వాలన్న నిర్ణయం గైకొంటే - ఈ మూడు నెలల కాలంలో ఎప్పుడైనా రుజువర్తనుడు కావచ్చు (అంటే అంగీకారానికి రావచ్చు). అందుకే మొదటి రెండు విడాకులను మార్పుకు, మందలింపుకు అవకాశం ఉన్న విడాకులు (తలాఖె రజ్యీ)గా పరిగణించటం జరుగుతుంది. మూడవది, చివరిది అయిన తలాఖ్‌ను మాత్రం తలాఖె బాయన్ (వేరుపరిచే విడాకులు)గా వ్యవహరిస్తారు. మూడవసారి తలాఖ్ తరువాత 'ఇద్దత్' గడపటంలోని ఉద్దేశం మాజీ భర్తతో చేసిన సంసార గౌరవార్థం మూడు మాసాల వరకూ వేచి ఉండటమే. ఆ తరువాత స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చు.

8. మొదటి రెండు విడాకుల తర్వాత - ఇద్దత్ కాలంలో - భర్త ఒకవేళ భార్యతో సర్దుకు పోదలిస్తే భార్య అనుమతి తప్పనిసరేం కాదు. ఆమె కోరినా కోరకపోయినా భర్త ఆమెతో రాజీపడవచ్చు.

9. రజ్యీ తలాఖ్ తరువాత పాటించే ఇద్దత్ (గడువు) కాలంలో భర్త భార్యను తన ఇంట్లోనే ఉంచి, ఆమె అన్న వస్త్రాల ఖర్చును భరించాలి.

10. నిరంతరం మూడు విడాకులు ఇవ్వటం సంప్రదాయం (మస్నూన్) కాదు.

ఇప్పుడు విడాకులు (తలాఖ్)కు సంబంధించిన వివిధ ధర్మసమ్మతమైన పద్ధతులను దిగువనిస్తున్నాము.

మొదటి స్వరూపం - ఒక విడియాకుతో వేరుపడటం.

రెండవ స్వరూపం - రెండు విడాకులతో వేరవటం.

మూడవ స్వరూపం - మూడు విడాకులతో వేరవటం.

## (అ) ఒక విడియాకుతో వేరుపడటం


ఒకే తలాఖ్ (ఒకే విడాకుల)తో వేరుపడటం ఎలాగంటే- వివాహం తరువాత భార్యా భర్తల మధ్య మనస్పర్థలు పెరిగి వ్యవహారం విడాకుల వరకూ వస్తే భర్త తక్షణం విడాకులివ్వకుండా బహిష్టుకాలం పరకూ ఆగాలి. భార్య బహిష్టు స్థితి తొలగి పరిశుద్ధావస్థ వచ్చాక, ఆమెతో రతిక్రీడలో పాల్గొనకుండానే విడాకులివ్వాలి. ఆ తరువాత ఇద్దత్ (గడువు) కాలంలో- అంటే మూడు మాసాల వరకూ - ఆమెతో రాజీపడకుండా ఉంటే, ఇద్దత్ ముగియగానే

teluguislam.net



భార్యాభర్తల మధ్య దానంతటదే విడాకులు అయిపోతాయి. ఇట్టి పరిస్థితిలో ఆమెకు రెండవసారి, మూడవసారి తలాఖ్ ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఈ ఇద్దత్ (గడువు) కాలంలో భార్యను తన ఇంటనే ఉంచి ఆమెకు భరణం ఇస్తుండాలి (అంటే ఆమె అన్న వస్త్రాల ఖర్చు, ఇతరత్రా ఖర్చులు భరించాలి). 'ఒకే తలాఖ్'తో ఉభయులూ విడిపోయే పద్ధతిని అవలంబించటం వలన కలిగే లబ్ధి ఏమిటంటే, వారిద్దరూ భవిష్యత్తులో ఎప్పుడయినా వివాహబంధంలో ఇమడదలిస్తే నిస్సంకోచంగా ఇమిడిపోవచ్చు.

ఒకే తలాఖ్‌తో విడిపోయే పద్ధతిని మరింత సులభంగా అర్థం చేసుకోవటానికి క్రింది పట్టికను అనుసరించాలి.





ఇక్కడ గమనార్హమైన విషయం ఏమిటంటే మూడవసారి బహిష్టు కాలం దాటగానే ఆ స్త్రీ పునర్వివాహం చేసుకోగలదు - మాజీ భర్తతో నయినా! లేదా మరో మగవాడినయినా!


## (ఆ) రెండు విడాకులతో వేరుపడటం

మొదటి తలాఖ్: రెండు విడియాకులతో వేరుపడే పద్ధతి ఎలాగుంటుందంటే- వివాహానంతరం భార్యాభర్తల మధ్య గొడవలు మొదలై వ్యవహారం విడాకుల వరకూ వస్తే, భర్త భార్యకు నియమానుసారం బహిష్టు తర్వాత - పరిశుద్ధావస్థలో సమాగమం జరుపకుండానే తలాఖ్ ఇచ్చి ఇద్దత్ కాలంలో (మూడు నెలల వ్యవధి మధ్య) ఎప్పుడైనా ఆమెతో రాజీకి వస్తాడు. ఇక్కడ గమనార్హమైన విషయం ఏమిటంటే అతడు ఆమెతో రాజీపడినంత మాత్రాన ఈ 'తలాఖ్' లెక్కించబడదని అనుకోరాదు. భవిష్యత్తులో ఆ భార్యాభర్తలిద్దరి మధ్య మళ్లీ ఎప్పుడైనా గొడవ జరిగి, మళ్ళీ తలాఖ్ ఇస్తే అది ఖచ్చితంగా రెండవ తలాఖ్‌గానే లెక్కించ బడుతుంది.

రెండవ తలాఖ్ : మొదటి తలాఖ్ తరువాత ఎప్పుడైనా (ఉదాహరణకు: కొన్ని వారాల తర్వాతగానీ, కొన్ని నెలల తర్వాతగానీ, కొన్ని సంవత్సరాల తర్వాతగానీ) వారుభయుల మధ్య మళ్లీ విభేదాలు వచ్చి, మళ్లీ వ్యవహారం విడాకుల వరకూ వస్తే - అప్పుడు నియమానుసారం భర్త భార్యకు బహిష్టు అనంతరం పరిశుద్ధ స్థితిలో ఆమెతో సంభోగించకుండానే ఆమెకు రెండవసారి విడాకులిస్తే, ఆ రెండవసారి విడాకుల తర్వాత కూడా భర్తకు తన భార్యతో ఇద్దత్ కాలంలో అంగీకారానికి వచ్చే ద్వారాన్ని షరీయతు తెరచి ఉంచింది. అందుకే ఈ రెండవసారి తలాఖ్‌ను కూడా 'తలాఖె రజ్‌యీ'గా వ్యవహరించటం జరిగింది. ఒకవేళ

భర్త ఈ గడువు (ఇద్దత్) కాలంలో తన భార్యతో సంధికి రాకపోతే మూడు రుతువుల తర్వాత (మూడు నెలల తర్వాత) ఆ దంపతుల మధ్య వేర్పాటు జరిగిపోతుంది. అయితే ఈ వేర్పాటు కూడా రెండవ తలాఖ్‌తోనే (మరో విధంగా చెప్పాలంటే తలాఖె రజ్‌యీతోనే) జరిగింది గనక - ఈ తలాఖ్ తర్వాత కూడా ఆ స్త్రీ - పురుషులిద్దరూ భవిష్యత్తులో మళ్లీ ఎప్పుడయినా నికాహ్ చేసుకోదలిస్తే, నిస్సంకోచంగా చేసుకోవచ్చు. రెండు విడాకుల పద్ధతిని మరింత సులువుగా అర్థం చేసుకునేందుకు ఈ క్రింది పట్టిక దోహదకారి కాగలదు.




రెండవ విడియాకు (తలాఖె రజ్‌యీ) గడువు కాలం (మూడు నెలలు) గడిచాక ఆ స్త్రీ పునర్వివాహం చేసుకోదలిస్తే చేసుకోవచ్చు. మాజీ భర్తనుగానీ! లేదా మరో పురుషుణ్ణిగానీ!

## (ఇ) మూడు విడాకులతో విడిపోయే ధర్మసమ్మతమైన పద్ధతి


మొదటి తలాఖ్: భార్యాభర్తల మధ్య వివాహానంతరం మొదటిసారి గొడవలు వచ్చి (ఉదా:1998లో) వ్యవహారం విడాకుల దాకా వస్తే, భర్త నియమానుసారం భార్యకు బహిష్టు తరువాత - పరిశుద్ధావస్థలో ఆమెతో రమించకుండానే ఆమెకు మొదటి తలాఖ్- తలాఖె రజ్‌యీ ఇస్తే, ఆనక గడువు (ఇద్దత్)కాలంలో (మూడు రుతువుల లేదా మూడు బహిష్టుల లోగా) ఎప్పుడయినా ఆమెతో రాజీపడిపోతే, ఆ తరువాత వారిద్దరూ అన్యోన్యంగా ఉండసాగారు. కాని కొంత కాలం తరువాత (ఉదాహరణకు: 2002లో) మళ్లీ వాళ్ళిద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. వ్యవహారం మళ్ళీ విడాకుల వరకూ వచ్చింది. భర్త నియమానుసారం భార్యకు బహిష్టు తరువాత - పరిశుద్ధ స్థితిలో ఆమెతో సమాగమం జరపకుండా రెండవ తలాఖ్ (తలాఖె రజ్‌యీ) ఇస్తాడు. అయితే ఇద్దత్ (గడువు)కాలంలో, ఎప్పు

teluguislam.net



డయినాసరే మళ్లీ తన అర్ధాంగితో అంగీకారానికి వస్తాడు. ఆ తరువాత వారిద్దరూ మమేకమై సాధారణ జీవితం గడపసాగారు. కాని మళ్ళీ కొన్నేండ్ల తరువాత (ఉదా: 2006లో) ఆ ఆలుమగలలో మూడవసారి గొడవలు మొదలై తీవ్రరూపం దాల్చాయి. వ్యవహారం ఈసారి కూడా విడాకుల దాకా వచ్చింది. భర్త శాస్త్రం ప్రకారం బహిష్టు స్థితి తొలగిపోయిన తరువాత - పరిశుద్ధావస్థలో - ఆమెతో పడక సుఖం అనుభవించకుండానే మూడవసారి తలాఖ్ ఇస్తే,ఈ మూడవసారి విడాకులతో ఆ భార్యాభర్తల మధ్య శాశ్వతంగా వేర్పాటు జరిగి పోయినట్లే. లోగడ మొదటిసారి, రెండవసారి విడాకులిచ్చినప్పుడు భర్తకు తన అర్ధాంగితో అంగీకారానికి వచ్చే అవకాశం ఉండేది. కాని ఇప్పుడా అవకాశం ఉండదు. అందుకే మొదటి రెండు తలాఖులను 'తలాఖె రజ్‌యీ' (రాజీకి ఆస్కారమున్న విడాకులు)గా, మూడవసారి తలాఖ్‌ను 'తలాఖె బాయన్' (శాశ్వతంగా వేరుపడిపోయిన విడాకులు)గా వ్యవహరిస్తారు.

మూడవసారి తలాఖ్ తరువాత కూడా స్త్రీ మూడు రుతువుల (లేదా మూడు నెలల) వరకూ 'ఇద్దత్' పాటించాల్సిందే. ఇద్దత్ (గడువు)ను పూర్తి చేశాకే ఆమె వేరొక చోట, మరో పురుషుణ్ణి నికాహ్ చేసుకోగలుగుతుంది. గమనార్హమైన విషయమేమిటంటే మూడవసారి తలాఖ్‌తో విడిపోయిన ఆ దంపతులు మళ్లీ వివాహబంధంలో ఇమడాలంటే చాలా కష్టం. ఆ స్త్రీ తన ఇష్టానుసారం వేరెవరయినా పురుషుణ్ణి- జీవితాంతం అతని సహధర్మచారిణిగా ఉండే సంకల్పంతో మనువాడాలి. వారిద్దరూ మమేకం కూడా కావాలి. ఆ తరువాత ఎప్పుడైనా ఆ భర్త (రెండవ భర్త) మరణించటమో లేదా తన స్వేచ్ఛా ప్రతిపత్తితో ఆమెకు విడాకులివ్వటమో జరగాలి. ఆ తరువాత ఆ స్త్రీ ఇద్దత్ (గడువు)కాలాన్ని పూర్తిచేసి, తన మొదటి (మాజీ) భర్తను వివాహమాడదలిస్తే వివాహ మాడవచ్చు (వివరాలకు అల్ బఖరా సూరా 230వ ఆయత్ చూడగలరు). మూడు విడాకుల అనంతరం వేరుపడే పద్ధతిని గ్రహించటానికి క్రింది పట్టికలు దోహద పడతాయి.



| | | |
|---|---|---|
| బహిష్టు తర్వాత (2006లో) | పరిశుద్ధ స్థితిలో మూడవ తలాఖ్ → | తక్షణం విడిపోవటమే. అయితే ఆ స్త్రీ మూడు రుతువుల వరకూ ఇద్దత్ పాటించవలసి ఉంటుంది. |

## ఖులా

గత్యంతరం లేని స్థితిలో 'తలాఖ్' ద్వారా భార్య నుండి విడిపోయే హక్కును పురుషునికి ప్రసాదించినట్లే, అనివార్య స్థితిలో భర్త నుండి విముక్తి పొందటానికి స్త్రీకి 'ఖులా' హక్కును కూడా షరీయత్ ప్రసాదించింది. 'ఖులా'ను ఆమోదించేందుకు షరీయతు భర్తకు భార్య నుండి కొంత 'మొత్తం' తీసుకునే అనుమతిని కూడా ఇచ్చింది. అది ఇంచుమించు భార్య మహర్ హక్కుకు సమానంగా ఉండాలి. హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) సతీమణి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! నేను (నా భర్త అయిన) సాబిత్ బిన్ ఖైస్ (రజి) ధార్మికతలోగానీ, ఆయనగారి గుణగణాలలోగానీ ఎలాంటి లోపం ఎంచలేను. కాకపోతే భర్తకు అవిధేయత చూపి పాపం మూట గట్టుకోవటం నాకిష్టం లేదు. అందుకే నాకు 'ఖులా' ఇప్పించండి" అని ప్రాధేయపడింది. దానికి ఆయన(స), "మరయితే సాబిత్ మహర్ రూపేణా నీకు ఇచ్చిన తోటను తిరిగి ఇవ్వటానికి నువ్వు సిద్ధమేనా?" అని అడిగారు. "ఓ....నేనందుకు సిద్ధమే దైవప్రవక్తా(స)!" అన్నారామె. అప్పుడు దైవప్రవక్త (స) సాబిత్ బిన్ ఖైస్ (రజి)ని పిలిపించి, "నీ తోటను తీసేసుకుని, ఆమెకు నీ దాంపత్య జీవితం నుండి విముక్తిని వొసగు" అని ఆజ్ఞాపించారు (బుఖారీ). ఈ సంఘటన ద్వారా అవగతమయ్యే మరో వాస్తవమేమిటంటే, ఒకవేళ భార్యాభర్తలు పరస్పర సంప్రతింపులతో 'ఖులా' గురించి ఓ అవగాహనకు రాలేకపోయినప్పుడు భార్య షరీయతు న్యాయస్థానాన్ని ఆశ్రయించగలదు. ఆమెకు ఆమె భర్త నుండి 'ఖులా' ఇప్పించే పూర్తి అధికారం కూడా న్యాయస్థానానికి ఉంది. అయితే ఇక్కడొక విషయం గమనార్హం- షరీయతు వ్యవహారాలలో ముస్లిమేతర న్యాయస్థానంగానీ, ముస్లిమేతర న్యాయమూర్తుల తీర్పుగానీ స్వీకారయోగ్యం కాదు. కాబట్టి షరీయతు న్యాయస్థానాలు లేని దేశాలలో విద్వాంసుల బృందంగానీ, దైవభీతిపరులుగానీ, లేదా ముస్లిం పంచాయితీ సభ్యులు గానీ కేసును విచారించి తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. అట్టి తీర్పు మాత్రమే ఆచరణ యోగ్యమైనది. అయితే భవిష్యత్తులో ఎలాంటి సంక్లిష్ట సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండటానికి ముస్లిమేతర న్యాయస్థానాల నుంచి 'డిగ్రీ' పొందటం ఆక్షేపణీయం కాదు.

'ఖులా' గడువు (ఇద్దత్) ఒక నెల మాత్రమే. ఈ గడువు ముగియగానే ఆ స్త్రీ పునర్వివాహం చేసుకోగలదు.

## ఏక కాలంలో మూడు విడాకులు

వివాహానంతరం ఆలుమగలు శాయశక్తులా తోడూ-నీడగా ఉండటానికి కృషి చేస్తారు. దంపతుల మధ్య చిన్నచిన్న విభేదాలు, తగాదాలు నిత్య జీవితంలో మామూలే.

teluguislam.net



వివేకవంతులైన భార్యాభర్తలు వీలయినంత వరకు వీటిని సర్దుకుపోవటానికి యత్నిస్తారు. కాని ఈ విభేదాలు చిలికి చిలికి గాలివానగా మారి పరస్పరం ద్వేషానికి, ప్రతీకారానికి తావు కలిగితే విడియాకులే శరణ్యమవుతుంది. కాని విడాకుల విషయంలో ఆలోచనతో, విజ్ఞతతో, నిగ్రహంతో వ్యవహరించే పురుషులు అరుదుగానే ఉంటారు. షరీయతు ఆజ్ఞల గురించి తెలిసిన వారైతే బహుతక్కువగా ఉంటారు. చాలామంది గొడవ జరిగినప్పుడు ఆవేశానికి లోనై విడాకులకు (తలాఖ్‌కు) పూనుకుంటారు. ఈ సందర్భంగా షరీయత్ ఆదేశాలేమిటో తెలీక పోవటం చేత ఒకే సమయంలో మూడు విడాకులు (మూడు తలాఖ్‌లు లేదా అంతకన్నా ఎక్కువసార్లు కూడా) పలుకుతారు. ఇది షరీయత్‌కు విరుద్ధమేకాదు, చాలాపెద్దపాపం కూడా.

మహాప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర జీవిత కాలంలో ఒక వ్యక్తి తన శ్రీమతికి ఏక కాలంలో మూడు విడాకులు (మూడు తలాఖ్‌లు) ఇచ్చాడు. ఈ సంగతి తెలుసుకున్న మహాప్రవక్త (స) ఆగ్రహంతో కూర్చుని ఉన్నవారల్లా లేచి నిలబడి, "నేనుండగానే దైవగ్రంథంతో చెలగాటమా?" అని అన్నారు. అక్కడున్న ఒక వ్యక్తి ఈ మాటలకు స్పందిస్తూ, "దైవప్రవక్తా (స)! నేనతన్ని హతమార్చనా!?"అన్నాడు (నసాయి). దైవప్రవక్త (స) వారి ఈ పలుకులను బట్టి ఇస్లామీయ షరీయతులో, ఏకకాలంలో మూడు తలాఖ్‌లు ఇవ్వటం ఎంత పెద్ద పాపమో ఊహించటం కష్టం కాదు. దీనికి ముఖ్య కారణమేమిటంటే, కుటుంబాన్ని వినాశంపాలు కాకుండా షరీయతు ఏ పరమార్థాలను, యుక్తిని ప్రవేశ పెట్టదలిచిందో వాటిని 'తలాఖ్..... తలాఖ్.......తలాఖ్' అంటూ ఏకకాలంలో మూడు విడాకుల అస్త్రం ప్రయోగించిన వ్యక్తి కాలరాసాడన్నమాట! అంతేకాదు, అతను దైవప్రవక్త (సఅసం)కు అవిధేయత చూపిన వాడుగా కూడా నిరూపించుకుంటున్నాడు! అయితే దైవప్రవక్త(స) ఒకేసారి మూడు తలాఖ్‌లు ప్రయోగించినవానిపై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ, ఆ మూడు విడాకులను మూడుగా కాకుండా ఒకే విడాకు (ఒకే తలాఖ్)గా పరిగణించి, ముస్లిం సముదాయాన్ని పెద్ద పరీక్ష (ఆపద) నుండి రక్షించారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) కాలంలోనూ, హజ్రత్ అబూబకర్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలోనూ, హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫా అయిన మొదటి రెండేళ్ళ వరకు కూడా ఒకేసారి మూడు తలాఖ్‌లు ప్రయోగించిన వ్యక్తి తలాఖులను మూడు తలాఖులుగా కాకుండా 'ఒకే తలాఖ్'గా పరిగణించటం జరిగేది. తరువాత ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) జనుల దూకుడు స్వభావంపై కోపగించుకున్నారు. ఆయన (రజి) ఇలా అన్నారు: "ప్రజలు మరీ తొందరపడుతున్నారు. వారికి ఇవ్వబడిన వెసులుబాటును దుర్వినియోగపరుస్తున్నారు. కాబట్టి (ఏక కాలంలో వారు ఇచ్చిన మూడు విడాకులను) ఇక మీదట మూడు విడాకులుగా చెల్లుబాటు చెయ్యడం సమంజసంగా ఉంటుంది." ఆ విధంగా ఆయన (రజి) ఈ ఉత్తర్వును ప్రవేశపెట్టారు.

(ముస్లిం- కితాబుత్తలాఖ్ అస్సులాస్)

దైవప్రవక్త (స) వారి పవిత్ర సంప్రదాయం ద్వారానూ, ఇరువురు మార్గదర్శక ఖలీఫాల విధానం ద్వారానూ మూడు విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. అవేమంటే-

(అ) ఏక కాలంలో మూడు విడాకులివ్వటం ఇస్లామీయ షరీయతు దృష్ట్యా మహాపాతకం.

(ఆ) ఒకేసారి మూడు తలాఖ్‌లను ప్రయోగించిన వ్యక్తిని పాపాత్ముడుగా ఖరారు చేసినప్పటికీ ఇస్లామీయ షరీయతు అతని మిగిలిన రెండు అవకాశాలను హరించ లేదు. అతనిచ్చిన మూడు విడాకులను 'ఒకే విడాకు'గా లెక్కించి, అతనిపై దయ దలచింది.

(ఇ) ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) గారు ప్రజలను ఒకేసారి మూడు తలాఖ్ అస్త్రాలను ప్రయోగించే ధోరణి నుండి ఆపటానికి - తగిన శాస్తిగా మూడు తలాఖ్‌లను మూడుగా చెలామణీ చేశారు. అయితే ఇది హజ్రత్ ఉమర్(రజి)గారి 'ఇజ్తెహాద్'! ప్రజాబాహుళ్యంలో దిద్దుబాటు కోసం షరీయతు సూత్రాల అన్వయింపుకై తన తరపున చేసిన ఒక ప్రయత్నమది! అంతేగాని ఇస్లామీయ శాసనాంగంలో అది శాశ్విత చట్టం కాదు.

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ విడాకుల ఆదేశాలను గురించి విశదీకరిస్తూ ఇలా సెలవిచ్చాడు: "మీరు మీ స్త్రీలకు విడాకులిస్తున్నప్పుడు, వారి గడువు ప్రకారం విడాకులివ్వండి." (అత్ తలాఖ్-1) దీని భావమేమిటంటే, ఒకసారి విడాకులిచ్చిన పిమ్మట వారి కొరకు ఏ గడువు (అంటే మూడు రుతువుల గడువు) నిర్ధారించబడిందో, దాన్ని పూర్తి చేయండి. ఆ తరువాతే రెండవ విడియాకు (రెండవ తలాఖ్) ఇవ్వండి. అదే విధంగా రెండవ విడియాకు గడువు ముగిసిన తరువాత మూడవ విడియాకు ఇవ్వండి. ఒకేసారి మూడు తలాఖ్‌లు ఇచ్చినవాడు మొదటి, రెండవ తలాఖ్‌ల గడువు (ఇద్దత్) పూర్తి కాకుండానే విడాకులిచ్చేశాడన్నమాట! కాగా; మొదటి తలాఖ్ తరువాత రాజీపడటమో లేదా మూడు నెలల గడువు కాలాన్ని పూర్తి చేయటమో చేసి ఉండాల్సింది. ఇది తప్పనిసరి. ఒకే సిట్టింగ్‌లో మూడు తలాఖ్‌లు ఇచ్చిన పక్షంలో 'మొదటి తలాఖ్' అయితే అయిపోతుంది. కాని రెండవ, మూడవ తలాఖ్‌లు నిర్ధారిత గడువుకన్నా ముందే ఇచ్చిన కారణంగా వీగి పోతాయి, చెలామణీ కావు. ఈ విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవటానికి దివ్యఖుర్‌ఆన్‌లో నమాజ్‌కు సంబంధించి ఇవ్వబడిన ఉపమానాన్ని పేర్కొనవచ్చు. అందులో ఇలా ఆదేశించబడింది: "నిస్సందేహంగా నమాజును నిర్ధారిత వేళల్లో చేయటం విశ్వాసులకు విధిగా చేయబడింది" (అన్ నిసా-103). దీని భావమేమిటంటే, ఫజ్ర్ నమాజును ఫజ్ర్ వేళలోనే చేయాలి. జుహ్ర్ నమాజు జుహ్ర్‌వేళలో, అస్ర్ నమాజు అస్ర్ వేళలో, మగ్రిబ్ నమాజు మగ్రిబ్ వేళలో, ఇషా నమాజు ఇషా వేళలో సలపటం విధిగా చేయబడింది. ఇప్పుడు మీరే చెప్పండి - ఎవరయినా ఒకవేళ ఐదు నమాజులను ఒకే సమయంలో- ఫజ్ర్ వేళ- చేసేస్తే అతని నమాజులు దైవసన్నిధిలో ఆమోద ముద్ర పొందుతాయా? ఫజ్ర్ నమాజ్ ఒక్కటే ఆమోదించబడుతుంది. ఎందుకంటే అది వేళకు ఆచరించబడింది గనక. అయితే జుహ్ర్ నమాజ్ కొరకు జుహ్ర్ వేళ వరకూ వేచి ఉండక తప్పదు. మిగిలిన నమాజుల విషయం కూడా ఇంతే. కాబట్టి తేలిందేమిటంటే ఒకవేళ ఎవరయినా ఫజ్ర్ వేళ మొత్తం ఐదుపూటల నమాజు చేసేసినప్పటికీ-

నిర్ధారిత వేళల్లో నిర్ధారిత నమాజులను మళ్లీ చేయక తప్పదు. అలాగే ఏక కాలంలో ఎవరైనా మూడు తలాఖ్‌లు ఇచ్చేసినట్లయితే, అతని తరపున మొదటి తలాఖ్ మాత్రం నెరవేరుతుంది. కాని రెండవ, మూడవ తలాఖ్‌ల కోసం షరీయతు నిర్ధారించిన నియమ నిబంధనలను పాటించవలసి ఉంటుంది. అన్యధా అవి స్వీకారయోగ్యం కాజాలవు.

ఏడు ముస్లిం దేశాలైన ఈజిప్టు, సూడాన్, జోర్డాన్, మొరాకో, ఇరాఖ్, సిరియా, పాకిస్తాన్‌లలో ఏక కాలంలో ఇవ్వబడిన మూడు విడాకులను ఒకే విడాకుగా పరిగణించటం జరుగుతోంది.

కొంతమంది విద్వాంసుల దృష్టిలో ఏక కాలంలో ఇవ్వబడిన మూడు విడాకులు 'మూడు విడాకులు'గానే లెక్కించబడతాయి. అయితే దిగువ ఇవ్వబడిన కారణాల దృష్ట్యా ఈ అభిమతాన్ని మేము అంగీకరించలేకపోతున్నాము.

1. దైవప్రవక్త (స) తన జీవితకాలంలో ఒకేసారి ఇవ్వబడిన మూడు విడాకులను ఒకే విడియాకుగా పరిగణించారు. దైవప్రవక్త(స) వారి సంప్రదాయం (సున్నత్) ఒక మచ్చుతునకగా ఉండగా హజ్రత్ ఉమర్(రజి)గారి షరీయత్ అన్వయింపు (ఇజ్తెహాద్) తర్కం కాజాలదు.

   అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను మించిపోకండి." (అల్ హుజురాత్-1)

2. ఇమామ్ ముస్లించే పొందుపరచబడిన హదీసులో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) చెప్పిన దాని ప్రకారం హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) పరిపాలనా కాలంలోనూ, హజ్రత్ ఉమర్ (రజి)గారి హయాంలోని మొదటి రెండు సంవత్సరాలలోనూ ఈ వ్యవహారంపై ప్రవక్త సహచరులందరి (రజి) మధ్య ఏకాభిప్రాయమే ఉంది.

3. హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి)గారి అన్వయింపు (ఇజ్తెహాద్) తరువాత ఏకకాలంలో ఇవ్వబడిన మూడు విడాకులను 'మూడు విడాకులు'గా పరిగణించే విషయమై కూడా ముస్లిం సముదాయంలో ఎన్నడూ ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రవక్త సహచరులలోనూ, వారి అనుయాయుల్లోనూ , ఇమాములలోనూ ఈ వ్యవహారంపై ద్వంద్వాభిప్రాయం ఏర్పడింది. ఇంతకు ముందు పేర్కొనబడిన ఏడు ముస్లిం దేశాలలో, ఒకేసారి ఇవ్వబడిన మూడు తలాఖులను 'ఒకే తలాఖ్'గా లెక్కించే శాసనం కూడా దీనికి ప్రబల తార్కాణమే.

4. కొంతమంది విద్వాంసులు ఇమామ్ ముస్లిం పొందుపరచిన హదీసుకు ఇలా భాష్యం చెప్పారు: "తొలి కాలంలో ప్రజలలో ద్రోహబుద్ధి దాదాపు కానవచ్చేది కాదు. అందుచేత మూడు విడాకులు ఇచ్చిన వాని వివరణకు భావం 'ఒకే తలాఖ్'గా తీసుకోబడేది. మిగిలిన రెండు విడాకుల పలుకులను కేవలం తాకీదుగా మాత్రమే పరిగణించేవారు. అయితే తరువాత ప్రజలు విడాకులను సాకుగా (ఒక ప్రహసనం)గా తీసుకుంటున్నారని భావించిన హజ్రత్ ఉమర్ (రజి) ఆ సాకును ఆమోదించేందుకు నిరాకరించారు."

మా దృష్టిలో ఈ భాష్యం ప్రమాదకరమైనది. ఒకానొక ఫిక్హ్ సమస్యకై తొలికాలపు అనుచరుల గురించి ఏదేదో ఊహించుకోవటం, ఉమర్ ఫారూఖ్ (రజి) కాలంలోనే ప్రవక్త సహచరుల (రజి)లో నుంచి సచ్ఛీలత, నిజాయితీ తత్పరత లేకుండా పోయిందని లేదా తగ్గుముఖం పట్టిందని కాకిలెక్కలు వేయటం ఎంతకీ తగదు. పైగా ఈ ఊహాజనిత ధోరణి ఎన్నో ఉపద్రవాలకు దారి తీస్తుంది. మా దృష్టిలో ప్రవక్త ప్రియసహచరుల (రజి)పై నీలాప నిందలు మోపటం కన్నా హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) గారి హదీసును యథా తథంగా అంగీకరించటం మిన్న.

5. ప్రస్తావిత హదీసులో హజ్రత్ ఉమర్ (రజి) ఒకే సిట్టింగులోని మూడు తలాఖులను 'మూడు తలాఖులు'గా ప్రవేశపెట్టడానికి ప్రధాన కారణం ప్రజల తొందరపాటుతనం (దూకుడు స్వభావం) అన్నారేగాని ప్రజల తప్పుడు స్టేట్‌మెంట్ అని అనలేదు. హజ్రత్ ఉమర్ (రజి) చూపిన కారణాన్ని వదిలేసి, తమ తరఫున ఒక కారణాన్ని కల్పించుకుని దాన్ని హజ్రత్ ఉమర్ (రజి)కు ఆపాదించటం ఖుద్దుగా నిజాయితీకి విరుద్ధం.

6. మూడు విడాకులను మూడు విడాకులుగా అంగీకరించిన మీదట దానివల్ల పొడసూపే చెడు పర్యవసానాలు స్వయంగా చాటిచెబుతాయి. ఏక కాలంలో ఇవ్వబడిన మూడు విడాకులను (మూడు విడాకులుగా) ప్రవేశపెట్టే ప్రక్రియ దండించే చర్య కాగలదుగాని శాశ్విత చట్టంగా ఉండజాలదని!
మొదటిది: ఈ ప్రక్రియ మూలంగా తలాఖ్ ఇచ్చే వ్యక్తి బాగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి రావటానికి షరీయత్ ప్రసాదించిన గడువుకు నోచుకోకుండా పోతాడు.
రెండవది: విడాకుల తర్వాత ఆ దంపతులిద్దరూ ఆవేశంలో చేసిన పొరపాటుకు బాధపడతారు. అప్పుడు మగవాడు తాను విడాకులిచ్చిన స్త్రీని మళ్లీ అర్ధాంగిగా పొందేందుకు, ఆమెను 'హలాలా' ప్రహసనం కోసం ఒప్పిస్తాడు. చూడబోతే ఈ తంతు ఇస్లాం స్వభావానికి ఏమాత్రం సరిపడదు.

పైన పేర్కొనబడిన ఆధారాలు, నిదర్శనాల దృష్ట్యా ఏ రకంగా చూసినా ఏక కాలంలో ఇవ్వబడిన మూడు విడాకులను 'ఒకే తలాఖ్'గా పరిగణించటమే షరీయతు యొక్క సరైన ఆదేశం. నిజము దేవుడెరుగు.

ఇక్కడొక విషయం మరువరాదు- ఒకే సమయంలో ఇచ్చిన మూడు విడాకులు మూడు విడాకులుగా లెక్కించబడతాయా లేదా ఒకే విడియాకుగానా? అన్న విషయాన్ని అలా పక్కన పెడితే, ఒకే సమయంలో మూడు విడాకులు ఇవ్వటం పెద్ద పాపం. ఇది కేవలం దైవప్రవక్త (స) సంప్రదాయానికి విరుద్ధమే కాదు, షరీయతు మూడు వేర్వేరు విడాకుల

ద్వారా అనుగ్రహించిన పరమార్థాలను కాలరాయటమే. అందుకే హజ్రత్ ఉమర్ (రజి) తన హయాంలో, ఒకేసారి మూడు విడాకులు ఇచ్చిన వారికి మూడు విడాకులుగా ఆమోదించి, అమలు పరచటంలోని ఉద్దేశ్యం వారిని దండించటమే. పైగా అలాంటి సాహసానికి పాల్పడిన వారికి ఆయన (రజి) శారీరక శిక్ష కూడా విధించేవారు. అలా చేయటం లోని ఆయన ఉద్దేశం; ఒకే సిట్టింగులో మూడు విడాకుల అస్త్రాన్ని సంధించటం పాపకార్యం అని స్పష్టం చేయటం, ఇంకా ఆ నేరానికి జనులు పాల్పడకుండా అరికట్టడమే. అందువల్ల ఇస్లామీయ విద్వాంసులు, ధర్మవేత్తలు ఇస్లాంలోని ఇతరత్రా ఆదేశాలను ముందుంచుకుని (ఉదాహరణకు: జిహార్ మొదలగునవి) ఏకంగా మూడు విడాకులిచ్చే వాడికి తగు శిక్షను ప్రతిపాదించాలి. ఆ విధంగానయినా సున్నత్‌కు వ్యతిరేకంగా ఉన్న తలాఖ్ పోకడను నివారించ వచ్చు.

## హలాలా

దివ్యఖుర్‌ఆన్‌లోని అల్ బఖరా సూరా 230వ ఆయత్ భావమేమిటంటే, ఒక వ్యక్తి తన భార్యకు మూడు వేర్వేరు సమయాలలో మూడు విడాకులిస్తే, ఇక ఆ వ్యక్తి ఆ స్త్రీని వివాహమాడలేడు. ఒకవేళ భవిష్యత్తులో ఆ స్త్రీ అతనికి ధర్మబద్ధంగా అర్ధాంగి కావాలంటే, ఆమె తన ఇష్టప్రకారం వేరొక పురుషుణ్ణి- జీవితాంతం సహధర్మచారిణిగా ఉండే సదుద్దేశంతో- పెళ్లి చేసుకోవాలి. ఆ భార్యాభర్తలు లైంగికంగా ఏకం కావాలి. వారిద్దరూ కాపురం చేస్తూ విధివశాత్తు ఆమె భర్త చనిపోవటమో లేదా మనస్ఫూర్తిగా భర్త ఆమెకు విడాకులివ్వటమో జరగాలి. అప్పుడా స్త్రీ ఇద్దత్ (గడువు) కాలం పూర్తి చేసిన తరువాత, తన మాజీ భర్తను వివాహమాడదలిస్తే వివాహమాడవచ్చు. అయితే ఈ ఆయతు వెలుగులో కొందరు స్వార్థపరులైన విద్వాంసులు మూడు విడాకులు పొందిన మహిళను, ఆమె మాజీ భర్తకు మళ్లీ కట్టబెట్టడానికి ఒక 'వంక'ను సృష్టించారు. దానికోసం వారు ఆ విడాకులు పొందిన స్త్రీని తాత్కాలికంగా మరో మగాడితో నికాహ్ జరిపిస్తారు. ఒక రోజో, రెండ్రోజులో అతడామెతో గడిపిన తర్వాత ఆమెకు విడాకులిప్పించి, ఆమెను మాజీ భర్తతో నికాహ్ జరిపించేందుకు హలాలా (సమ్మతం) చేయిస్తారు.

ఒక స్త్రీని ఆమె మాజీ భర్త కొరకు హలాల్ (ధర్మసమ్మతం) చేయించేందుకు జరిపించే ఈ 'తంతు'ను 'హలాలా' అంటారు. ఈ తంతుకు పాల్పడిన వాణ్ణి 'ముహల్లిల్'గా వ్యవహ రిస్తారు. ఇక ఎవరి కోసం ఈ తంతు జరిపించబడుతుందో అతన్ని 'ముహల్లల్ లహు' అంటారు.

దివ్యఖుర్‌ఆన్‌లోని ఆజ్ఞకు - హలాలాకు మధ్య గల వ్యత్యాసం క్రింది పట్టిక ద్వారా సులభంగా అర్థం చేసుకోవచ్చు.

| వ.సంఖ్య | షరీయతు ఆజ్ఞలు | నికాహ్ మస్నూన్ (సాంప్రదాయక వివాహం) | నికాహ్ హలాలా |
|---|---|---|---|
| 1 | సంకల్పం | జీవితాంతం సహజీవనం సాగించే తలంపు | ఒక రాత్రి లేక రెండు రాత్రుల తర్వాత విడాకులు పొందే సంకల్పం |
| 2 | ఆశయం (లక్ష్యం) | సంతాన ప్రాప్తి | వేరొక పురుషుడి కోసం స్త్రీని హలాల్ (ధర్మసమ్మతం)చేయటం |
| 3 | స్త్రీ సమ్మతి | తప్పనిసరి | ఆమె అనుమతితో గానీ, ఇష్టంతోగాని నిమిత్తం ఉండదు |
| 4 | కుఫ్వ్ | ధార్మికత, వంశపరంపర, ఆస్తీ అంతస్తు, అందచందాలు అన్నీ చూడబడతాయి | ఇవేవీ చూడబడవు |
| 5 | మహర్ | చెల్లించటం విధి | మహర్ నిర్ధారణగానీ, చెల్లించటం గానీ ఉండదు |
| 6 | పెళ్ళి ప్రకటన, ఆహ్వాన పత్రాలు | పెళ్ళి జరుగుతున్నట్లు చెప్పటం, ప్రకటించటం సత్సంప్రదాయం | ఈ విషయం గోప్యంగా ఉంచబడుతుంది |
| 7 | వలీమా | సంతోష పూర్వకంగా వలీమా విందుకు ఆహ్వానిస్తారు | వలీమా ఉండదు |
| 8 | వీడ్కోలు | గౌరవ మర్యాదలతో పుట్టింటి నుండి వధువుకు వీడ్కోలు ఇచ్చి సాగనంపుతారు | స్త్రీ స్వయంగా 'ముహల్లిల్' దగ్గరకు వెళుతుంది |
| 9 | ఇంటి సామగ్రి | వధువు తల్లిదండ్రులు తమ స్థోమతను బట్టి సమకూరుస్తారు | ఇలాంటివేమీ ఉండవు |
| 10 | వధూవరుల భావాలు, భావోద్రేకాలు | సంతోషాతిశయంతో ఉవ్విళ్ళూరుతుంటాయి | ఒకింత ద్వేషంతో, ఒకింత సిగ్గుతో కూడుకుని ఉంటాయి |

teluguislam.net


| | | | |
|---|---|---|---|
| 11 | అప్పులు, బంధుమిత్రుల శుభాకాంక్షలు శుభాశీస్సులు | బంధుమిత్రులు సంతోషంతో వచ్చి శుభాకాంక్షలు తెలుపుతారు. ఆశీర్వదిస్తారు | నలువైపుల నుంచీ ఛీత్కారాలు, శాపనార్థాలు ఎదురవుతాయి |
| 12 | వధువు అలంకరణ | చెలికత్తెలొచ్చి నవ్వుతూ నవ్విస్తూ సింగారిస్తారు | వధువు అయ్యే భావనే ఉండదు |
| 13 | తొలిరేయి ఏర్పాట్లు | అత్తింటివారు పడక గదిని సంతోషంతో అలంకరిస్తారు | అత్తవారన్న ఆలోచనే అసలు ఉండదు |
| 14 | వధువు కోసం వరుని ఏర్పాట్లు | కాబోయే అర్థాంగికోసం కావలసినవి సమకూర్చుకుంటాడు | 'ముహల్లిల్' (తంతు ముగించేందుకు కట్టుకున్నవాడు) అలాంటి ఏర్పాట్లేమీ చేయడు |
| 15 | భరణం, మనోవర్తి | భార్య పోషణాభారం భర్తపై ఉంటుంది | కాగల కార్యం తీర్చినందుకు 'ముహల్లిల్' డబ్బు గుంజుకుంటాడు |

సాంప్రదాయక వివాహం (నికాహ్)లోనూ, హలాలాలోనూ వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది కదూ! నికాహ్ చేసుకున్నవాడు ప్రవక్త (స) సంప్రదాయాన్ని అనుసరించాడు. హలాలాకు ఒడిగట్టినవాడు ప్రవక్త (స) సంప్రదాయానికి విరుద్ధంగా పోయాడు. నికాహ్ నిలువెల్లా కారుణ్యం, సుఖప్రదాయిని. హలాలా నిలువెల్లా ధూత్కారం, నిందార్హం. నికాహ్ నిలువెల్లా గౌరవ మర్యాదలకు ప్రతీక. హలాలా నఖశిఖ పర్యంతం నీతి బాహ్యతకు, వ్యభిచారానికి దారి తెరిచే వెకిలిచేష్ట. అందుకే మహనీయ ముహమ్మద్ (స) వారు 'హలాలా'కు పాల్పడిన వాడిని కిరాయి మొగుడుగా అభివర్ణించారు (ఇబ్నుమాజ1936). వేరొక హదీసులో ఉంది: "హలాలా చేసినవాడు, చేయించినవాడు- ఇద్దరూ ధూత్కారులే" (తిర్మిజీ1119). ఈ విధంగా దైవప్రవక్త (సఅసం) వారి ప్రవచనాల ఆధారంగా హలాలా పరమ దుర్మార్గమని అవగతమవుతూనే ఉంది. 'హలాలా' చేష్ట కోసం సాకులు వెదికేవారికి ఒక ప్రశ్న వేయవచ్చు- ఒకవేళ హలాలా ధర్మసమ్మతమే అయితే షియా వర్గీయులలో చెలామణీలోనున్న 'ముతా' ఎందుకు నిషిద్ధం అయింది? ఈ రెండింటి స్వభావ స్వరూపాలు ఇంచుమించు ఒక్కటే. రెండు పరిస్థితుల్లోనూ ఎంతో కొంత 'ప్రతిఫలం' నిర్ధారించి ఒక పరిమిత గడువు కొరకు వివాహ ఒప్పందం చేయబడుతుంది. ఆ తరువాత వారిరువురి మధ్య విడియాకు అనేది ముందుగా నిర్ధారించుకున్న పథకం అయి ఉంటుంది. మరి ఈ రెండింటిలోనూ క్రియాత్మ కంగా తేడా ఏముందనీ? సారాయికి 'పాలు' అని నామకరణం చేసినంత మాత్రాన సారాయి పాలు అయిపోతుందా?

హజ్రత్ ఉమర్ (రజి) తన ఖిలాఫత్ కాలంలో, ఒకేసారి మూడు విడాకులిచ్చే అపరాధాన్ని అరికట్టడానికి, వాటిని మూడు విడాకులుగా పరిగణించే శాసనాన్ని ప్రవేశ పెట్టడమే గాకుండా 'హలాలా' చేష్ట చేసిన వానిపై, చేయించిన వానిపై రాళ్ళు రువ్వే ఆర్డినెన్సును కూడా జారీ చేశారు. ఈ రెండు చట్టాల ఉద్దేశ్యం ఒక్కటే- జనుల దూకుడు స్వభావానికి గాను తగిన శాస్తి జరగాలి! వీలయినంతవరకు ఈ చేష్ట నుండి జనులను ఆపాలి!! ఏకకాలంలో మూడు విడాకులిచ్చిన వ్యక్తి జీవితాంతం పశ్చాత్తాప కన్నీరు కారుస్తూ ఉంటాడు. మరోవైపు 'హలాలా' వంటి శాపగ్రస్త చేష్టను ఆలోచించగానే అతనికి గగుర్పాటు కలుగుతుంది. ఏక కాలంలో మూడు విడాకులిచ్చే అపరాధాన్ని అరికట్టడానికి ఇంతకన్నా కఠిన శిక్ష ఏముంటుంది?

హజ్రత్ ఉమర్ (రజి)గారి మొదటి శాసనాన్ని ఆధారంగా తీసుకుని ఏకకాలంలో ఇవ్వబడిన మూడు విడాకులను 'మూడు'గా లెక్కించే ప్రబుద్ధులు, ఆయన (రజి)గారి రెండవ శాసనాన్ని (హలాలాకు పాల్పడిన వానిపై రాళ్ళు రువ్వే శాసనాన్ని) గోప్యంగా ఉంచటమేగాక, ఆ లత్కోరు చేష్టకై దొడ్డిదారి చూపించటాన్ని ఏమనాలి? అది వారి మొండి ధైర్యం అనాలా? దుస్సాహసం అనాలా? అపచారం అనాలా?

'హలాలా'లోని అత్యంత విషాదకరమైన, శోచనీయమైన ఒక పార్శ్వం ఏమంటే,ఒకేసారి మూడు విడాకులిచ్చే నేరానికి ఒడిగట్టేవాడు పురుషుడైతే, దాని శిక్షను అనుభవించేది స్త్రీ.

మొదటిది: నేరం ఒకరిదైతే, శిక్ష అనుభవించాల్సింది మరొకరన్న గుడ్డి శాసనం ఇస్లాం మూల సూత్రాలకు విరుద్ధం. దివ్యఖుర్ఆన్‌లో ఈ విషయమై చాలా స్పష్టంగా చెప్పబడింది- 'బరువును మోసేవాడెవడూ మరొకరి బరువును మోయడు' (ఫాతిర్-18).

రెండవది: మగవాడు చేసిన ఈ మూర్ఖత్వపు నేరానికి పడే శిక్షను పౌరుషమున్న ఏ ఆడదిగానీ, పౌరుషమున్న ఏ మగవాడుగానీ అనుభవించరు.

రోషంగానీ, స్వాభిమానంగానీ లేశమయినా లేని ఈ ఆజ్ఞ అల్లాహ్ తరఫున గాని ఇవ్వబడిందా? అందరికన్నా ఎక్కువ పౌరుషవంతుడైన ఆ సృష్టికర్త ఈ మేరకు ఆదేశించలేదే!? దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవీయబడింది: "(ఓ ప్రవక్తా!) వారిని అడుగు- " సిగ్గుమాలిన పనులు చెయ్యమని అల్లాహ్ ఎన్నటికీ ఆజ్ఞాపించడు. మీకు ఏ విషయాలైతే తెలియవో అల్లాహ్‌కు అటువంటి వాటిని ఆపాదిస్తారేమిటి?" (అల్ ఆరాఫ్-28)

# ఇస్లాం - సమత్వం, సమతూకంతో కూడిన ధర్మం

సామాజిక జీవితంలో వివాహం- విడాకులు ఎనలేని ప్రాముఖ్యాన్ని సంతరించు కున్నాయి. అదే సమయంలో ఇతరత్రా మతాలలో మిగతా విషయాల మాదిరిగానే వివాహం - విడాకుల విషయంలో కూడా రెండు అతివాదాలు ఉన్నాయి. క్రైస్తవ మతంలో ఒకప్పుడు మతపరంగానూ, శాసనపరంగానూ విడాకులకు అనుమతి ఉండేదికాదు. సంసార జీవితం నరకతుల్యంగా మారినాసరే భార్యకు విడాకులిచ్చే అధికారం భర్తకు గానీ, భర్త నుంచి

teluguislam.net


వేర్పడే స్వేచ్ఛ భార్యకు గానీ ఉండేది కాదు. ఇంతకీ ఈ కఠోర వైఖరికి కారణం ఈసా (అలైహిస్సలాం - ఏసుక్రీస్తు)వారి ప్రవచనమే. "దేవుడు కలిపిన వారిని మానవుడు విడదీయరాద"ని ఆయన చెప్పారు (మత్తయి-19:6). విడాకులు పెచ్చరిల్లకుండా చేయటం దీని ప్రధాన ఉద్దేశం. ఇస్లాం కూడా విడాకులను "అవాంఛనీయ" విషయంగా ఖరారు చేసింది. అయితే క్రైస్తవులు మత వ్యవహారాలలో అతివాదానికి పోయిన కారణంగా ఏసుక్రీస్తు (అలైహిస్సలాం) ప్రవచనం ప్రాతిపదికపై విడాకులను పూర్తిగా నిషిద్ధం (హరామ్) చేసేసు కున్నారు. ఆలుమగల మధ్య సహజీవనానికి ఎలాంటి ఆస్కారం లేకుండా పోయినప్పుడు ఆఖరి మార్గాంతరంగా ఆ దంపతులు వేరైపోవచ్చుగాని, ఆ తరువాత ఇక వారు పునర్వివాహం చేసుకోరాదన్నది క్రైస్తవ శాస్త్రం. ఈ శాసనానికి ఆధారం ఇంజీల్ (బైబిల్)లోని ఈ ఆదేశం: "ఎవరయినా తన అర్ధాంగిని వ్యభిచార పాపానికి తప్ప వేరితర కారణంపై విడాకులిచ్చి, రెండో పెళ్ళి చేసుకుంటే వాడు వ్యభిచారానికి పాల్పడినట్లే" (మత్తయి-19:6). ఈ శాసనం కూడా విడాకులు పెరిగిపోకుండా ఆపడానికే చేయబడింది. కాని క్రైస్తవ విద్వాంసులు దీనికి విపరీత భాష్యం చెప్పి, దీనిని మొదటి చట్టం కన్నా ఎక్కువ కఠినమైనదిగా మార్చేశారు. ఈ చట్టంలోని ఆంతర్యం ఏమిటంటే- విడాకుల తరువాత ఆ స్త్రీ పురుషులు జీవితాంతం సన్యాసులు గానయినా ఉండిపోవాలి లేదా వ్యభిచారులుగానయినా మారిపోవాలి. కాని పునర్వివాహం మాత్రం తగదు- ఇది ఒక అతివాదం.

క్రైస్తవ సమాజంలోని మరో అతివాదాన్ని కూడా చూడండి- ఇది మొదటి అతివాదానికి పూర్తిగా భిన్నమైంది, మొదటి రకం అతివాదానికి ప్రతిస్పందనగా ముందుకు వచ్చిన అతివాదమిది! దీని ప్రకారం విడాకులిచ్చే అధికారం పురుషునితోపాటు స్త్రీకి సమానంగా ఉంటుంది. స్త్రీ పురుషులు ఒండొకరికి విడాకులివ్వటం, జీవిత భాగస్వామిగా ఎంపిక చేసుకోవటం బట్టలు మార్చుకున్నంత సులువు. ఒక సర్వే ప్రకారం బ్రిటన్‌లో గత మూడేళ్ళలో విడాకుల రేటు ఆరింతలు పెరిగిపోయింది. స్వీడన్‌లో జరిగే సగం వివాహాలు విడాకులతోనే ముగుస్తాయి. ఫిన్‌లాండ్‌లో విడాకుల రేటు 58 శాతం ఉంది (నిదాయె మిల్లత్, లాహోర్- 1997 ఫిబ్రవరి 21). అమెరికాలోని జనగణన బ్యూరో నివేదిక ప్రకారం అమెరికాలో ప్రతిరోజూ 7వేల జంటలు వివాహ బంధంలో ఇముడుతున్నాయి. వారిలో మూడువేల మూడు వందల జంటలు (అంటే దాదాపు 50శాతం) విడాకుల ద్వారా విడిపోతున్నాయి. (ఉర్దూ న్యూస్, జెద్దా-1996, డిశంబర్ 19).

ముందుకు సాగేముందు భారతదేశంలోని హైందవ ధర్మంలో వివాహం - విడాకుల చట్టాన్ని కూడా స్థూలంగా చూద్దాం.

## వివాహ చట్టాలు

హైందవ ధర్మంలో ఎనిమిది రకాల వివాహాలున్నాయి. పెళ్ళి చేసుకోగోరేవారు పరస్పరం ఇష్టపడినప్పుడు ఈ అన్ని రకాల వివాహాలు సమ్మతమైనవే.

అష్ట వివాహాలు:

1. బ్రహ్మ వివాహం : తల్లిదండ్రులు శక్తి కొలదీ వస్త్రభూషణాదులతో తమ కూతురిని అలంకరించి వరుడి చేతిలో కూతురు చేతిని కలుపుతారు.
2. ప్రాజాపత్యం : వధూవరులు ఒకచోట సుఖంగా ఉంటూ ధర్మాచరణం చేస్తారనే బుద్ధితో వరునికి కన్యాదానం చేయటం. ఈ సంప్రదాయంలో కన్యాశుల్కం ఉండదు.
3. అర్షం : కన్య తల్లిదండ్రులకు కన్యాశుల్కంగా వరుడు ఒక ఆవును, ఒక ఎద్దును ఇచ్చి, కన్యాదానం గ్రహించటం.
4. దేవ వివాహం : యజమాని తన గృహంలో దైవ యజ్ఞం చేసి, ఆ యజ్ఞాంతంలో తన పుత్రికను ఋత్వుజునికి ధారాపూర్వకంగా దానం చేయటం.
5. గాంధర్వ వివాహం : పెద్దల అనుమతి లేకుండా ఒకరి కొకరు అర్పించుకునే పద్ధతి.
6. అసుర వివాహం : వరుని నుంచి కన్య తల్లిదండ్రులు అధిక ధనాన్ని తీసుకుని, కన్యను ఇచ్చి వివాహం చేయటం.
7. రాక్షస వివాహం : కన్య ఇష్టంతో సంబంధం లేకుండా పిల్ల వైపు బంధువులను ఎదిరించి ఆమెను బలవంతంగా తీసుకుని పోయి చేసుకునే పెళ్ళి.
8. పైశాచం : కన్యకు సంబంధించిన బంధువులు ఏమరుపాటుగా గానీ, నిద్రిస్తున్నప్పుడు గానీ ఇంట్లో ప్రవేశించి, కన్యను అపహరించి చేసుకునే పెళ్ళి. అలాగే కన్య నిద్రిస్తున్నప్పుడుగానీ, బుద్ధి చెదిరి ఉన్నప్పుడుగానీ, మత్తిల్లినప్పుడు గానీ ఆమెను అనుభవించి చేసుకునే పెళ్ళి. (అర్థశాస్త్రం)

ఒకవేళ ఏ స్త్రీ అయినా గొడ్రాలు అయివుంటే ఆమె భర్త రెండో వివాహం కోసం ఎనిమిదేండ్లు నిరీక్షిస్తాడు. ఒకవేళ భార్యకు చనిపోయిన శిశువు జన్మించిన పక్షంలో పదేండ్లు దాకా నిరీక్షిస్తాడు. ఒకవేళ భార్యకు ఆడపిల్లలు పుడితే భర్త రెండో వివాహం కొరకు పన్నెండు సంవత్సరాలు వేచి ఉండాలి (అర్థశాస్త్రం).

# విడాకులు

మొదటి నాలుగు రకాల వివాహాలలో విడాకులే లేవు. మిగిలిన నాలుగు రకాల వివాహాలలో విడాకుల చట్టమేమిటంటే; తన భార్యను ద్వేషించే భర్త భార్య సమ్మతి లేకుండా విడాకులివ్వలేడు. అలాగే భర్తను ద్వేషించే భార్య కూడా భర్త సమ్మతి లేనంతవరకు వివాహబంధాన్ని రద్దు చేయజాలదు(అర్థశాస్త్రం).అయితే కట్టుకున్న ఇల్లాలు పరాయి మగ వానితో అక్రమ సంబంధం ఏర్పరచుకుందని తెలిసినప్పుడు మాత్రం భర్త ఆమెకు (ఏకపక్షంగా) విడాకులివ్వగలడు. కాని శీలవతి, వంశవతి అయిన స్త్రీకి విడాకులివ్వజాలడు (అర్థశాస్త్రం).

# నియోగ చట్టం

నియోగ చట్టం (ఆచారం) ప్రకారం భర్త ద్వారా సంతానం కలగదని నిర్ధారణ అయినప్పుడు, కులీనుడైన మరో మగవాడితో సమాగమం జరిపి, తన కోసం పిల్లల్ని కనటానికి

teluguislam.net



భర్త ఆమెకు అనుమతి ఇవ్వాలి. అయితే అదే సమయంలో ఆ ఇల్లాలు తన భర్త సేవలో నిమగ్నురాలై ఉండాలి. అలాగే ఒకవేళ భార్యకు సంతాన యోగ్యం లేదని తేలినప్పుడు, ఎవరైనా ఒక వితంతువుతో సమాగమం జరిపి సంతానాన్ని పొందేందుకు ఆమె తన భర్తకు అనుమతి ప్రదానం చేయాలి.

క్రైస్తవ మతంలోనూ, హైందవ మత ధర్మంలోనూ ఉన్న ఈ శాసనాలలో, సాంప్ర దాయాలలో గల 'అతివాదం' మానవత పేరిట ఓ మాయని మచ్చ. ముస్లిమేతర సంస్కృతు లలో గల ఈ అతివాదాలను, స్వీయకల్పిత ఆచార దురాచారాలను గురించి ప్రస్తావిస్తూ, మానవతపై భారంగా ఉన్న ఈ బరువులను తొలగించటానికే తన అంతిమ సందేశహరుణ్ణి పంపటం జరిగిందని సృష్టికర్త సెలవిచ్చాడు: "(ముహమ్మద్-స) వారిపై ఉన్న బరువులను దించుతాడు. వారికి వేయబడి ఉన్న సంకెళ్ళను విప్పుతాడు" (అల్ ఆరాఫ్-157).

ఇస్లాం ఓ ప్రకృతి ధర్మం. దైవం సమ్మతించి ఆమోదించిన జీవన ధర్మం. దీనిని వివేకవంతుడు, సర్వజ్ఞుడు అయిన దైవం మానవ నైజానికి అనుగుణంగా ఉంచాడు. అందుకే ఇందులో హెచ్చుతగ్గులు లేవు. ఇది రెండు అతివాదాలకు నడుమ సమతౌల్యంతో కూడుకుని ఉంది. ఆ సమతౌల్యాన్ని గురించి ఏ మానవ మాత్రుని బుద్ధీ ఊహించజాలదు.

ఇస్లాం విడాకులపై పూర్తి ఆంక్షలు విధించలేదు- దంపతుల మధ్య గొడవలు పెరిగిపోయి జీవితం దుర్భరమైపోతే పోనీ విడాకులు మాత్రం యివ్వరాదంటూ షరతు పెట్టలేదు. అలాగే ఎవరికి, ఎప్పుడు తలాఖ్ గుర్తుకు వచ్చినా నోరు పారేసుకుని, విడిపోయేంత స్వేచ్ఛనూ ప్రసాదించలేదు. పుర్రెలో ఆలోచన పుట్టిందే తడవుగా విడాకుల అస్త్రాన్ని ప్రయోగించటాన్ని ఇస్లాం ఘోరమైన పాపంగా ఖరారు చేసింది. దంపతులు పరస్పరం అంగీకారానికి రావటానికి ఏ కాస్త అవకాశం వున్నా వివాహబంధంలో ఇమిడి ఉండాలని నొక్కి చెబుతుంది. కాని ఒకవేళ ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురం బీటలు వారి, ఇక వారి మధ్య అన్యోన్యతకు ఏమాత్రం ఆస్కారం లేదని నిర్ధారణ అయినప్పుడు ఒక్క భర్తకు మాత్రమే కాకుండా, భార్యకు కూడా విడిపోయే అనుమతిని ఇస్తుంది. 'ఖులా' ద్వారా భార్య భర్త నుండి విడిపోదలచినప్పుడు భర్త గనక అందుకు అంగీకరించకపోతే ఆమె షరీయతు న్యాయస్థానం తలుపులు తట్టవచ్చు.

ఇస్లాంలో విడాకుల నేపథ్యంలోగల సమత్వం, సమతూకం ఇతరత్రా ఆదేశాలలో కూడా బ్రహ్మాండంగా వెలుగొందుతోంది. ఉదాహరణకు: రాత్రి జాగరణ గురించి "ఫర్జ్ నమాజుల తర్వాత అత్యంత శ్రేష్ఠమైన నమాజ్ రాత్రి (తహజ్జుద్) నమాజ్" (అహ్మద్) అని ఒకవైపు చెబుతూనే, మరోవైపు నిత్యం రాత్రిపూట ఆరాధనలో గడిపేవారినుద్దేశ్యించి, "ఎవడు నా సంప్రదాయాన్ని (సున్నత్ని) విడనాడుతాడో వాడు నా వాడు కాడు" (బుఖారీ) అని హెచ్చరించటం కూడా జరిగింది. ఒకవైపు జకాత్ వసూలు చేసే వారినుద్దేశించి, "జనుల నుండి కేవలం శ్రేష్ఠమైన సంపదనే తీసుకోకండి" అని ఆజ్ఞాపిస్తూనే (బుఖారీ), మరోవైపు జకాత్ చెల్లించే వారిని ఉద్దేశించి, "జకాత్ సొమ్ము వసూలు చేసేవారు వచ్చినప్పుడు వారి

నుండి మీ సొమ్ముల్ని దాచి ఉంచకండి" (బుఖారీ) అని ఆదేశించటం కూడా జరిగింది. ఒకవేళ స్త్రీలు మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ చేయదలిస్తే, వారిని మస్జిద్‌కు వెళ్ళకుండా ఆపవద్దని ఒకవైపు పురుషులను ఆజ్ఞాపిస్తూనే (అబూదావూద్), స్త్రీలు ఇంట్లో నమాజ్ చేయటం మస్జిద్‌లో నమాజ్ చేయటం కన్నా మిన్న (అబూదావూద్) అని మరోవైపు స్త్రీలను ఆదేశించటం జరిగింది. పరాయి స్త్రీపై పడే మొదటి చూపు క్షంతవ్యమేగాని, మలి చూపు నిషిద్ధం (హరామ్) అని ఒకవైపు పురుషులను ఆజ్ఞాపిస్తూనే (అబూదావూద్), పగటిపూటగానీ, రాత్రివేళగానీ - ఎప్పుడు మీ భర్త తన కోర్కె తీర్చమని పిలిచినా నిరాకరించకండి, అన్యథా అల్లాహ్ అప్రసన్నుడవుతాడని మరోవైపు వివాహిత స్త్రీలకు ఆదేశించటం జరిగింది (ముస్లిం, ఇబ్నుమాజ). ఇస్లాం ధర్మం ఈ ఆదేశాలన్నింటిలోనూ- ఎక్కడా ఈ సమతూకాన్ని ఉపేక్షించ లేదు. ప్రపంచంలోని ఏ మతధర్మం; మరే శాసన వ్యవస్థ కూడా తన మూల సూత్రాలలో, శాసనాంగంలో ఇంత చక్కని సమతూకాన్ని నెలకొల్పిన దృష్టాంతం కానరాదు. వివాహం - విడాకుల విషయంలో నయితే ఇస్లాంలోని ఈ సమతూకపు వైభవం మరింత గొప్పగా, సంపూర్ణంగా వెలుగొందు తోంది.

# ఇస్లాం మరియు మనిషి గౌరవ మర్యాదలు

దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయబడింది: "మేము ఆదం సంతతికి గౌరవం వొసగాము" (బనీ ఇస్రాయీల్-70). దివ్యగ్రంథంలోని ఈ ఒక్క వచనానికి ఖచ్చితమైన తాత్పర్యం తెలుసుకోవాలంటే మనం విడాకుల నేపథ్యంలో ఇవ్వబడిన ఆజ్ఞలను అధ్యయనం చేయాల్సిందే. దంపతుల మధ్య విడాకుల ప్రస్తావన అసలెందుకు వస్తుంది? పరస్పరం మనస్పర్థలు, ఒకరింకొకరిపట్ల అన్యాయంగా వ్యవహరించటం, ఒండొకరి హక్కులను నెరవేర్చకపోవటం- ఇత్యాది కారణాలుంటాయి. ఈ పరిస్థితుల్లో మహామహులైన ధర్మ పరాయణులు సయితం 'నైతికత' నుంచి తొలగిపోతుంటారు. ఇరువురిలో ప్రతి ఒక్కరూ తన వాదనే సరైందని తలపోస్తుంటారు. ఈ ప్రయత్నంలో వారు ఒక్కోసారి అనుచితంగా వాదిస్తారు. నీలాపనిందలు మోపుతుంటారు. ధర్మాధర్మాల విచక్షణను సయితం మరచిపోయి అనరాని మాటలు అనేస్తారు. ఆలుమగల దాంపత్య బంధం విలక్షణమైనది. సున్నితమైనది. గొడవ జరిగినప్పుడు భార్యాభర్తలలో ఏ ఒక్కరి నోటనయినా వెలువడే అతి మామూలు మాట కూడా ఎదుటి వారికి అవమానకరంగా ఉంటుంది. వారు తమ భవిష్యత్తును గురించి ఆ క్షణంలో ఏదేదో ఊహించేసుకుంటారు. అందుకే విడాకులు ఇచ్చే సమయంలో మగవారు క్రింది విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలని అల్లాహ్ నొక్కి పలికాడు: "వారిని సహృదయంతో మీవద్ద ఆపి ఉంచుకోండి. లేదంటే ఉత్తమరీతిలో సాగనంపండి. వారిపై దౌర్జన్యానికి ఒడిగట్టే ఉద్దేశంతో వారిని ఆపి ఉంచుకుని వేధించకండి" (అల్ బఖర : 231). దీని భావమేమిటంటే, మీరు గనక మీ భార్యతో సర్దుబాటు చేసుకోవాలనే అనుకుంటే, ఇక మీదట ఆమె యెడల ఉత్తమ రీతిలో కాపురం చేయండి. ఆమె హక్కులను సజావుగా ఇవ్వండి. గౌరవప్రదంగా మీ ఇంట్లోనే ఆమెను ఉంచండి. ఆమెను కించపరచటానికో లేదా ఆమెను సాధించటానికో ఇంట్లో ఉండనిచ్చామన్న భావన ఊహామాత్రంగా కూడా ఆమెలో కలగనీయకండి. ఒకవేళ

teluguislam.net



మీరు ఆమెను విడిపించుకోవాలనే నిర్ణయించుకున్నప్పటికీ ఆమెకు వ్యతిరేకంగా ఆరోపణల, అపవాదుల ఖాతా తెరవకండి. ఆమెలోని లోపాలను లోకానికి చాటుకుంటూ తిరగకండి. మరో మగవాడు ఆమెను మనువాడకుండా చేసేలా ఆమెను అపఖ్యాతి పాల్జేయకండి. పైగా ఆమెను గౌరవప్రదంగా, మర్యాదపూర్వకంగా సాగనంపండి. ఈ పరమార్థం దృష్ట్యానే విడాకుల వ్యవహారాన్ని రచ్చకెక్కకుండా చేయటం జరిగింది. అందుకే దీనిని న్యాయస్థానంతో ముడిపెట్టకుండా, భర్తకు తిరుగులేని అధికారం యివ్వబడింది - భార్యతో ఇక తనకు పొసగనే పొసగదని భావించినప్పుడు అతను నియమానుసారం భార్యకు విడాకులివ్వగలడు.

'ఖులా' వ్యవహారం కూడా ఇంతే. ఒకవేళ భార్య తన భర్త నుండి ఖులా పొందేందుకు న్యాయస్థానం తలుపు తట్టినప్పటికీ, న్యాయస్థానం ఆ దంపతుల ప్రైవేటు విషయాలను గురించి ఆరా తీయదు. భార్యాభర్తల మనస్పర్థలు ముదిరి పాకాన పడ్డాయనీ, ఇక వారిరువురూ అల్లాహ్ హద్దులకు కట్టుబడి ఉండలేరని గ్రహించినప్పుడు న్యాయస్థానం సమస్యకు పరిష్కారం సూచిస్తుందే తప్ప భార్యాభర్తలు ఒండొకరిపై బురద చల్లుకునేందుకు తావు కల్పించదు. ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) వద్దకు ఒక స్త్రీమూర్తి వచ్చి తానిక తన భర్తతో వేగలేనని, తనకు ఖులా ఇప్పించమని ప్రాధేయపడింది. హజ్రత్ ఉమర్ (రజి) ఆమెకు హితబోధ చేశారు. భర్తతోనే సర్దుకు పొమ్మని సలహా ఇచ్చారు. కాని ఆమె అంగీకరించ లేదు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఆ స్త్రీని చెత్తాచెదారం ఉన్న ఒక గదిలో రాత్రంతా నిర్బంధించి, తెల్లవారాక అడిగారు- "చెప్పు, భర్త లేకుండా బ్రతుకు ఎంత దుర్భరంగా ఉందో!" దానికి ఆ స్త్రీ, 'దైవసాక్షిగా చెబుతున్నా! ఈ రాత్రి హాయిగా నిద్రపోయాను. భర్త వద్దకు కాపురానికి వెళ్ళిన రోజు నుంచీ ఇప్పటి వరకూ ఇంత తియ్యని నిద్ర నేనెరుగను' అంది. ఈ మాట వినగానే ఖలీఫా ఆమె భర్తను పిలిపించి, తక్షణం ఆమెకు విముక్తిని ప్రసాదించమని ఆజ్ఞాపించారు (ఇబ్నె కసీర్).

విభేదాలు, వివాదాలు, ప్రతీకార భావాలు, కక్షలు కార్పణ్యాల వాకిట నిలిచివున్న ఒక వ్యక్తికి ఉత్తమ రీతిలో వ్యవహరించమని ఉపదేశించటం, హ్యూమన్ రెస్పెక్ట్ గురించి నొక్కి వక్కాణించటం అపూర్వం, అపురూపం. ఇస్లాం దేవుని తరఫున అవతరింపజేయబడిన జీవన ధర్మం గనకనే అలా ఉపదేశించగలిగింది మరి!

భార్యను ఉత్తమ రీతిలో సాగనంపమని ఒకవైపు భర్తను సూచిస్తూనే, మరోవైపు తన మాజీ భర్తతో సహజీవనం సాగించినందుకు గౌరవ సూచకంగా మూడు నెలలపాటు ఇద్దత్ పాటించాలని, ఆ తరువాతే పునర్వివాహమని స్త్రీని ఆదేశించింది ఇస్లాం.

## ముగింపు

ఆలుమగల మధ్య మనస్పర్థలు ఏర్పడి, కక్షలు కార్పణ్యాలు పెరిగిపోయినప్పుడు ఇస్లాం ఉపదేశించిన ఈ సూత్రాలను పాటించే సజ్జనులు, వజ్ర సంకల్పులు ఎంతమంది ఉంటారు? ఈ ప్రశ్న ఎంత కఠోరమైనదైనప్పటికీ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉన్న సౌభాగ్యవంతులు పుడమిపై ఇప్పటికీ ఉన్నారనేది వాస్తవం. అలాంటి వారు చాలా

కొద్ది మందే కావచ్చు. కాని ఉన్నారు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "నా దాసులలో కృతజ్ఞతా పూర్వకంగా మసలుకునేవారు బహు కొద్ది మాత్రమే" (సబా-13).

ఇస్లామీయ ప్రబోధనలను నిర్లక్ష్యం చేసిన పక్షంలో ఇస్లామీయ ప్రబోధనల వాస్తవికతకు ఎలాంటి నష్టం వాటిల్లదు. కాకపోతే ఈ ప్రబోధనల పట్ల విముఖత చూపేవారు నష్టాన్ని చవిచూడవలసి ఉంటుంది. విముఖత చూపేవాడు వ్యక్తి అయితే వ్యక్తి, లేదా మొత్తం సమాజమే విముఖత చూపితే మొత్తం సమాజం ఆ శిక్షను అనుభవించవలసి ఉంటుంది- అది మహిళా హక్కుల విషయమయినా, సమాజంలో ఉత్పన్నమయిన జటిల సమస్యలైనా ఇంతే. ఇస్లామీయ ప్రబోధనల పట్ల అలక్ష్యం కనబరచినంత కాలం మన సమాజమంతా సమస్యల సుడిగుండంలో పడి కొట్టుకుంటూనే ఉంటుంది. సాఫల్య మార్గం ఒక్కటే- మనం సత్యధర్మమైన ఇస్లాం ప్రబోధనలను పెడచెవిన పెట్టడం మాని - దైవం మరియు దైవప్రవక్త(స) ఆదేశాల ముందు తల వంచాలి. దివ్యఖుర్ఆన్ ఈ విషయం గురించే గత 14 శతాబ్దులుగా మనల్ని ఎలుగెత్తి ఘోషిస్తోంది. "ఓ విశ్వాసులారా! దైవప్రవక్త మీకు జీవనం ప్రసాదించే విషయం వైపుకు పిలిచినప్పుడు మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పిలుపుకు అనుకూలంగా స్పందించండి" (అల్ అన్ఫాల్-24)

మనం దివ్యఖుర్ఆన్లోని ఈ శుభదాయకమైన పిలుపును వినగలిగితే ఎంత బావుండు! మనకు దివ్యఖుర్ఆన్లోని జీవనదాయక పిలుపుపై యోచన చేసే తీరిక లభిస్తే ఎంత బావుండు!! మనకు దివ్యఖుర్ఆన్లోని ఈ మహత్పూర్వకమైన పిలుపుకు స్పందించి సదాచరణ సద్బుద్ధి ప్రాప్తిస్తే ఎంత బావుండు!!

తలాఖ్ నియమ నిబంధనలు, నికాహ్ నియమ నిబంధనల కన్నా మరింత సూక్ష్మమైనవి. పరిశీలించి, పరిశోధించి మరీ సంకలనం చేయదగిన సూత్రాలివి. అందుకే ఈ విషయమై విద్వాంసులను సంప్రతించి, వారి విలువైన సలహాలను పాటించాము. అయినప్పటికీ ఎక్కడయినా పొరపాట్లు జరిగి ఉంటే, మా దృష్టికి తీసుకు రావలసిందిగా సవినయంగా మనవి చేస్తున్నాము. ఈ పుస్తక సంకలనంలో మాకు తోడ్పడిన వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. హదీసు పుస్తకాల సంకలనంలోనూ, ఇతర భాషలలో తర్జుమాలు చేసి ప్రచురించే విషయంలోనూ తోడ్పడే శ్రేయోభిలాషుల కృషిని ఆమోదించి, వారి ఈ సత్కార్యాన్ని ప్రళయ దినం వరకూ ఎడతెగని పుణ్యఫలంగా చేయాలని, ఇహపరాలలో వారి గౌరవోన్నతులను ఇనుమడించాలని కారుణ్య ప్రభువును దీనాతిదీనంగా ప్రార్థిస్తున్నాము- ఆమీన్! رَبَّنَا تَقَبَّلْ مِنَّا إِنَّكَ أَنْتَ السَّمِيعُ الْعَلِيمُ

రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అంతస్సమీవుల్ అలీమ్

(ఓ ప్రభూ! మా ఈ చిరు కృషిని దయతో స్వీకరించు. నిశ్చయంగా నీవు సర్వం వినేవాడవు, సర్వం తెలిసినవాడవు)

క్రీ.శ. 1998, ఆగస్టు 29 - ముహమ్మద్ ఇక్బాల్ కీలానీ

హిజ్రీ 1419 జమాదివుల్ అవ్వల్ 7 రియాద్, సవూదీ అరేబియా

teluguislam.net


بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు అపారకృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# وَلَا تَتَّخِذُوْٓا اٰيٰتِ اللّٰهِ هُزُوًا

﴿سورہ بقرہ' آیت نمبر ۱۳۲﴾

# "అల్లాహ్ ఆదేశాలతో పరిహాసమాడకండి."

(అల్ బఖర -231)

# హదీసు వివరాల సంక్షిప్త బోధన

హదీస్ : ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి పలుకు లేదా ఆయన ఎదుట ఆయన అనుమతి పొందిన పలుకు లేదా కార్యం.

హదీసు ఐదు రకాలు

**1. మర్ఫూ 2. ముతవాతిర్ 3. మౌఖూఫ్ 4. మఖ్తూ 5. ఆహాద్**

**1. మర్ఫూ** : ఏదైనా హదీసును ప్రవక్తగారి సహాబీ (అనుచరుడు) ప్రవక్తగారి పేరుతో సహా తెలిపితే అది మర్ఫూ అవుతుంది.

**2. ముతవాతిర్** : ఒక హదీస్ యొక్క ఉల్లేఖకుల సంఖ్య ప్రతికాలంలోనూ అత్యధికంగా ఉండి వారు అసత్యం పలుకలేనంత ఆధిక్యతలో ఉంటే ఆ హదీసు ముతవాతిర్ అవుతుంది.

**3. మౌఖూఫ్** : ఎవరైనా సహాబీ ప్రవక్తగారి ప్రస్తావన లేకుండానే ఏదైనా హదీసు తెలిపినా లేదా తన అభిప్రాయం వ్యక్తపర్చినా అది మౌఖూఫ్ అవుతుంది.

**4. మఖ్తూ** : ఎవరైనా తాబయీ ఈ (ప్రవక్తగారి అనుచరుని శిష్యుడు) ప్రవక్త మరియు సహాబీను ప్రస్తావించకుండా ఏదైనా హదీస్ తెలిపినా లేదా తన అభిప్రాయం వ్యక్తపర్చినా అది 'మఖ్తూ' అవుతుంది.

**5. ఆహాద్** : ఒక హదీసును పేర్కొనే వారి సంఖ్య ముతవాతిర్‌ను పేర్కొనే వారి సంఖ్య కంటే తక్కువగా ఉంటే అటువంటి హదీసులు ఆహాద్ అనబడతాయి.

**ఆహాద్ ఆరు రకాలు: 1. మష్హూర్ 2. అజీజ్ 3. గరీబ్ 4. మఖ్బూల్ 5. గైర్ మఖ్బూల్ 6. జయీఫ్.**

గరీబ్ : ఒక హదీస్‌ను పేర్కొనే వారు ఏ కాలంలోనైనా ఒక్కరే ఉంటే అది గరీబ్ అనబడుతుంది.

**జయీఫ్** : ఏదైనా హదీస్ సహీహ్ మరియు హసన్ హదీసుల నియమాలకు తగనిదై ఉన్నా, హదీస్ పేర్కొనే వారి వరుసనుండి ఏ ఒక్కరైనా లోపించినా లేదా హదీస్ పేర్కొనే వారిలో ఎవరైనా నిందితుడు ఉన్నా అటువంటి హదీస్ జయీఫ్(బలహీనమైనది)అనబడుతుంది.**(జయీఫ్‌పై అమలు చేయరాదు)**

**మౌజూ** : ఏదైనా హదీసును పేర్కొనేవాడు హదీసుల విషయంలో అసత్యం పలుకు వాడని చూపించబడితే అతను పేర్కొనే వచనం హదీసె మౌజూ అనబడుతుంది. **(ఇది అసలు హదీసు అనబడదు)**

*గమనిక:* **సహీహ్, హసన్ హదీసులపైనే అమలు చేయాలి. - అబ్దుర్రవూఫ్ ఉమరి**

teluguislam.net



# సంకల్పం

## 1వ అంశం : కర్మలు సంకల్పంపైనే ఆధారపడి ఉన్నాయి

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) ప్రబోధించగా తాను విన్నానని హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) చెప్పారు: "కర్మలు సంకల్పాలపై ఆధారభూతమై ఉన్నాయి. ప్రతి వ్యక్తికీ తాను సంకల్పించుకున్నదే ప్రాప్తిస్తుంది. ప్రపంచాన్ని పొందే సంకల్పంతో హిజ్రత్ (వలస) చేసిన వానికి ప్రపంచమే ప్రాప్తమవుతుంది. స్త్రీని వివాహమాడే ఉద్దేశంతో హిజ్రత్ చేసిన వానికి స్త్రీయే లభిస్తుంది. కాబట్టి హిజ్రత్ చేసిన వానికి, తాను దేని కోసం హిజ్రత్ చేశాడో అదే (అతనికి) సిద్ధిస్తుంది." దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

## 2వ అంశం : విడాకులిచ్చే ఉద్దేశంతో చూచాయగా చెప్పినాసరే విడాకులైపోతాయి

హజ్రత్ ఆయిషా (ర.అ) కథనం : జౌన్ కూతురు (అస్మా వివాహానంతరం) దైవప్రవక్త (స) వద్దకు తీసుకురాబడింది. ఆయన(స) ఆమెను సమీపించినప్పుడు, 'నేను మీ నుండి అల్లాహ్ శరణు వేడుతున్నా'నని అంది. దానికి ఆయన(స), 'నీవు మహోన్నతుడైన వాని శరణు వేడావు. కాబట్టి ఇక నీవు నీ ఇంటి వారివద్దకు వెళ్ళవచ్చు" అన్నారు[2] (బుఖారీ)

**వివరణ:** దైవప్రవక్త (స) స్పష్టమైన మాటల్లో విడాకులు ఇవ్వకుండా సంకేత ప్రాయంగా విడాకులిస్తున్నట్లు ప్రకటించారు. "నీ పుట్టింటికి వెళ్ళిపో" అని మాత్రమే చెప్పారు. అలా చెప్పటంలో ఆయన(స) ఉద్దేశం విడాకులివ్వటమే కాబట్టి విడాకులైపోయాయి.

• ఒక వ్యక్తి ఇరాక్ నుండి హజ్రత్ ఉమర్ (రజి)కు లేఖ వ్రాశాడు: (ఆ లేఖలో ఇలావుంది) ఒక వ్యక్తి తన భార్యతో, "నీ త్రాడు నీ మూపురంపైన ఉంది" అన్నాడు. దీనికి సమాధానంగా హజ్రత్ ఉమర్ (రజి) ఇరాక్ పరిపాలకునికి ఉత్తరం వ్రాస్తూ, హజ్జ్‌యాత్ర సందర్భంగా నన్ను కలుసుకోమని ఆ వ్యక్తికి చెప్పండి అని ఆదేశించారు. హజ్రత్ ఉమర్ (రజి) కాబా గృహప్రదక్షిణ చేస్తుండగా ఒక వ్యక్తి వచ్చి సలామ్ చేశాడు."నువ్వెవరివి?"అని ఉమర్(రజి) అడిగారు. 'మక్కాలో కలుసుకోమని మీరు ఆజ్ఞాపించిన వ్యక్తిని' అన్నా డతను. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇలా ప్రశ్నించారు:"కాబా ప్రభువును సాక్షిగా పెట్టి నిన్నడుగుతున్నాను. నీవు నీ భార్యతో ఆ విధంగా చెప్పినప్పుడు నీ అంతరంగంలో ఏముందో చెప్పు?" దానికా వ్యక్తి, 'ఓ అమీరుల్ మోమినీన్! తమరు మరోచోట ఎక్కడైనా నా నుండి

---

1. సంక్షిప్త సహీహ్ బుఖారీ- జుబైదీచే సంకలనం చేయబడినది. హ.నెం.1
2. కిత్తాబుత్తలాఖ్

ప్రమాణం తీసుకుని ఉంటే నిజం చెప్పేవాణ్ణి కాదేమో!(కాని ఇప్పుడు నిజం చెబుతున్నాను) ఆ క్షణంలో నా మనసులో విడాకులివ్వాలన్న సంకల్పమే ఉంది' అన్నాడు. అప్పుడు హజ్రత్ ఉమర్, "పో. నీ సంకల్పం ఈడేరింది" అన్నారు. దీనిని 'మాలిక్ ఉల్లేఖించారు.[1]

## 3వ అంశం : విడాకులిచ్చే ఉద్దేశమే లేనప్పుడు బలవంతంగా విడాకులిప్పించినా చెల్లదు.

హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: "నా అనుచర సమాజంచేత పొరపాటు వల్లనో, మరుపు వల్లనో, బలాత్కారం కారణంగానో జరిగిపోయిన పనిని అల్లాహ్ క్షమించాడు" - (ఇబ్నుమాజ హ.నెం. 2043, సహీహ్)[2]

---

*1. కిత్తాబుత్తలాఖ్- బాబు మాజాఅ ముఅత్త ఇమామ్ మాలిక్ పేజి నం. 107*

*2. సహీహ్ సుననె ఇబ్నుమాజ లిల్ అల్‌బానీ: మొదటి భాగం-హ.నెం.1662*

teluguislam.net



# తలాఖ్ ఎంతో అవాంఛనీయమైనది

## 4వ అంశం : తలాఖ్ ఇస్తున్నట్లు వేళాకోళానికి చెప్పినా, గంభీరంగా చెప్పినా, కోపంతో చెప్పినా అయిపోయినట్లే

దైవప్రవక్త (స)ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు: "మూడు విషయాలు గంభీరంగా చెప్పినా, నవ్వులాటకు చెప్పినా అవి నిజంగా అయిపోతాయి. మొదటిది: వివాహం, రెండవది: విడాకులు, మూడవది: రాజీపడటం." (తిర్మిజీ 1184,హసన్)[1]

## 5వ అంశం : అకారణంగా విడాకులివ్వమని రెచ్చగొట్టే స్త్రీ స్వర్గ సువాసనను ఆఘ్రాణించదు

హజ్రత్ సౌబాన్ (రజి) కథనం- మహనీయ ముహమ్మద్ (స) ప్రవచనం: "ఏ కారణమూ లేకుండానే తనకు విడాకులివ్వమని భర్తను కోరే స్త్రీ కొరకు స్వర్గ సువాసన నిషిద్ధం (హరామ్) గావించబడింది." - (తిర్మిజీ1187,ఇబ్నుమాజా,అబూదావూద్ 2226, సహీహ్)[2]

## 6వ అంశం : అకారణంగా ఖులా కావాలని కోరే మహిళ కపట విశ్వాసురాలు

హజ్రత్ సౌబాన్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు: "(అకారణంగా) 'ఖులా' పొందే మహిళలు కపట విశ్వాసంగలవారు" (తిర్మిజీ 1186 సహీహ్)[3]

## 7వ అంశం : కారణమేదీ లేకుండానే కట్టుకున్న ఇల్లాలిని వదిలించుకోవటం మహాపాతకం

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) కథనం - మహాప్రవక్త (స) ప్రవచనం: "ఒక మనిషి ఏ స్త్రీనయినా వివాహమాడి, అవసరం తీరిపోయాక ఆమెకు విడాకులివ్వటం, ఆమె మహర్ సొమ్మును కూడా చెల్లించకపోవటం చాలా పెద్ద పాపం." ఈ హదీసును హాకిమ్ పొందుపరిచారు.[4] (సహీహ్ హదీసు)

## 8వ అంశం : విడాకులు తీసుకునేలా భర్తకు వ్యతిరేకంగా భార్యను రెచ్చగొట్టే వ్యక్తి దైవప్రవక్త (స) అవిధేయుడు

మహనీయ ముహమ్మద్ (స) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పారు: "ఏ స్త్రీనయినా ఆమె భర్తకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేవాడు లేదా బానిసను అతని యజమానికి వ్యతిరేకంగా నూరిపోసేవాడు నా వాడు కాజాలడు." - (అబూదావూద్ 2175 సహీహ్)[5]

---

1. *సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ: మొదటి భాగం - హ.నెం.944*
2. *సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ: మొదటి భాగం - హ.నెం.948*
3. *సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ: మొదటి భాగం - హ.నెం.948*
4. *అల్ బానీచే సంకలనం చేయబడిన ప్రామాణిక హదీసుల పరంపర - రెండవ భాగం: హ.నెం.999*
5. *సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్‌బానీ: రెండవ భాగం-హ.నెం.1906*

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రబోధించారు: "ఏ మహిళామణి కూడా (సవతి అయిన) తన సోదరీమణి హక్కును కాజేసే ఉద్దేశంతో ఆమెకు విడాకులివ్వమని ఒత్తిడి తేకూడదు. ఎందుకంటే ఆమె భాగ్యంలో రాసిపెట్టినది ఆమెకు ఎలాగూ లభిస్తుంది." (అబూదావూద్ 2176 సహీహ్)[1]

## 9వ అంశం : భార్యాభర్తలను విడదీయటం అంటే ఇబ్లీస్‌కు ఎంతో ఇష్టం

మహనీయ ముహమ్మద్ (స) చెప్పారని హజ్రత్ జాబిర్ (రజి) తెలియజేశారు: "ఇబ్లీస్ సింహాసనం నీళ్ళపై ఉంటుంది. వాడు అక్కడినుంచే తన పైశాచిక దళాన్ని (లోకంలో ఉపద్రవం రేకెత్తించేందుకు) పంపిస్తాడు. అన్నింటికన్నా పెద్ద ఉపద్రవాన్ని సృష్టించే షైతానును ఇబ్లీస్ మెచ్చుకుంటాడు. (షైతానులు వెనుతిరిగి వచ్చి తాము చేసిన నిర్వాకాన్ని గురించి నివేదిక సమర్పిస్తారు) 'నేను ఫలానా ఫలానా ఘనకార్యం చేసి వచ్చాన'ని ఒకడంటాడు. అది విని "అసలు నువ్వేమీ చేయలేద"ని అంటాడు ఇబ్లీస్. మరో షైతాన్ రిపోర్టు ఇస్తూ, 'నేను ఫలానా భార్యాభర్తలను వెంటాడాను. ఆఖరికి వారిద్దరినీ విడదీశాను' అంటాడు. ఇబ్లీస్ అతన్ని తన సరసన (పీఠంపై) కూర్చోబెట్టుకుని "నువ్వు ఘనకార్యం చేశావ్" అని అభినందిస్తాడు." - (ముస్లిం)[2]

---

*1. సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్‌బానీ : మొదటిభాగం- హ.నెం.1908*

*2. కితాబు సిఫాతుల్ మునాఫిఖీన్ - బాబు ఫిత్నతుష్షయితాను...*

teluguislam.net



# దివ్యఖుర్ఆన్ వెలుగులో తలాఖ్

**10వ అంశం :** బహిష్టు స్థితిలో తలాఖ్ ఇవ్వటం వారించబడింది

**11వ అంశం :** గర్భవతి కాని స్త్రీ మరియు భర్తతో సమాగమం జరిపిన మహిళ విడాకులు పొందితే మూడు రుతువుల వరకూ 'ఇద్దత్' పాటించాలి. అయితే రజస్వల కాని యువతికి, ముట్టుడిగిన మహిళకు, భర్త చనిపోయిన స్త్రీకి ఈ నిబంధన వర్తించదు.

**12వ అంశం :** తలాఖె రజ్యీ ఇచ్చి ఇద్దత్ కాలంలో భర్త తన భార్యతో రాజీకి వచ్చినప్పుడు స్త్రీ సంరక్షకుడు (వలీ) అడ్డు తగలకూడదు.

**13వ అంశం :** షరీయతు దృష్ట్యా, చట్టరీత్యా స్త్రీ-పురుషుల హక్కులు ఒకలాంటివే. పురుషుల హక్కుల్ని స్త్రీలు ఎలా తప్పనిసరిగా చెల్లించాలో అలాగే స్త్రీల హక్కుల్ని పురుషులు తప్పనిసరిగా చెల్లించవలసి ఉంటుంది.

**14వ అంశం :** తలాఖె రజ్యీ ఇచ్చిన పక్షంలో- గడువు కాలం పూర్తికాక మునుపు భార్య ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా భర్త తన భార్యతో రాజీపడగలడు (రప్పించుకోగలడు).

"విడాకులు పొందిన స్త్రీలు తమను తాము మూడు రుతువుల దాకా ఆపి ఉంచుకోవాలి. వారు అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసించేవారే అయితే, అల్లాహ్ వారి గర్భాలలో సృష్టించిన దానిని దాచి ఉంచటం వారికి ధర్మసమ్మతం కాదు. ఒకవేళ ఈ గడువు లోపల వారిని తిరిగి రప్పించుకోవాలన్న సదుద్దేశం భర్తలకు ఉంటే ధర్మం ప్రకారం అలా రప్పించుకునే హక్కు వారికి ఉంది. భర్తలకు స్త్రీలపై హక్కులున్నట్లే, స్త్రీలకు కూడా వారిపై హక్కులు ఉన్నాయి. కాని ఉత్తమ రీతిలో! కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒకింత ప్రాధాన్యత ఉంది. అల్లాహ్ సర్వాధికుడు, వివేచనాపరుడు." (అల్ బఖర-228)

**వివరణ:** 1.విడాకులు పొందిన మహిళ గర్భవతి అయివుంటే ప్రసవం (లేక గర్భస్రావం) వరకూ ఇద్దత్ పాటించాలి. విడాకులు పొందిన మహిళ అప్పటికింకా భర్తతో పడక సుఖం అనుభవించి ఉండకపోతే ఆమెకు ఎలాంటి ఇద్దత్ (గడువు) లేదు. తలాఖ్ ఇవ్వబడిన వెంటనే ఆమె రెండో పెళ్ళి చేసుకోవచ్చు. ఇకపోతే వయసు మీదపడిన కారణంగా ముట్లుడిన స్త్రీలు విడాకులు పొందితే వారి గడువు (ఇద్దత్)కాలం మూడు నెలలు.

2. గర్భాలలో ఉన్నదానిని దాచి ఉంచరాదంటే భావం విడాకుల తర్వాత స్త్రీ తనకు ఎన్ని బహిష్టులు అయ్యాయో స్పష్టంగా చెప్పాలి. ఉదాహరణకు: విడాకులు పొందిన

స్త్రీకి తన భర్తతో అంగీకారానికి రావాలని మనసులో ఉంటుంది. అందుకే ఆమె తాను మూడుసార్లు బహిష్టు అయినప్పటికీ ఒకసారో లేక రెండు సార్లో బహిష్టు అయ్యానని అబద్ధం చెప్పవచ్చు. లేదా ఏమాత్రం ఇష్టంలేని స్త్రీలు ఒకసారో, రెండుసార్లో మాత్రమే బహిష్టు అయి ఉన్నప్పటికీ మూడుసార్లో బహిష్టు అయినట్లు అబద్ధం చెప్పవచ్చు- ఈ విధంగా అబద్ధాలు చెప్పి మోసం చేయటాన్ని వారించటం జరిగింది.

**15వ అంశం : 'తలాఖె రజ్'యీ' ఇచ్చే అవకాశం రెండుసార్లు మాత్రమే ఉంటుంది.**

**16వ అంశం : 'తలాఖె బాయిన్'గా పిలువబడే మూడవ విడియాకును ఇచ్చిన మీదట భార్యాభర్తలు శాశ్వతంగా విడిపోవాల్సిందే.**

**17వ అంశం : విడాకులు ఇచ్చిన మీదట స్త్రీకి ఇచ్చిన మహర్ సొమ్మును గానీ, ఇతరత్రా సామగ్రిని, నగా నట్రానుగాని తిరిగి తీసుకోరాదు.**

వివరణ: 104 నుంచి 108వ అంశం వరకు క్రింద ఇవ్వబడిన ఆయతును చూడగలరు.

**18వ అంశం : విడాకులు పొందిన మహిళ రెండో పెళ్ళి చేసుకుంటే, రెండో భర్త ఆమెతో సమాగమం జరిపిన మీదట, తనంతట తానుగా ఆమెకు విడాకులిస్తే- ఆ విధంగా విడాకులు పొందిన ఆమె ఇద్దత్‌ను పూర్తిచేసిన పిదప, విడాకులిచ్చిన తన మొదటి భర్తను మనువాడ గలదు.**

"మరి ఆమెకు (మూడవసారి) గనక విడాకులిస్తే, ఆ స్త్రీ ఇతనిని తప్ప వేరొక వ్యక్తిని వివాహం చేసుకోనంతవరకూ ఇతని కోసం ఆమె ధర్మసమ్మతం కాజాలదు. ఆ తరువాత అతను(రెండవ భర్త) కూడా ఆమెకు విడాకులిస్తే, మళ్ళీ వీరిద్దరూ అల్లాహ్ (విధించిన) హద్దులకు కట్టుబడి ఉండగలమన్న నమ్మకం ఉండి వివాహ బంధంలోకి రాదలిస్తే అందులో తప్పులేదు. ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. తెలుసుకోగల వారికి ఆయన వీటిని స్పష్టపరుస్తున్నాడు."

(అల్ బఖర-230)

**19వ అంశం : ఒకవేళ భర్త తలిస్తే భార్యకు సంసార బంధాన్ని త్రెంచే స్వేచ్ఛ ఇవ్వగలడు. అట్టి పరిస్థితిలో భార్య నిర్ణయం ఖచ్చితంగా అమలు పరచబడుతుంది.**

ఓ ప్రవక్తా! నీ భార్యలకు ఇలా చెప్పు: "మీరు గనక ప్రాపంచిక జీవితాన్ని, దాని తళుకు బెళుకులను కోరుకుంటూ ఉన్నట్లయితే రండి, నేను మీకు ఎంతో కొంత ఇచ్చి, మిమ్మల్ని ఉత్తమరీతిలో సాగనంపుతాను." (అల్ అహ్‌జాబ్-28)

**20వ అంశం : భార్యాభర్తల మధ్య గొడవలొచ్చినప్పుడు షరీయతు న్యాయ స్థానాన్ని ఆశ్రయించకముందు వారు తమ కుటుంబీకులలోని న్యాయశీలురు,**

teluguislam.net



**విషయావగాహన ఉన్న ఒక్కో వ్యక్తి చొప్పున మధ్యవర్తులుగా పెట్టుకుని సర్దుబాటుకు యత్నించాలి.**

"ఒకవేళ ఆలుమగల మధ్యగల మనస్పర్థలు విరోధంగా మారే భయం మీకుంటే భర్త తరపు నుంచి ఒక మధ్యవర్తినీ, భార్య వైపు నుంచి ఒక మధ్యవర్తినీ నియమించుకోండి. వారిద్దరూ గనక సర్దుబాటుకు ప్రయత్నం చేయదలిస్తే అల్లాహ్ ఆ దంపతుల మధ్య రాజీ కుదుర్చుతాడు. నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, సర్వం ఎరిగినవాడు." (అన్ నిసా-35)

**21వ అంశం : ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలున్న భర్త ద్వారా ఏ భార్యకయినా, ఏ కారణంగానయినా అన్యాయం జరగవచ్చన్న భయముండి, ఆమె తన హక్కుల్ని వదులుకుంటూ భర్తతోనే దాంపత్య జీవితం గడపటానికి ఒప్పుకుంటే ఆమెకు విడాకులివ్వరాదని భర్తకు తాకీదు చేయటం జరిగింది.**

**22వ అంశం : భార్యాభర్తల మధ్య గొడవలొచ్చినప్పుడు పరస్పరం భయభక్తుల వైఖరిని అవలంబించాలి.**

"భర్త తనను ఈసడించుకుంటాడనో లేదా తనను పట్టించుకోడనో స్త్రీకి భయమున్నప్పుడు వారిద్దరూ పరస్పరం సర్దుబాటు చేసుకుంటే అందులో వారిరువురిపై ఏమాత్రం దోషం లేదు. సర్దుబాటు అన్నిటికన్నా మేలైనది. 'పేరాశ' అనేది ప్రతి ప్రాణిలోనూ పొందు పరచబడి ఉంది. ఒకవేళ మీరు ఔదార్యాన్ని చూపి, భయభక్తుల వైఖరిని అవలంబించినట్లయితే మీ వ్యవహారశైలి అల్లాహ్‌కు తెలుస్తుంది." (అన్ నిసా-128)

**వివరణ:** స్త్రీలోని సంకుచిత స్వభావం ఏమిటంటే తాను అనారోగ్యస్థితిలో ఉన్నప్పటికీ, వృద్ధాప్యం తొంగిచూస్తున్నప్పటికీ, తాను అందవికారంగా ఉన్నప్పటికీ భర్త తనను మునుపటిలాగే ప్రేమించాలని కోరుకుంటుంది. మగవాడిలోని సంకుచిత బుద్ధి ఏమిటంటే; రెండో పెళ్ళి చేసుకున్న తరువాత మొదటి భార్యకు కల్పించే సౌకర్యాల్లో వీలైనంతవరకు కోత విధించే ప్రయత్నం చేస్తాడు. ఆమె అశక్తతను (అంటే ఆమె అస్వస్థతను, ముసలితనాన్ని లేదా అందవికారాన్ని) ఆసరాగా తీసుకుని ఎక్స్‌ప్లాయిట్ చేస్తాడు.

**23వ అంశం : తలాఖ్ ఇచ్చే అధికారం పురుషుడికి మాత్రమే ఉంది, స్త్రీకి లేదు.**

**24వ అంశం : సంభోగించకముందే ఎవరయినా తన భార్యకు విడాకులిస్తే ఆమెపై 'ఇద్దత్' పాటించవలసిన బాధ్యత లేదు. విడాకులు పొందిన తరువాత వెంటనే ఆమె పునర్వివాహం చేసుకోగలదు.**

**25వ అంశం : సంభోగించక ముందే విడాకులిచ్చిన పక్షంలో భార్యను తిరిగి రప్పించుకునే అవకాశం మిగిలి ఉండదు.**

"ఓ విశ్వాసులారా! మీరు విశ్వాసులైన స్త్రీలను వివాహమాడినప్పుడు, వారిని తాకక ముందే మీరు వారికి విడాకులిస్తే, అట్టి పరిస్థితిలో మీరు లెక్కించే గడువుకాలం (ఇద్దత్) పూర్తి చేయమని వారిని కోరే అధికారం మీకు లేదు. కాబట్టి వారికి ఎంతో కొంత ముట్టజెప్పి ఉత్తమ రీతిలో సాగనంపండి." (అల్ అహ్‌జాబ్-49)

**26వ అంశం : తొందరపాటులోనో, కోపావేశంలోనో ముందూ వెనుకా ఆలోచించకుండా విడాకులివ్వటం తగదు.**

**27వ అంశం : అశుద్ధావస్థలో తలాఖ్ ఇవ్వటం తగదు.**

**28వ అంశం : ఏ పరిశుద్ధావస్థలో భార్యతో సమాగమం జరిపారో అదే పరిశుద్ధావస్థలో ఆమెకు విడాకులివ్వకూడదు.**

**29వ అంశం : ఏక కాలంలో మూడు తలాఖ్‌లు ఇవ్వకూడదు.**

**30వ అంశం : తలాఖ్ ఇచ్చిన మీదట గడువు కాలాన్ని (ఇద్దత్‌ను) ఖచ్చితంగా లెక్కించాలి.**

**31వ అంశం : తలాఖె రజ్‌యీ తరువాత స్త్రీ తన భర్త ఇంటనే ఉండి ఇద్దత్ పూర్తి చేయాలి.**

**32వ అంశం : తలాఖె రజ్‌యీ ఇవ్వబడిన మహిళను ఇద్దత్ (గడువు) కాలంలో ఇంటి నుండి వెళ్ళగొట్టకూడదు.**

**33వ అంశం : ఇద్దత్ కాలంలో తలాఖె రజ్‌యీ పొందిన మహిళ పోషణాభారం ఆమె భర్తపైనే ఉంటుంది.**

**34వ అంశం : విడాకుల వ్యవహారంలో దైవాదేశాలను ఉల్లంఘించేవాడు పరమ దుర్మార్గుడు.**

"ఓ ప్రవక్తా! (నీ అనుచర సమాజానికి చెప్పు) మీరు మీ స్త్రీలకు విడాకులిస్తున్నప్పుడు వారి గడువు (ఇద్దత్) ప్రకారం విడాకులివ్వండి. గడువు (రుతువు)ను లెక్కిస్తూ ఉండండి. మీ ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు వారిని వారి ఇండ్ల నుండి గెంటివేయకండి. వారు సయితం వెళ్ళిపోకూడదు. ఒకవేళ వారు బాహాటంగా ఏదయినా నీతి బాహ్యమైన చేష్టకు ఒడిగడితే (అప్పుడు వెళ్ళగొట్టవచ్చు). ఇవి అల్లాహ్ నిర్ధారించిన హద్దులు. ఎవరయితే అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమిస్తాడో అతడు తన స్వయానికే అన్యాయం చేసుకున్నవాడవుతాడు.

teluguislam.net



నీకు తెలీదు- బహుశా అల్లాహ్ దీని తరువాత ఏదయినా కొత్త పరిస్థితిని కల్పిస్తాడేమో!"

(అత్ తలాఖ్-1)

**35వ అంశం : నికాహ్ తరువాత సమాగమం జరపక ముందే ఎవరయినా తన భార్యకు విడాకులిస్తే, అప్పటి వరకూ ఆమె మహర్ సొమ్ము కూడా నిర్ధారించబడకపోతే, మహర్ చెల్లించే బాధ్యత మగవానిపై లేదు. అయితే అతడు తన స్థోమత ప్రకారం ఆ స్త్రీకి ఎంతో కొంత కానుకగా యివ్వాలి.**

"ఒకవేళ మీరు స్త్రీలను తాకకుండా, వారి మహర్‌ను నిర్ధారించకుండానే వారికి విడాకులిస్తే అది కూడా మీకు పాపం కాదు. అయితే వారికి ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చండి. స్థితిమంతుడు తన స్థితికి తగినట్లుగా, పేదవాడు తన స్థోమతకు తగినట్లుగా ధర్మం ప్రకారం ప్రయోజనం చేకూర్చాలి. ఉత్తమంగా వ్యవహరించేవారికి ఇది విధిగా నిర్ణయించబడింది."

(అల్ బఖర - 236)

**36వ అంశం : నికాహ్ తరువాత భార్యతో సమాగమం జరపకుండానే ఎవరయినా విడాకులిస్తే, అదే సమయంలో ఆమె మహర్ సొమ్ము నిర్ధారించ బడి ఉంటే, అప్పుడు మహర్‌లో సగభాగం చెల్లించటం తప్పనిసరి.**

"మీరు మీ స్త్రీలను ముట్టకోక ముందే విడాకులిచ్చేస్తే అప్పటికే వారి 'మహర్' సొమ్ము కూడా నిర్ణయించబడి ఉంటే, నిర్ణీత మహర్‌లో సగం సొమ్ము వారికి ఇవ్వండి. ఒకవేళ వారు (స్త్రీలు) ఆ సొమ్మును కూడా మన్నించి వదలిపెడితే లేక వివాహబంధం తన చేతిలో ఉన్న వ్యక్తి (పురుషుడు తాను పెళ్ళి సమయంలో ఇచ్చిన మహర్ సొమ్మును) క్షమించి వేస్తే అది వేరే విషయం. మీ మన్నింపుల వైఖరి దైవభక్తికి చాలా సన్నిహితమైనది. ఒండొకరి పట్ల ఔదార్యం చూపటాన్ని విస్మరించకండి. నిస్సందేహంగా అల్లాహ్ మీ కర్మలను గమనిస్తూనే ఉన్నాడు."

(అల్ బఖర - 237)

# ఆదర్శ భర్త లక్షణాలు

**37వ అంశం : భార్య యెడల ఉత్తమంగా మెలిగే వాడే ఉత్తమ భర్త.**

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: "మీలో తన ఆలుబిడ్డల యెడల ఉత్తముడైన వాడే అందరికన్నా ఉత్తముడు. నా ఆలుబిడ్డల విషయంలో నేను మీ అందరిలోకీ ఉత్తముడను. మీలోని సహచరుడెవరయినా చనిపోతే అతని గురించి చెడుగా చెప్పటం మానుకోండి" - (తిర్మిజి 3895 సహీహ్)[1]

మహనీయ ముహమ్మద్ (స) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) చెప్పారు: "తన స్త్రీల యెడల మంచిగా మెలిగేవాడే మీలోకెల్లా మంచివాడు." - దీనిని హాకిమ్ పొందుపరిచారు.[2] (సహీహ్ హదీసు)

**38వ అంశం : భార్యను కొట్టని వాడే ఉత్తమ భర్త.**

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చెప్పారు: "దైవప్రవక్త (స) ఎన్నడూ ఏ సేవకుణ్ణిగానీ, ఏ స్త్రీనిగానీ కొట్టలేదు." - (అబూదావూద్ 4786 సహీహ్)[3]

**39వ అంశం : కష్టకాలంలో ఓర్పు వహించే వాడే ఉత్తమ భర్త.**

మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చెప్పారు: "కూతుళ్ళ మూలంగా పరీక్షించబడిన వ్యక్తి గనక దానిపై ఓపిక పడితే ఆ కూతుళ్ళే అతనికి - అగ్నికి అవరోధంగా మారుతారు." - (తిర్మిజీ 1913.సహీహ్ హదీసు)[4]

**40వ అంశం : కూతుళ్ళకు ధార్మిక విద్యనేర్పి, మంచి శిక్షణ ఇచ్చిన వ్యక్తి ఉత్తముడు.**

మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రవచించారని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలియజేశారు: "ఏ వ్యక్తి అయినా ఆడపిల్లల కారణంగా పరీక్షించబడి, అతను వారిపట్ల సద్వ్యవహారం చేస్తే (అంటే వారికి మంచి విద్యాబుద్ధులు నేర్పితే) వారు అతనికి అగ్ని తాకకుండా అడ్డుకుంటారు." - దీనిని ముస్లిం పొందుపరిచారు.[5]

**41వ అంశం : ఇల్లాలి యెడల మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించే వాడు, ఇల్లాలి విషయంలో మేలుతో కూడిన మాటను ఆమోదించేవాడు ఆదర్శ భర్త.**

---

1. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్బానీ, మూడవ భాగం-హ.నెం.3057
2. సహీహ్ జామె వుస్సగీర్ లిల్ అల్బానీ, మూడవ భాగం - హ.నెం. 3311
3. సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్బానీ, మూడవ భాగం-హ.నెం. 4003
4. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్బానీ, మూడవ భాగం- హ.నెం.154
5. కితాబుల్ బిర్ వస్సిలతు....

teluguislam.net


హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రబోధించారు: "అల్లాహ్ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి, తనకేదైనా సమస్య ఎదురైనప్పుడు మంచి మాటను పలకాలి. లేదంటే మౌనంగా ఉండిపోవాలి. ప్రజలారా! స్త్రీల విషయంలో శ్రేయోభిలాషతో కూడిన మాటను అంగీకరించండి. (గుర్తుంచుకోండి!) స్త్రీలు ప్రక్కటెముక నుండి పుట్టించబడ్డారు. ప్రక్కటెముకలలో అన్నిటికన్నా వంకరగా ఉండేది పైఎముకే. (అంటే ఆమె ఎంత ఉన్నత వంశీయురాలై ఉంటే అంతే పెడసరితనం ఉంటుంది). ఒకవేళ మీరు దాన్ని తిన్నగా చేయాలనుకుంటే విరిచేస్తారు. దాన్ని దాని మానాన వదిలేస్తే వంకరగానే ఉండి పోతుంది. కాబట్టి వారి (స్త్రీల) విషయంలో మేలుతో కూడిన మాటను స్వీకరించండి." - దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

## 42వ అంశం : ఉత్తముడైన భర్త ఆలుబిడ్డల కోసం మనస్ఫూర్తిగా ఖర్చుపెడతాడు.

హజ్రత్ అబూ మస్వూద్ అన్సారీ (రజి)కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: "మనిషి తన ఇంటివారలపై ఖర్చుపెట్టడం (కూడా) దానమే (పుణ్య కార్యమే)". - (తిర్మిజీ 1965. సహీహ్ హదీసు)[2]

మహాప్రవక్త ముహమ్మద్(స) ఉపదేశించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు: "మీరు (గనక) ఒక దీనారును దైవమార్గంలో ఖర్చుపెడితే, మరొకటి బానిసను విడుదల చేయటానికి ఖర్చుపెడితే, ఇంకొకటి ఒక అభాగ్యుని కోసం దానంగా యిస్తే, వేరొకటి తమ ఆలుబిడ్డలపై ఖర్చుపెడితే- పుణ్యఫలం దృష్ట్యా మీరు మీ ఆలుబిడ్డలపై ఖర్చుపెట్టిన దీనారే శ్రేష్ఠమైనది." - దీనిని ముస్లిం పొందుపరిచారు.[3]

## 43వ అంశం : ఇంటి పనులలో భార్యకు సహాయపడే భర్త ఉత్తముడు.

హజ్రత్ అస్వద్ (రజి) కథనం : "దైవప్రవక్త (స) ఇంట్లో ఏం చేసేవారని" నేను హజ్రత్ ఆయిషా (ర.అన్హా)ను అడగ్గా, హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా చెప్పారు - "ఆయన(స) ఇంటి పనులలో నిమగ్నులై ఉండేవారు. నమాజు వేళ కాగానే నమాజుకై లేచి నిలుచునేవారు." - ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[4]

**వివరణ:** వేరొక ఉల్లేఖనంలో ఆయన(స) అంగడికెళ్ళి పచారీ సామానులు కొని తెచ్చేవారని, తన చెప్పులను స్వయంగా మరమ్మత్తు చేసుకునేవారని ఉంది.

---

1. కితాబున్నికాహ్, బాబుల్ వసీయతు బిన్నిసాఅ
2. సహీహ్ సుననె తిర్మిజీ-లిల్ అల్బానీ,-హ.నెం.1965
3. కితాబుజ్జకాత్-బాబు ఫజ్లున్నఫఖతు అలా ఈసాల్ వల్ మమ్లూక్
4. కితాబుల్ అదబ్ - బాబు కైఫ యకూనుర్రజులు ఫీ అహ్లిహీ

# ఆదర్శ ఇల్లాలి లక్షణాలు

## 44వ అంశం : సుకన్య, సుహాసిని, సుమధుర భాషిణి, సంతుష్టి, మగని మనసు దోచుకునేది, ఎక్కువమంది పిల్లల్ని కనేది అయిన మహిళ అత్యుత్తమ ఇల్లాలు

హ॥జత్ అబ్దుర్రహ్మాన్ బిన్ సాలిమ్ బిన్ ఉత్బ బిన్ అదీమ్ బిన్ సాయిద అన్సారీ (రహ్మ) తన తండ్రి నుండి, ఆయనేమో ఆయన తాతగారి నుండి ఉల్లేఖించారు. ఈ ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "కన్యలను వివాహ మాడండి. వారు మృదుభాషిణులై ఉంటారు. ఎక్కువ మంది పిల్లల్ని కంటారు. కొద్దిగా ప్రాప్తమైనా సంతోషిస్తారు." (ఇబ్నుమాజ 1861.సహీహ్ హదీసు)[1]

హ॥జత్ జాబిర్ (రజి) కథనం: "మేమొక యుద్ధంలో దైవప్రవక్త (స)వెంట ఉన్నాము. తిరుగు ప్రయాణంలో మదీనా (నగరం) సమీపించినప్పుడు, 'ఓ దైవప్రవక్తా(స)! నేనీ మధ్యే పెళ్ళి చేసుకున్నాన'ని అన్నాను. 'ఓహో! నీవు పెళ్లి చేసుకున్నావా!?' అని ఆయన(స) ఆసక్తిగా అడిగారు. 'అవును దైవప్రవక్తా(స)!' అన్నాను. 'కన్యను చేసుకున్నావా? వితంతువును చేసు కున్నావా?' అని ఆయన(స) దర్యాప్తు చేశారు. 'వితంతువును చేసుకున్నాన'ని చెప్పాను. దానికాయన(స), 'కన్యను చేసుకోకపోయావా? కన్యను చేసుకుని ఉంటే ఎంచక్కా ఆమె నీతో, నువ్వు ఆమెతో ఆడుకునేవారు కదా!' అన్నారు." (ముత్తఫఖున్ అలై)[2]

## 45వ అంశం : భర్త లేనప్పుడు అతని సొమ్మును, మానమర్యాదలను పరిరక్షిస్తూ భర్తకు విధేయురాలుగా, విశ్వాస పాత్రురాలుగా మసలుకునే స్త్రీ ఉత్తమ ఇల్లాలు.

మహనీయ ముహమ్మద్(స) ప్రవచించారని హ॥జత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) తెలియజేసేవారు: "ఉత్తమ ఇల్లాలు ఎవరంటే, నీవు ఆమె వంక చూసినప్పుడు నిన్ను ప్రసన్నుణ్ణి చేయాలి, నువ్వు దేని గురించైనా ఆజ్ఞాపించినప్పుడు దానిని పాలించాలి, నువ్వు (ఇంట్లో) లేనప్పుడు నీ సొమ్మును రక్షిస్తూ, నీ పరువును నిలుపుతూ ఉండాలి." దీనిని తబ్రానీ పొందు పరిచారు.[3] (సహీహ్ హదీసు)

## 46వ అంశం : పిల్లల్ని ప్రేమిస్తూ, భర్త వ్యవహారాలన్నింటిలోనూ విశ్వసనీయతతో మెలిగే మహిళ ఆదర్శ ఇల్లాలు

---

1. సహీహ్ సునన్ ఇబ్నుమాజ లిల్ అల్బానీ, మొదటిభాగం - హ.నెం.1508
2. *మిష్కాతుల్ మసాబీహ్ లిల్ అల్బానీ, రెండవభాగం- హ.నెం.3088*
3. *సహీహ్ జామె అస్సగీర్ వజియాదతిహీ లిల్ అల్బానీ, మూడవ భాగం-హ.నెం.3294*

teluguislam.net



హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఒంటెలపై స్వారీ అయ్యే మహిళలలోకెల్లా ఉత్తమ మహిళలు ఖురైషు మహిళలు. వారు పిల్లలపై ఎంతో వాత్సల్యం కురిపిస్తూ, జాలిచూపే వారై ఉంటారు. తమ భర్తల సిరిసంపదలను కాపాడుతూ, వారికి విశ్వసనీయులై ఉంటారు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

## 47వ అంశం : భర్త లైంగిక భావోద్రేకాలను గుర్తించి గౌరవించే మహిళ పట్ల అల్లాహ్ ప్రసన్నుడవుతాడు

హజ్రత్ అబూహురైరా (రజి)కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఎవరి చేతుల్లో నా ప్రాణ ముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ఏ వ్యక్తి అయినా తన భార్యను పడకపైకి పిలిచినప్పుడు భార్య నిరాకరిస్తే, ఆకాశాలలో ఉన్నవాడు (అల్లాహ్) ఆమెపట్ల అప్రసన్నుడవుతాడు- భర్త ఆమె పట్ల సంతుష్టుడు కానంతవరకూ (ఆయన కూడా ప్రసన్నుడవడు)."[2] దీనిని ముస్లిం పొందుపరిచారు.

## 48వ అంశం : భర్తను ఎక్కువగా ప్రేమించే స్త్రీ ఉత్తమ ఇల్లాలు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధించారని హజ్రత్ అనస్ (రజి) చెప్పారు: "మిమ్మల్ని ప్రేమించే మహిళను, ఎక్కువమంది సంతానాన్ని కనే స్త్రీని మనువాడండి. ఎందుకంటే ప్రళయదినాన నేను ఇతర ప్రవక్తలకు ప్రతిగా మీ అధిక సంఖ్య కారణంగా గర్వపడతాను." దీనిని అహ్మద్, తబ్రానీలు పొందుపరిచారు.[3] (హసన్ కోవకు చెందినది)

## 49వ అంశం : ఐదు పూటల నమాజులు చేస్తూ, రమజాన్ ఉపవాసాలు పాటిస్తూ, శీలవతిగా, భర్త విధేయురాలిగా రాణించే మహిళ ఉత్తమ సహధర్మచారిణి.

మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పారు: "ఏ స్త్రీ ఐదు పూటల నమాజులు సలుపుతూ, రమజాన్ ఉపవాసాలు పాటిస్తూ, తన మానాన్ని కాపాడుకుంటూ, తన భర్త ఆజ్ఞలను శిరసావహిస్తుందో ఆమెతో (ప్రళయ దినాన), 'నీవు కోరిన ద్వారం గుండా స్వర్గంలో ప్రవేశించవచ్చు' అని అనబడుతుంది." దీనిని ఇబ్నుహిబ్బాన్ పొందుపరిచారు.[4](సహీహ్ హదీసు)

---

1. *కితాబుల్ ఫజాయెల్-బాబు ఫీ నిసాయి ఖురైష్*
2. *కితాబున్నికాహ్- బాబు తహ్రీము ఇమ్తినావుహా మన్ ఫరాష్ జౌజహా*
3. *ఆదాబుజ్జిఫాఫ్ లిల్ అల్‌బానీ - పేజీ నెం.89/ ముస్నద్ అహ్మద్ 12152*
4. *సహీహ్ జామె సగీర్ వ జియాదతిహీ లిల్ అల్‌బానీ, మొదటి భాగం- హ.నెం.673*

## 50వ అంశం : భర్తను సంతోషపరుస్తూ, భర్తకు విధేయత చూపుతూ, తన సర్వస్వాన్ని భర్తకై ధారబోసే మహిళ అత్యుత్తమ ఇల్లాలు

హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు- ఓ దైవప్రవక్తా (స)! అత్యుత్తమ మహిళ ఎవరు?' అని ప్రశ్నించగా, "తన భర్త తన వైపు చూసినప్పుడు అతన్ని సంతుష్టపరిచే మహిళ. దేని గురించైనా ఆజ్ఞాపించినప్పుడు ఆజ్ఞాపాలన చేసే వనిత. ఇంకా స్త్రీ ధనప్రాణాల విషయంలో భర్త ఏదన్నా అయిష్టతను వ్యక్తం చేసినప్పుడు వ్యతిరేకించకుండా ఉండే మహిళ " అని ఆయన(స) సమాధానమిచ్చారు. (నసాయి 3231 ఈ హదీసు హసన్ కోవకు చెందినది)[1]

## 51వ అంశం : ప్రతి విషయంలోనూ భర్త పరలోక సాఫల్యాన్ని దృష్టి యందుంచుకునే స్త్రీ ఆదర్శ ఇల్లాలు

హజ్రత్ సౌబాన్ (రజి) తెలిపారు: వెండీ బంగారాలను ప్రోగుచేసి పెట్టడంపై (హెచ్చరిక చేస్తూ) ఆయత్ అవతరించినప్పుడు ప్రవక్త సహచరులు (రజి) గుమికూడి 'మరి మేము ఏ సంపదను సమకూర్చుకోవాలి?' అని పరస్పరం తర్జనభర్జన చేసుకోసాగారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) 'మీ సందేహానికి సమాధానం నేనిప్పుడే కనుక్కొని వస్తాను' అని చెప్పి, ఆయన ఒంటెపై స్వారీ అయి దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళారు. నేను కూడా (అంటే హజ్రత్ సౌబాన్) ఉమర్ (రజి) వెనకే వెళ్ళాను. 'దైవప్రవక్తా (స)! ఇంతకీ మేము సమకూర్చుకోవలసిన సామగ్రి ఏది?' అని ఉమర్ (రజి) ప్రశ్నించగా, ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు: "మీలో ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతా భావంతో కూడిన హృదయం, దైవనామాన్ని స్మరించే నోరు, పరలోకం విషయంలో మీకు తోడ్పాటునందించే విశ్వాసురాలైన భార్య ఉండాలి. మీరంతా వీటిని పొందేందుకు కృషి చేయాలి." (ఇబ్నుమాజా 1856. సహీహ్ హదీసు)[2]

## 52వ అంశం : ఆదర్శ ఇల్లాలి కొరకు అనుసరణీయులైన నలుగురు మహిళామణులు

మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రబోధించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు: "విశ్వంలోనే విశిష్టులైన నలుగురు మహిళామణులున్నారు - 1) హజ్రత్ మర్యమ్ బిన్తె ఇమ్రాన్ (ర.అన్హా), 2) హజ్రత్ ఖదీజా బిన్తె ఖువైలిద్ (ర.అన్హా), 3) హజ్రత్ ఫాతిమా (రజి) బిన్తె ముహమ్మద్ (స), 4) ఫిర్ఔన్ సతీమణి అగు హజ్రత్ ఆసియా (ర.అన్హా)." దీనిని తబ్రానీ పొందుపరిచారు.[3] (సహీహ్ హదీసు)

---

1. *సహీహ్ సుననె నసాయి లిల్ అల్బానీ- రెండవ భాగం-హ.నెం.3030*
2. *సహీహ్ సున్ననె ఇబ్నుమాజా లిల్ అల్బానీ, మొదటిభాగం- హ.నెం.1505*
3. *సహీహ్ జామె సగీర్ వ జియాదతిహి లిల్ అల్బానీ, మూడవ భాగం-హ.నెం.3323*

teluguislam.net



# భర్త హక్కుల ప్రాముఖ్యత

## 53వ అంశం : భర్త హక్కు నెరవేర్చని మహిళ దేవుని హక్కును కూడా నెరవేర్చదు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఎవరి చేతిలోనయితే నా ప్రాణముందో ఆ శక్తిమంతుని తోడు! స్త్రీ తన భర్త హక్కును నెరవేర్చనంతవరకూ తన ప్రభువు హక్కును (కూడా) నెరవేర్చదు. ఒకవేళ స్త్రీ (గుర్రం లేక ఒంటె వీపుపై పరచబడిన) మెత్తపై స్వారీ అయివున్నాసరే భర్త పిలిచినట్లయితే నిరాకరించకూడదు." (ఇబ్నుమాజా-1853.సహీహ్ హదీసు)[1]

## 54వ అంశం : భర్త హక్కు పూర్తిగా నెరవేర్చటం ఏ స్త్రీ వల్ల కూడా కాని పని.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: మహనీయ ముహమ్మద్ (స) ఈ విధంగా ప్రవచించారు: "భర్తకు భార్యపై గల హక్కు ఎంత అధికమైనదంటే, ఒకవేళ భర్తకు గాయమైనప్పుడు, భార్య ఆ గాయాన్ని నాకినా సరే భర్త హక్కు నెరవేరదు.- దీనిని హాకిమ్, ఇబ్నె హిబ్బాన్, ఇబ్నె అబీ షైబా, దారె ఖుత్నీ, బైహఖీ పొందుపరిచారు.[2] (సహీహ్ హదీసు)

## 55వ అంశం : భర్త హక్కును నెరవేర్చని భార్యను స్వర్గ కన్యలు శపిస్తారు

మహనీయ ముహమ్మద్(స) ప్రవచించారని హజ్రత్ మఆజ్ బిన్ జబల్ (రజి) చెప్పారు: "ఏ స్త్రీ అయినా తన భర్తకు మనస్తాపం కలిగించినప్పుడు పెద్ద కన్నులు గల స్వర్గకన్యలలో నుంచి ఒకామె (సజ్జనుడైన ఆ భర్తకు కాబోయే భార్య) ఇలా అంటుంది: అల్లాహ్ నిన్ను నాశనం జెయ్యి! ఆయన్ని బాధించకే. కొన్నాళ్ళపాటే ఆయన నీ దగ్గర ఉండేది. త్వరలోనే ఆయన నిన్ను వదలి మావద్దకు రానున్నారు." - (ఇబ్నుమాజ 2014. సహీహ్ హదీసు)[3]

---

1. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్బానీ, మొదటిభాగం-హ.నెం.1533
2. సహీహ్ జామె సగీర్ వ జియాదతిహి లిల్ అల్బానీ, మూడవ భాగం-హ.నెం.3143
3. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్బానీ, మొదటిభాగం-హ.నెం.1637

# భర్త హక్కులు

## 56వ అంశం : కుటుంబ నిర్వహణ దృష్ట్యా (ధార్మికంగా కాదు) భర్త ఆధిక్యతను భార్య తప్పనిసరిగా అంగీకరించవలసి ఉంటుంది.

## 57వ అంశం : భార్య తన భర్త మాట వినకపోతే మొదటి దశలో నచ్చజెప్పాలి. రెండవ దశలో భర్త తన పడక నుంచి ఆమెను వేరు చేయాలి. మూడవ దశలో తేలిగ్గా కొట్టే హక్కు కూడా భర్తకు ఉంది.

"పురుషులు స్త్రీలపై అధికారులు. ఎందుకంటే అల్లాహ్ ఒకరికి ఇంకొకరిపై విశిష్ఠతను వొసగాడు. అదీగాక పురుషులు తమ సంపదను (వారిపై) ఖర్చుపెట్టారు. కనుక గుణవంతులైన స్త్రీలు విధేయులై ఉంటారు. తమ భర్తలు లేని సమయంలో అల్లాహ్ రక్షణలో ఉంటూ (తమ శీలాన్ని, భర్త సంపదను) కాపాడుతారు. ఏ స్త్రీలు అవిధేయతకు పాల్పడతారని మీకు భయం ఉంటుందో వారికి నచ్చజెప్పండి. (అవసరమైతే) పడక దగ్గర వారిని వేరుగా ఉంచండి. వారిని కొట్టండి. ఆ తరువాత వారు గనక మీకు విధేయులైతే వారిని అనవసరంగా వేధించే ఉద్దేశంతో సాకులు వెతక్కండి. నిశ్చయంగా అల్లాహ్ సర్వోన్నతుడు, గొప్పవాడు."

(దివ్యఖుర్ఆన్-4:34)

## 58వ అంశం : భార్య తన శక్తిసామర్థ్యాల కనుగుణంగా భర్త సేవలు చేయటం తప్పనిసరి.

## 59వ అంశం : భార్యకు భర్తే స్వర్గం, భర్తే నరకం

- హజ్రత్ హుసైన్ బిన్ ముహ్సిన్ (రజి) కథనం: నా మేనత్తగారు నాకు ఈ విధంగా తెలిపారు- నేను ఒక పని మీద దైవప్రవక్త (స)గారి సన్నిధికి వెళ్ళాను. అప్పుడు ఆయన(స), "ఎవరీమె? భర్త గల స్త్రీయేనా?"అని దర్యాప్తు చేశారు. నేను 'అపున'న్నాను. "భర్త యెడల నీ వైఖరి ఎలావుంది?'అని ఆయన(స) ఆరా తీశారు. 'ఆయన గారికి విధేయత చూపటంలోగానీ, సేవ చేయటంలోగానీ ఏ లోటూ రానీయలేదు. ఇక నా వశంలో లేని దాని గురించి నేనేమీ చెప్పలేను' అన్నాను. "అది సరేగాని, అతని దృష్టిలో నువ్వెలా ఉన్నావ్? ఒక విషయం బాగా గుర్తుంచుకో! నీ స్వర్గమైనా, నరకమయినా అతనే" అని ఆయన(స) హితవు పలికారు.[1] దీనిని అహ్మద్, తబ్రానీ, హాకిమ్, బైహఖీలు పొందుపరిచారు. (సహీహ్ హదీసు)

---

*1. ఆదాబుజ్జిఫాఫ్ లిల్ అల్‌బానీ, పేజీ నెం.285 (మూడవ ముద్రణ)*

teluguislam.net



- హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: "నేను గనక (అల్లాహ్ తప్ప) వేరెవరికయినా సాష్టాంగ ప్రణామం చేయమని ఆజ్ఞాపించి ఉంటే, తన భర్తకు సాష్టాంగ ప్రణామం చేయవలసిందిగా భార్యకు ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి." (తిర్మిజీ 1159. సహీహ్ హదీసు)[1]

వివరణ : దైవం మరియు దైవప్రవక్త (స) ఆదేశాలను ధిక్కరించే విషయమై భర్త ఆజ్ఞాపిస్తే, దాన్ని పాటించవలసిన బాధ్యత భార్యపై లేదు. మహాప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అల్లాహ్‌కు అవిధేయత చూపే విషయంలో ఎవరి మాటనూ వినాల్సిన పనిలేదు. (ముస్నద్ అహ్మద్)

## 60వ అంశం : భర్త వెలిబుచ్చిన ప్రతి ధర్మమైన కోర్కెనూ భార్య గౌరవించాలి.

- హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రబోధించారు: "భర్త సమక్షంలో అతని అనుమతి లేకుండా (నఫిల్) ఉపవాసం పాటించటంగానీ, భర్త అనుమతి లేకుండా వేరొకరిని (పురుషుణ్ణి లేదా స్త్రీని) ఇంట్లోకి అనుమతించటం గానీ భార్యకు సమ్మతం కాదు. ఏ స్త్రీ అయినా భర్త అనుమతి లేకుండా ఇంటి ఖర్చుల్లోనుంచి దైవమార్గంలో దానం చేస్తే అందులో భర్తకు కూడా సగం పుణ్యం లభిస్తుంది" -దీనిని బుఖారీ పొందుపరిచారు.[2]

- మహనీయ ముహమ్మద్ (స) ప్రవచించారని హజ్రత్ తలఖ్ బిన్ అలీ (రజి) తెలిపారు: "మగవాడు తన భార్యను తన అవసరం నిమిత్తం పిలిచినప్పుడు ఆమె తక్షణం రావాలి- ఆమె (పొయ్యిలో) రొట్టె కాల్చుతూ ఉన్నాసరే." - (తిర్మిజీ 1160.సహీహ్ హదీసు)[3]

## 61వ అంశం : భర్త లేనప్పుడు అతని ఆస్తిపాస్తులను రక్షించవలసిన బాధ్యత ఇల్లాలిది

హజ్రత్ అబూ ఉమామా బాహిలీ (రజి) కథనం : దైవప్రవక్త (స) అంతిమ హజ్జ్ యాత్ర చేసిన సంవత్సరం ఉపన్యాసమిస్తుండగా నేను విన్నాను. ఆయన(స) ఇలా అన్నారు: "స్త్రీ తన భర్త గృహం నుంచి అతని అనుమతి లేకుండా ఏదీ ఖర్చుపెట్టకూడదు." 'దైవప్రవక్తా(స)! అన్నదానం కూడా చేయకూడదా?' అని విన్నవించుకోగా, "అన్నం సంపదలలోకెల్లా గొప్పది కదా! (అంటే భర్త అనుమతి లేకుండా అన్న దానం కూడా చేయరాదు)" (తిర్మిజీ 670.ఈ హదీసు హసన్ కోవకు చెందినది)[4]

---

1. *సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ, మొదటిభాగం-హ.నెం.926*
2. *కితాబున్నికాహ్....*
3. *సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ, మొదటిభాగం-హ.నెం.927*
4. *సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ, మొదటిభాగం-హ.నెం.538*

## 62వ అంశం : భర్త పరోక్షంలో అతని పరువు ప్రతిష్ఠలను రక్షించవలసిన బాధ్యత భార్యపై ఉంది

హజ్రత్ జాబిర్ (రజి) అంతిమ హజ్జ్ యాత్ర సందర్భంగా జరిగిన ప్రసంగాన్ని ఉదాహరిస్తూ మహనీయ ముహమ్మద్ (స) ఈ విధంగా చెప్పారని అన్నారు: "మహిళల విషయంలో అల్లాహ్‌కు భయపడండి. ఎందుకంటే మీరు వారిని అల్లాహ్ పేరుపై పొందారు. అల్లాహ్ ఆదేశంతోనే వారి మానం మీ కొరకు ధర్మసమ్మతం అయింది. స్త్రీలపై మీకు గల హక్కు ఏమి టంటే, వారు మీ పడకపై (అంటే మీ ఇంట్లోకి) మీరు ఇష్టపడని వ్యక్తులను రానివ్వకూడదు. ఒకవేళ వారలా చేస్తే మీకు వారిని కొట్టే అనుమతి కూడా ఉంటుంది. అయితే తీవ్రంగా గాయమయ్యే విధంగా కొట్టకూడదు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

## 63వ అంశం : కలిమిలోనూ, లేమిలోనూ పతికి చేదోడు వాదోడుగా ఉండవలసిన బాధ్యత సతిపై ఉంది

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "నేను అగ్నిని చూశాను. ఈ రోజు చూసినంతటి భయంకరమైన దృశ్యాన్ని నేనెన్నడూ చూడలేదు. నరకంలో నేను స్త్రీలు ఎక్కువగా ఉండటం గమనించాను." 'ఎందుచేత ఓ దైవప్రవక్తా (స)!' అని సహచరులు (రజి) సందేహపడగా, "వారిలోని కృతఘ్నత మూలంగా" అని ఆయన(స) సమాధానమిచ్చారు. 'ఏమిటీ, వారు అల్లాహ్ యెడల కృతఘ్నత కలిగి ఉంటారా?' అని సహచరులు(రజి) ప్రశ్నించగా, "(లేదు. కాని) వారు తమ భర్తల పట్ల కృతఘ్నులై ఉంటారు. వారు చేసిన మేలును గుర్తించరు. స్త్రీల పరిస్థితి ఎలా ఉంటుందంటే, జీవితాంతం మీరు వారికి ఉపకారం చేస్తూ ఉన్నప్పటికీ మీ తరఫున (ఎప్పుడన్నా) ఏదయినా చిన్న విషయంలో వారికి బాధ కలిగినా, 'అః నీ వల్ల నేనెప్పుడు సుఖపడ్డానులే!' అని అనేస్తారు." దీనిని బుఖారీ పొందుపరిచారు.[2]

---

1. కితాబున్నికాహ్- బాబు హజ్జతున్నబీ
2. కితాబున్నికాహ్- బాబు కుఫ్రానుల్ అషీర్

teluguislam.net



# భార్య హక్కుల ప్రాముఖ్యత

## 64వ అంశం : చట్టపరంగా పురుష హక్కులు, స్త్రీ హక్కులు సమానస్థాయి గలవి

హజ్రత్ సులైమాన్ బిన్ అమ్ర్ బిన్ అహ్వాస్ (రజి) హజ్జతుల్ విదాలో దైవప్రవక్త (స) వెంటవున్న తన తండ్రి నుండి గ్రహించి చెప్పారు - దైవప్రవక్త (స) ఒక ప్రసంగంలో దైవస్తోత్రం చేసిన పిదప ప్రజలకు హితబోధ చేశారు. ఆయన ఒక హదీసులోని వృత్తాంతాన్ని కూడా తెలిపారు. (దాని ప్రకారం) దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ప్రజలారా! వినండి! స్త్రీల విషయంలో శ్రేయస్కరమైన మాటను ఆమోదించండి. వారు మీ వద్ద ఖైదీల మాదిరిగా ఉన్నారు. జాగ్రత్త! పురుషులకు స్త్రీలపై గల హక్కులు ఎటువంటివో స్త్రీలకు పురుషులపై గల హక్కులు (కూడా) అటువంటివే." - (తిర్మిజీ 1163. ఈ హదీసు హసన్ కోవకు చెందినది)[1]

## 65వ అంశం : భార్య హక్కులను నెరవేర్చటం తప్పనిసరి

మహాప్రవక్త ముహమ్మద్(స) తనకు ఈ విధంగా ఉపదేశించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్అస్ (రజి) చెప్పారు. "ఓ అబ్దుల్లాహ్! నువ్వు పగటిపూట నిరంతరం ఉపవాసం ఉంటావనీ, రాత్రిపూట నిరంతరం దైవారాధనలో గడుపుతావని నాకు తెలిసింది (నిజమేనా?)". దానికి నేను 'అవును ఓ దైవప్రవక్త(స)!' అని చెప్పాను. అప్పుడాయన (స) ఇలా ఉపదేశించారు: "అలా చేయకు. ఉపవాసం కూడా ఉండు. (మధ్యలో) విడుస్తూ కూడా ఉండు. రాత్రిపూట ఖియామ్ (దైవారాధన) చేస్తూ ఉండు. (దాంతోపాటు) విశ్రాంతి కూడా తీసుకో. నీ శరీరానికి నీపై హక్కు ఉంది. నీ కళ్లకు నీపై హక్కు ఉంది. నీ భార్యకు నీపై హక్కు ఉంది." - దీనిని బుఖారీ పొందుపరిచారు.[2]

## 66వ అంశం : భార్య హక్కు ఇవ్వకపోవటం వినాశ సూచకం

మహనీయ ముహమ్మద్ (స) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజి) చెప్పారు: "మనిషిపై ఎవరి ఖర్చుల బాధ్యత ఉందో వారికి ఆ ఖర్చులు ఇవ్వకపోవటం అనే పాపం ఒక్కటి చాలు (అతను నాశనం కావటానికి!). దీనిని ముస్లిం పొందుపరిచారు.[3]

---

*1. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్బానీ, మొదటిభాగం-హ.నెం.929*

*2. కితాబున్నికాహ్- బాబు లిజౌజిక అలైక హఖ్ఖున్*

*3. కితాబుజ్జకాత్ - బాబు ఫజ్లున్నుఫ్ఖతు అలల్ అయాలి వల్ మమ్లూక్*

## 67వ అంశం : స్త్రీ హక్కు ఇవ్వకపోవటం మహా పాపం

మహనీయ ముహమ్మద్(స) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు: "ఓ అల్లాహ్! నేను ఇద్దరు బలహీనుల హక్కును కాజేయటాన్ని నిషేధిస్తున్నాను. 1) అనాధ (హక్కు), 2) స్త్రీ (హక్కు)." (ఇబ్నుమాజా 3678.ఈ హదీసు హసన్ కోవకు చెందినది)[1]

## 68వ అంశం : హరించబడిన భార్య హక్కులను ప్రళయ దినాన భర్త చెల్లించవలసి ఉంటుంది

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ప్రళయ దినాన మీరు ఒండొకరి హక్కులను తప్పకుండా చెల్లించాల్సి వస్తుంది. (ఒకవేళ కొమ్ములుగల మేక కొమ్ములు లేని మేకను పొడిచి ఉంటే) కొమ్ములు గల మేక నుండి కొమ్ములు లేని మేక తరఫున ప్రతీకారం తీర్చుకోబడుతుంది." దీనిని ముస్లిం పొందుపరిచారు.[2]

## 69వ అంశం : భార్యపై అన్యాయానికి ఒడిగట్టరాదు

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: "పీడితుని ఆక్రందన నుండి తప్పించుకోండి. అగ్ని జ్వాల ఎలా వేగంగా పైకి లేస్తుందో అలాగే పీడితుని ఆక్రందన ఆకాశాన్నంటుకుంటుంది." దీనిని హాకిమ్ పొందుపరిచారు.[3] (సహీహ్ హదీసు)

---

*1. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ, మొదటి భాగం-హ.నెం.2967*

*2. కితాబుల్ బిర్ వస్సిల - బాబు తహ్రీముజ్జుల్మ్*

*3. సిల్‌సిలతు అహాదీసుస్సహీహా లిల్ అల్‌బానీ, మూడవ భాగం- హ.నెం.870*

teluguislam.net

# భార్య హక్కులు

## 70వ అంశం : మహర్ భార్య హక్కు. దాన్ని భర్త తప్పనిసరిగా చెల్లించాలి

"అందుకే మీరు ఏ స్త్రీలతో సౌఖ్యాన్ని పొందారో వారికి వారి నిర్ధారిత మహర్ సొమ్మును విధిగా ఇవ్వాలి." (అన్ నిసా-24)

## 71వ అంశం : మనోవర్తి స్త్రీ హక్కు. దాన్ని పురుషుడు మనస్ఫూర్తిగా ఇవ్వాలి.

హజ్రత్ హకీమ్ బిన్ ముఆవియ (రజి) తన తండ్రి నుండి ఉటంకించారు- ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "భార్యకు భర్తపై గల హక్కు ఏమిటి?' అని ప్రశ్నించాడు. దానికాయన (స) ఇలా సమాధానమిచ్చారు: "నీవు స్వయంగా తిన్నప్పుడు ఆమెకూ తినిపించాలి. నీవు తొడిగినప్పుడు ఆమెకూ తొడిగించాలి. (ఆమెను) చెంపపై కొట్టకూడదు. తిట్టకూడదు. (ఎప్పుడయినా ఆమెను పడక నుంచి వేరుపరచదలిస్తే) నీ ఇంట్లోనే తప్ప వేరొక చోట వేరు పరచకూడదు." (ఇబ్ను మాజా 1850. సహీహ్ హదీసు)[1]

## 72వ అంశం : తల్లిదండ్రుల తరువాత అందరికన్నా ఎక్కువ సద్వ్యవహారానికి అర్హురాలు ఇల్లాలే

- మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) చెప్పారు: "విశ్వాస (ఈమాన్) పరంగా చూసినప్పుడు అందరిలోకెల్లా గుణసంపన్నుడే సంపూర్ణ విశ్వాసి. ఇకపోతే తన భార్యల యెడల ఉత్తముడైనవాడే మీ అందరిలోకీ ఉత్తముడు."
(తిర్మిజీ 1162. సహీహ్ హదీసు)[2]

- మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధించారని హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పారు: "మీరు (గనక) ఒక దీనారును దైవమార్గంలో ఇస్తే, ఒక దీనారును బానిసను విడుదల చేయించటానికి ఇస్తే, ఒక దీనారును అభాగ్యునికి ఇస్తే, ఇంకా ఒక దీనారును ఇంటివారిపై ఖర్చుపెడితే- పుణ్యఫలం దృష్ట్యా వీటన్నింటిలో ఇంటివారిపై ఖర్చుపెట్టిన దీనారు శ్రేష్ఠమైనది." దీనిని ముస్లిం పొందుపరిచారు.[3]

---

1. *సహీహ్ సుననె ఇబ్ను మాజా లిల్ అల్‌బానీ, మొదటి భాగం-హ.నెం.1500*
2. *సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ, మొదటిభాగం-హ.నెం.928*
3. *కితాబ్జుకాత్ -బాబు ఫజ్లున్నుఫ్కతు అలల్ అయాలి వల్ మమ్లూక్*

- మహనీయ ముహమ్మద్ (స) ప్రవచించారని హజ్రత్ అమ్ర్ బిన్ ఉమయ్యా జమరీ (రజి) తెలిపారు: "భర్త భార్యపై ఖర్చు చేసేది కూడా సదఖాయే (దానమే, పుణ్యకార్యమే)."
*(అహ్మద్ 4/199 సహీహ్ హదీసు)[1]

- మహాప్రవక్త ముహమ్మద్(స) ప్రబోధించారని హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పారు: "విశ్వాసి అయిన ఏ వ్యక్తి కూడా ఏ విశ్వాసురాలినీ ద్వేషించరాదు. ఒకవేళ స్త్రీలోని ఒక అలవాటు నచ్చకపోతే మరో అలవాటు నచ్చవచ్చు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[2]

- హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జమ్అ (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: "ఏ మనిషీ తన భార్యను బానిసరాలిని కొట్టినట్లుగా కొట్టి, కడజామున ఆమెతో పడక సుఖం అనుభవించటం శోభాయమానం కాదు." - దీనిని బుఖారీ పొందుపరిచారు.[3]

## 73వ అంశం : భార్య లైంగిక హక్కులను తీర్చవలసిన బాధ్యత భర్తపై ఉంది.

సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) చెబుతుండగా తాను విన్నానని హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మలై) తెలిపారు- "మహాప్రవక్త ముహమ్మద్ (స) హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్వూన్ (రజి)కు స్త్రీల నుండి వేరుగా ఉండేందుకు అనుమతి ఇవ్వలేదు. ఒకవేళ ఆయన(స) హజ్రత్ ఉస్మాన్ (రజి)కు అనుమతి ఇచ్చి ఉంటే, మేము కూడా ( ఏ మందో మాకో తిని) నపుంసకులుగా తయారయ్యేవారం." దీనిని బుఖారీ పొందుపరిచారు.[4]

వివరణ: దీనికి సంబంధించిన మరిన్ని వివరాలకు `ఈలా' ఆదేశాలను చూడండి.

## 74వ అంశం : భార్యకు ఖుర్ఆన్ హదీసుల విద్య నేర్పటం, దైవానికి భయపడుతూ జీవించమని ప్రబోధించటం భర్త బాధ్యత

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రబోధించారు: "మీ స్థోమతకు తగ్గట్టుగా మీ ఆలుబిడ్డలపై ఖర్చుచేయండి. వారికి విద్యాశిక్షణలిచ్చేందుకు అవసరమైతే బెత్తాన్ని కూడా ఉపయోగించండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండవలసిందిగా వారికి తాకీదు చేస్తూ ఉండండి." (అహ్మద్ 21060 ఇరవావుల్ ఘలీల్. సహీహ్ 2026).[5]

---

1. కితాబున్నికాహ్-బాబుల్ వసీయతు బిన్నిసాఅ
2. కితాబున్నికాహ్- బాబుల్ వసీయతు బిన్నిసాఅ
3. కితాబున్నికాహ్- బాబు మా యక్రహు మన్ జరబన్నిసాఅ
4. కితాబున్నికాహ్- బాబు మా యక్రహు మినల్ తబత్తుల్
5. నైలుల్ అవ్తార్-కితాబున్నికాహ్, బాబు ఇహ్సానుల్ అషీరతు...

teluguislam.net



- హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) "మీరు మిమ్మల్నీ, మీ కుటుంబీకుల్ని అగ్ని బారి నుండి కాపాడుకోండి" అనే దైవాదేశాన్ని (అత్ తహ్రీమ్-6) గురించి చెబుతూ, మంచినీ మేలుతో కూడుకున్న విషయాలను స్వయంగా నేర్చుకోవటంతోపాటు తమ ఆలుబిడ్డలకు కూడా నేర్పాలని ఉద్బోధించారు. (హాకిమ్ 3785, బైహఖీ 8447)[1]

## 75వ అంశం : భార్య గౌరవాన్ని, పరువును కాపాడవలసిన బాధ్యత భర్తపై ఉంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ముగ్గురు వ్యక్తులు స్వర్గంలో ప్రవేశించలేరు. 1) తల్లిదండ్రుల పట్ల అవిధేయతకు పాల్పడేవాడు, 2) పౌరుషం లేనివాడు (దయ్యూస్), 3) ఆడవాళ్ళను పోలిన విధంగా వేషధారణ చేసేవాడు." దీనిని హాకిమ్, బైహఖీలు పొందుపరిచారు.[2] (సహీహ్ హదీసు)

వివరణ: అరబీలో 'దయ్యూస్' అని వుంది. తన భార్య వద్దకు పరాయి పురుషుడు వచ్చినప్పటికీ రోషం లేకుండా సర్దుకుపోయేవాణ్ణి 'దయ్యూస్' అంటారు.

- నా భార్యగాని పరాయి పురుషునితో ఉండగా నా కంట పడితే నేనావిడ మెడను పదునైన ఖడ్గంతో ఛేదిస్తాను అని హజ్రత్ సాద్ బిన్ ఉబాద (రజి) చెప్పారు. దానిపై మహాప్రవక్త (స), "ఏమిటీ, మీరంతా సాద్ పౌరుషంపై ఆశ్చర్య పోతున్నారా? (నిశ్చయంగా అతను పౌరుషం గలవాడు) నేను అతని కన్నా ఎక్కువ పౌరుషవంతుణ్ణి. అల్లాహ్ నాకన్నా ఎక్కువ పౌరుషం గలవాడు (అంటే అల్లాహ్ హరామ్ పనులనుగానీ, హత్యనుగానీ ఇష్టపడడు)." దీనిని బుఖారీ పొందుపరిచారు.[3]

## 76వ అంశం : ఒకరికన్నా ఎక్కువ మంది భార్యలున్నప్పుడు వారి మధ్య న్యాయం చేయటం భర్తకు తప్పనిసరి.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఏ వ్యక్తికయినా ఇద్దరు భార్యలుండి, ఆ ఇద్దరిలో అతను ఎవరో ఒకరి వైపున మొగ్గిపోతే (అంటే వారిద్దరి మధ్య న్యాయం చేయకపోతే), అతను ప్రళయదినాన తన శరీరంలో సగభాగం పడిపోయిన స్థితిలో (పక్షవాతం వచ్చినవానిలా- సమాధిలో నుంచి) లేచివస్తాడు."
(అబూదావూద్ 2133.సహీహ్ హదీసు)[4]

---

1. *యన్‌హజ్జురబీబ...పేజీ-26, ముసన్నఫ్ అబ్దుర్రజ్జాక్ 4742, పేజి నం. 3.*
2. *సహీహ్ జామె సగీర్ వ జియాదతిహి లిల్ అల్‌బానీ, మూడవభాగం-హ.నెం.3058*
3. *కితాబున్నికాహ్ -బాబుల్ ఘీరతు*
4. *సహీహ్ సునన అబీ దావూద్ లిల్ అల్‌బానీ, రెండవ భాగం- హ.నెం.1867*

# దైవప్రవక్త (స) జీవితంలో మీకు అత్యుత్తమ ఆదర్శం ఉంది

## 77వ అంశం : దైవప్రవక్త (స)- ఆయన సతీమణుల మధ్య గల ప్రేమానురాగాలకు సంబంధించిన ఓ సరదా సంఘటన

● హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (స) ఏ ప్రయాణానికయినా బయలుదేరుతున్నప్పుడు సతీమణుల పేర్లు చీటీలపై వ్రాసేవారు. ఒకసారి ప్రయాణంలో హజ్రత్ ఆయిషా (ర.అ.), హజ్రత్ హఫ్సా (ర.అ)ల పేర్లు వచ్చాయి (అందువల్ల వారిద్దరూ దైవప్రవక్త వెంట బయలుదేరారు). ప్రయాణం చేస్తున్నప్పుడు రాత్రి పూట కూడా దైవప్రవక్త (స) సతీమణులతో కబుర్లు చెబుతూ ఉండేవారు. ఒక రోజు హజ్రత్ హఫ్సా(రఅ) హజ్రత్ ఆయిషా(ర)తో, "ఈ రోజు రాత్రి నువ్వు నా ఒంటెపై కూర్చో. నేను నీ ఒంటెపై కూర్చుంటాను. నువ్వూ చూస్తుండు. నేనూ చూస్తుంటాను- ఏం జరుగుతుందో" అన్నారు తమాషాగా. అనుకున్నట్లుగా వారిద్దరూ ఒంటెలు మార్చుకున్నారు. దైవప్రవక్త (స) రాత్రి పూట (అలవాటు ప్రకారం) హజ్రత్ ఆయిషా(ర) స్వారీ అయ్యే ఒంటె వద్దకు వచ్చారు. నిజానికి ఆ ఒంటె మీద హజ్రత్ హఫ్సా (ర) స్వారీ అయి ఉన్నారు. దైవప్రవక్త (స) సలామ్ చేశారు (కాని ఒంటెపై ఎవరున్నారో పసిగట్టలేకపోయారు). అలా ప్రయాణిస్తూనే గమ్యం చేరుకున్నారు. ఆ విధంగా హజ్రత్ ఆయిషా(రఅ) ఆ రోజు రాత్రి దైవప్రవక్త (స) సహచర్యానికి నోచుకోకుండా పోయారు. ఒంటెపై నుంచి దిగిన తరువాత, హజ్రత్ ఆయిషా(రఅ) తన రెండు పాదాలను అజ్ఖర్ గడ్డిలో పెట్టి ఇలా అన్నారు : "ఓ అల్లాహ్! ఏ పామునో, తేలునో పంపు - అవి నన్ను కాటేయడానికి!! నేను ఆయన్ని(స) నిందించలేను (ఎందుకంటే ఇదంతా నా వల్లనే జరిగింది)". దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

## 78వ అంశం : ఆలుమగల ముచ్చట్లు

● హజ్రత్ ఆయిషా (ర.అ) కథనం: దైవప్రవక్త (స) నాతో ఇలా అన్నారు - "(ఆయిషా!) నువ్వు నాపట్ల ఎప్పుడు సంతోషంగా ఉంటావో, ఎప్పుడు కోపంగా ఉంటావో కూడా నాకు తెలిసిపోతుంది" అన్నారు. 'అదెట్లా?' అని అడగ్గా, ఆయన(స) ఇలా అన్నారు: 'నువ్వు నా పట్ల సంతోషంగా ఉన్నప్పుడు మాటిమాటికీ 'ముహమ్మద్ (స) ప్రభువుపై ఒట్టు' అంటుంటావు. నా

---

1. *జుబైదీచే సంకలనం చేయబడిన సంక్షిప్త సహీహ్ బుఖారీ-హ.నెం.1862*

మీద కోపం వచ్చినప్పుడు, 'ఇబ్రాహీం (అలై)ప్రభువుపై ఒట్టు' అంటుంటావ్ (అవునా!)". సమాధానంగా ఆయిషా (ర) ఇలా అన్నారు- 'అవును ఓ దైవప్రవక్తా(స)! కోపం వచ్చినప్పుడు తప్ప మీ పేరును వదలనుగాక వదలను'. దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

## 79వ అంశం : ప్రేమను వ్యక్తపరిచే విధము...

● హజ్రత్ ఆయిషా (రఅ) కథనం : మహాప్రవక్త (స) బఖీ ఖనన వాటిక నుంచి (ఒకరి అంత్యక్రియలలో పాల్గొని) తిరిగి వచ్చినప్పుడు నాకు తలనొప్పి తీవ్రంగా ఉంది. దాంతో నేను 'నా తల పగిలిపోతోంది' అన్నాను. దానికాయన(స) "పగులుతున్నది నీ తల కాదు, నా తల"అన్నారు. ఆ తరువాత ఆయన (స) ఇలా అన్నారు - 'ఆయిషా(ర)! నువ్వు గనక నాకన్నా ముందే చనిపోతే నిన్ను సాగనంపే పనులన్నీ నేను స్వయంగా చేసేవాణ్ణి. నీకు స్నానం చేయించేవాణ్ణి, నీకు కఫన్ వస్త్రం తొడిగించేవాణ్ణి. నీ జనాజా నమాజ్ చేయించేవాణ్ణి. నేను స్వయంగా నిన్ను ఖననం చేసేవాణ్ణి." (ఇబ్నుమాజా 1465 ఈ హదీసు హసన్ కోవకు చెందినది)[2]

● హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: "నేను అశుద్ధావస్థలో ఉన్నప్పుడు (కూడా) నీరు త్రాగిన మీదట ఆ చెంబును దైవప్రవక్త (స)కు ఇచ్చేదాన్ని. నేను ఎంగిలి చేసిన చోటనే ఆయన(స) పెదాలు తగిలించి నీరు త్రాగేవారు. మాంసం తిన్నప్పుడు (కూడా) నేను తిన్న బొమికను దైవప్రవక్త (స)కు ఇచ్చే దానిని. నేను కొరికిన చోటి నుంచే ఆయన(స)కొరికి తినేవారు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[3]

## 80వ అంశం : దైవప్రవక్త (స) కుటీరంలో సవతుల సందడి

● హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) తన (వంతు ప్రకారం)ఒక సతీమణి ఇంట్లో ఉండగా మరో సతీమణి ఒక పాత్రలో భోజనం పంపించింది. ఇంటావిడ (అన్నం తెచ్చిన) సేవకుని చేతిని విదిలించేసరికి, ఆ పాత్ర క్రిందపడి తునాతునకలైపోయింది. దైవప్రవక్త (స) ఆ పాత్ర ముక్కల్ని ప్రోగుచేసి, ఆ అన్నాన్ని ఒక చోట చేర్చసాగారు. (అక్కడున్న వారిని ఉద్దేశించి) "మీ అమ్మగారికి (సవతిపై) కోపం వచ్చినట్టుంది" అన్నారు. ఆ తరువాత ఆయన(స) సేవకుణ్ణి ఆపి, పాత్రను పగలగొట్టిన ఆవిడ ఇంటి నుంచి కొత్తపాత్రను తెచ్చి యిచ్చారు. పగిలిపోయిన పాత్రను అక్కడే ఉండనిచ్చారు." దీనిని బుఖారీ పొందుపరిచారు.[4]

---

*1. జుబైదీచే సంకలనం చేయబడిన సంక్షిప్త సహీహ్ బుఖారీ- హ.నెం. 1868*
*2. సహీహ్ సునన్ ఇబ్నుమాజా లిల్ అల్బానీ, మొదటి భాగం-హ.నెం.1198*
*3. కితాబుల్ హైజ్ - బాబు జవాజ్ గుసులుల్ హైజ్ రాస్ జౌజహా*
*4. కితాబున్నికాహ్- బాబుల్ ఘీరతు*

**వివరణ:** దైవప్రవక్త (స) హజ్రత్ ఆయిషా(రఅ) వంతు వచ్చిన రోజున ఆమె ఇంట్లో ఉన్నారు. ఆ రోజే మరో సతీమణి అయిన హజ్రత్ జైనబ్ (రఅ) లేదా హజ్రత్ హఫ్సా(రఅ) ఏదో వంటకం పంపించారు. ఆ సమయంలో ఇంట్లో వంట చేస్తున్న హజ్రత్ ఆయిషా (రఅ) సవతి ప్రమేయాన్ని సహించలేకపోయారు.

● హజ్రత్ అనస్ (రజి) కథనం : ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా(రఅ) తనను 'యూద పుత్రిక' అని అంటున్నట్లు ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సఫియ్యా(రఅ)కు తెలిసింది. దాంతో ఆమె ఏడ్వసాగారు. దైవప్రవక్త (స) ఇంటికి వచ్చినప్పుడు కూడా ఆమె ఏడుస్తూ ఉండటంతో, "సఫియ్యా! ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగారాయన(స). దానికామె 'హఫ్సా నన్ను యూద పుత్రిక అని ఎద్దేవా చేస్తోంది' అన్నారు. 'అరె! నీవు ప్రవక్త పుత్రికవు (అంటే హజ్రత్ మూసా (అలైహి) కుమార్తెవి), నీ బాబాయి కూడా ప్రవక్తే (అంటే హారూన్-అలైహి), పైగా నీవు దైవప్రవక్త సతీమణివి (అంటే స్వయంగా ముహమ్మద్-స ధర్మపత్నివి). మరలాంటప్పుడు ఆవిడ (హఫ్సా)దేని ఆధారంగా నీ మీద గర్వం ప్రదర్శించగలదు?' అంటూ హజ్రత్ సఫియ్యా(రఅ)ను సముదాయించారు. తరువాత ఆయన(స) హఫ్సా (ర)నుద్దేశించి, 'హఫ్సా! అల్లాహ్‌కు భయపడు (ఇక మీదట ఎన్నడూ అలా చెప్పకు)" అని మందలించారు. (తిర్మిజీ 3894. సహీహ్ హదీసు)[1]

## 81వ అంశం : సతీమణుల కోమల స్వభావం దృష్ట్యా....

● హజ్రత్ అనస్ (రజి) కథనం : (ఒకానొక ప్రయాణంలో)దైవప్రవక్త (స) తన సతీమణుల దగ్గరకు వచ్చారు. ఆ సమయంలో ఒంటెలను తోలే వ్యక్తి ఒంటెల్ని వేగంగా పోనిస్తున్నాడు. అతని పేరు అంజిషా. దైవప్రవక్త (స) ఆ వ్యక్తినుద్దేశించి, "అంజిషా! నీ పాడుగాను. ఒంటెల్ని నెమ్మదిగా పోనివ్వవయ్యా. వీరు (వీటిపై స్వారీ అవుతున్నవారు) నీళ్ళ పాత్రలనుకుని పోనివ్వు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[2]

---

1. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ, మూడవ భాగం-హ.నెం. 3055
2. కితాబుల్ ఫజాయెల్ - బాబు రహ్మతన్ సల్లల్లాహు అలైహి వసల్లం

teluguislam.net



# తలాఖ్ రకాలు

**82వ అంశం : తలాఖ్‌లో మూడు రకాలున్నాయి.**

1. అత్తలాఖుల్ మస్నూన్ - మస్నూన్ తలాఖ్ (సంప్రదాయబద్ధమైన విడాకులు)
2. అత్తలాఖుల్ బిద్‌యీ - గైర్ మస్నూన్ తలాఖ్ (సంప్రదాయేతర విడాకులు)
3. అత్తలాఖుల్ బాతిల్ - బాతిల్ తలాఖ్ (అధర్మమైన విడాకులు)

## 1. మస్నూన్ తలాఖ్ (సంప్రదాయబద్ధమైన విడాకులు)

**83వ అంశం : బహిష్టుకాలం తొలగిన మీదట, పరిశుద్ధావస్థలో భార్యతో సమాగమం జరపకుండా ఒకసారి తలాఖ్ ఇవ్వాలి. ఆపైన ఇద్దత్ (గడువు)లో ఆమెను తన నివాసంలోనే ఉంచి పోషణా బాధ్యత వహించాలి- ఇది మస్నూన్ తలాఖ్.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: ఆయన దైవప్రవక్త (స) కాలంలో తన భార్యకు బహిష్టు స్థితిలో తలాఖ్ ఇచ్చారు. దీని గురించి హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) దైవప్రవక్త (స)ను విచారించగా ఆయన(స) ఇలా ఆదేశించారు: "తన భార్యను తిరిగి రప్పించు కోమని అబ్దుల్లాహ్‌కు చెప్పండి. ఆ తరువాతే ఆమెను వదలి పెట్టాలి- ఆమె బహిష్టు అయి పరిశుద్ధురాలయ్యేవరకు, మళ్లీ బహిష్టు అయి మళ్లీ పరిశుద్ధురాలయ్యేవరకు. ఆ తరువాత ఆమెను కోరుకుంటే (తన వివాహ బంధంలో) ఉంచుకోవచ్చు. లేదంటే విడాకు లివ్వవచ్చు. ఈ ఇద్దత్ (గడువు) లెక్క ప్రకారమే స్త్రీలకు విడాకులివ్వాలని అల్లాహ్ ఆదేశించాడు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

## 2. గైర్ మస్నూన్ తలాఖ్ (సంప్రదాయేతర విడాకులు)

**84వ అంశం : బహిష్టు స్థితిలో భార్యకు విడాకులివ్వటం సంప్రదాయ విరుద్ధం.**

**85వ అంశం : భార్యతో రతిక్రీడ జరిపిన పరిశుద్ధావస్థలోనే విడాకులివ్వటం సంప్రదాయ విరుద్ధం.**

వివరణ: 1) 91వ అంశం క్రింద ఉన్న హదీసును చూడండి.

2) సంప్రదాయ విరుద్ధమైన విడియాకు- అది సున్నత్‌కు అనుగుణంగా లేకపోయినప్పటికీ - విడాకులుగానే లెక్కించబడుతుంది. అయితే ఈ విధంగా ఇచ్చినవాడు పాపాత్ముడవుతాడు.

---

1. కితాబుత్తలాఖ్

# 3. బాతిల్ తలాఖ్ (అధర్మమైన విడాకులు)

## 86వ అంశం : నికాహ్‌కు ముందే తలాఖ్ ఇవ్వటం అధర్మం

హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు. "నికాహ్‌కు ముందు తలాఖ్ లేదు." (ఇబ్నుమాజా 2049.సహీహ్ హదీసు)[1]

## 87వ అంశం : బలవంతంగా ఇప్పించిన తలాఖ్ ఒక మిథ్య

వివరణ: 3వ అంశం క్రిందనున్న హదీసు (2043 ఇబ్నుమాజాను) చూడండి.

## 88వ అంశం : పసివాని, పిచ్చివాని, స్పృహలో లేనివాని తలాఖ్ చెల్లదు

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) ఈ విధంగా ప్రవచించారు: "ముగ్గురు మనుషులు షరీయత్ ఆదేశాలకు నిబద్ధులు కారు. 1) పసివాడు- అతను ప్రాజ్ఞతకు చేరనంతవరకు. 2) నిద్రించేవాడు -అతనికి మెలకువ రానంతవరకు, 3) పిచ్చివాడు - అతనికి పిచ్చి కుదరనంతవరకు." (ఇబ్నుమాజా 2041. సహీహ్ హదీసు)[2]

## 89వ అంశం : మనసులో అనుకున్నంత మాత్రాన తలాఖ్ అవదు- నోటితో చెప్పటం అవశ్యం

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్(స) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ నా అనుచర సమాజాన్ని వారి అంతర్యాలలో జనించే ప్రేరణలను ఆచరణలో పెట్టకుండా ఉన్నంతవరకూ క్షమించాడు." (ఇబ్నుమాజ 2040.సహీహ్ హదీసు)[3]

## 90వ అంశం : వివాహ బంధంలో ఇమిడి ఉన్న భార్యకు మాత్రమే విడాకులు వర్తిస్తాయి. ఇతరత్రా స్త్రీలకు వర్తించవు.

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రజి) తన తండ్రి నుండి, ఆయన గారు తన తాతగారి నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరయితే (ఏ స్త్రీ)కి యజమాని కాడో అతను ఆమెకు విడాకులివ్వలేడు." (ఇబ్నుమాజా 2047.హసన్)[4]

---

1. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ, మొదటి భాగం- హ.నెం.1668
2. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ, మొదటిభాగం-హ.నెం. 1660
3. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ, మొదటిభాగం - హ.నెం.1659
4. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ, మొదటిభాగం-హ.నెం.1666

teluguislam.net



# తలాఖ్ (ఇచ్చే) పద్ధతి

**91వ అంశం : బహిష్టు స్థితి నుంచి పరిశుద్ధతను పొందిన మీదట ఒక తలాఖ్ (మాత్రమే) ఇవ్వాలి.**

**92వ అంశం : తలాఖ్ ఇవ్వదలచిన పరిశుద్ధ స్థితిలో భార్యతో సమాగమం జరపకూడదు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) అంటున్నారు: "తలాఖె మస్నూన (సంప్రదాయ బద్ధమైన విడాకులు) ఇచ్చే విధానమేమిటంటే, మనిషి పరిశుద్ధావస్థలో (భార్యతో) రతిక్రీడలో పాల్గొనకూడదు." (ఇబ్నుమాజ 2020.సహీహ్ హదీసు)[1]

**93వ అంశం : తలాఖె రజ్‌యీ ఇచ్చినప్పుడు- ఇద్దత్‌లో భార్యను తన నివాస గృహంలోనే ఉంచాలి.**

**94వ అంశం : తలాఖె రజ్‌యీ ఇచ్చిన పక్షంలో- ఇద్దత్ కాలంలో భార్య పోషణా భారం భర్తపైనే ఉంటుంది.**

వివరణ: 138, 139 అంశాల క్రిందనున్న ఖుర్‌ఆన్ వచనాన్ని చూడండి.

**95వ అంశం : ఒకే సమయంలో ఒక తలాఖ్ మాత్రమే ఇవ్వాలి.**

**96వ అంశం : తలాఖ్ గడువు (మూడు రుతువుల కాలం) ముగియగానే భార్యాభర్తల మధ్య శాశ్వత వేర్పాటు జరిగిపోతుంది.**

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) తెలిపారు: సంప్రదాయ బద్ధమైన విడాకులు ఏవంటే; భర్త తన భార్యకు ప్రతి పరిశుద్ధావస్థలో ఒక తలాఖ్ (విడాకు) మాత్రమే ఇవ్వాలి. ఆ స్త్రీ మూడవసారి పరిశుద్ధతను పొందిన తరువాత ఆమెకు (మూడవ) తలాఖ్ ఇవ్వాలి. ఆ తరువాత ఆమె బహిష్టు కాగానే ఆమె గడువు (ఇద్దత్ కాలం) సమాప్తమవుతుంది.

(ఇబ్నుమాజ 2021, సహీహ్).[2]

---

*1. సహీహ్ సుననె ఇబ్నుమాజ లిల్ అల్‌బానీ, మొదటిభాగం-హ.నెం.1640*

*2. సహీహ్ సుననె ఇబ్నుమాజ లిల్ అల్‌బానీ, మొదటిభాగం- హ.నెం.1642*

# విడాకుల నేపథ్యంలో సమ్మతమైన విషయాలు

## 97వ అంశం : నికాహ్ తరువాత సమాగమం జరపక ముందే విడాకులివ్వవచ్చు.

"ఒకవేళ మీరు స్త్రీలను తాకకుండా, వారి మహర్‌ను నిర్ధారించకుండానే వారికి విడాకులిస్తే అది కూడా మీకు పాపం కాదు. అయితే వారికి ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చండి. స్థితిమంతుడు తన స్థితికి తగినట్లుగా, పేదవాడు తన స్థోమతకు తగినట్లుగా ధర్మం ప్రకారం ప్రయోజనం చేకూర్చాలి. ఉత్తమంగా వ్యవహరించేవారికి ఇది విధిగా నిర్ణయించబడింది."

(అల్ బఖర - 236)

## 98వ అంశం : షరతులతో కూడిన తలాఖ్ గానీ, అనిశ్చితితో కూడిన తలాఖ్ గానీ ఇవ్వవచ్చు

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ముస్లింలు తమ షరతులకు కట్టుబడి ఉండాలి."(అబూదావూద్-3594 హసన్)[1]

వివరణ: ఉదాహరణకు: భర్త తన భార్యతో 'నువ్వు గనక గడప దాటావంటే నీకు తలాఖ్' అని అన్నాడనుకోండి- అట్టి తలాఖ్ షరతులతో కూడిన తలాఖ్ అవుతుంది. భార్య అతని మాటను లక్ష్యపెట్టకుండా ప్రవర్తిస్తే (అంటే అతను విధించిన షరతును జవదాటితే) విడాకులైపోయినట్లే.

## 99వ అంశం : విడాకుల విషయంలో భార్యకు నిర్ణయాధికారం ఇవ్వటం సమ్మతమే.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు: "దైవప్రవక్త (స) మాకు నిర్ణయాధికారం ఇచ్చారు. మేము మాత్రం (విడాకులకు ప్రతిగా) దైవప్రవక్త (స)నే ఇష్టపడ్డాము. అందువల్ల ఆయన(స), తన మాటలను తలాఖ్‌గా లెక్కించలేదు." (అబూదావూద్-2203.సహీహ్)[2]

వివరణ: నువ్వు నాతో కాపురం చెయ్యదలిస్తే చెయ్యవచ్చు లేదా విడిపోవచ్చు అని భర్త తన భార్యతో అంటే ఆమెకు నిర్ణయాధికారం ఇచ్చినట్లవుతుంది. ఆమె గనక భర్తతోనే ఉండదలిస్తే విడాకులవవు. ఒకవేళ ఆమె విడిపోదలిస్తే మాత్రం విడాకులైపోతాయి.

## 100వ అంశం : భార్య గర్భవతిగా ఉన్నప్పుడు విడాకులివ్వటం సమ్మతమే

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ఈయన తన భార్యకు బహిష్టు స్థితిలో విడాకులిచ్చారు. హజ్రత్ ఉమర్(రజి) ఈ సంగతిని దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించగా ఆయన(స) ఇలా ఉపదేశించారు: "తన భార్యను తిరిగి రప్పించుకోమని అబ్దుల్లాహ్‌కు చెప్పండి. ఆ తరువాత ఆమెకు విడాకులివ్వగోరితే ఇవ్వవచ్చు - ఆమె పరిశుద్ధ స్థితిలో ఉన్నాసరే, గర్భవతిగా ఉన్నాసరే."[3] (అబూదావూద్ 2181, ఇబ్నుమాజ 2023. సహీహ్ హదీసు)

---

*1. సహీహ్ సుననె అబీ దావూద్ లిల్ అల్‌బానీ, రెండవ భాగం- హ.నెం.3023*

*2. సహీహ్ సుననె అబీ దావూద్ లిల్ అల్‌బానీ, రెండవ భాగం- హ.నెం.1929*

*3. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ, మొదటి భాగం - హ.నెం.1643*

teluguislam.net



# ఏక కాలంలో మూడు విడాకులివ్వటం

**101వ అంశం : ఒకేసారి మూడు విడాకులివ్వటం సున్నత్‌కు విరుద్ధం**

**102వ అంశం : ఒకేసారి మూడు విడాకులిచ్చినా అది ఒకే విడాకు అవుతుంది.**

**103వ అంశం : హజ్రత్ ఉమర్ (రజి) తన పరిపాలనా కాలంలో ఒకేసారి మూడు విడాకులిచ్చేవారికి శిక్షగా 'మూడు విడాకులు' ప్రవేశపెట్టారు.**

عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللهُ عَنْهُمَا قَالَ : كَانَ الطَّلَاقُ عَلَى عَهْدِ رَسُوْلِ اللهِ ﷺ وَ أَبِيْ بَكْرٍ رَضِيَ اللهُ عَنْهُ وَ سَنَتَيْنِ مِنْ خِلَافَةِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُ طَلَاقُ الثَّلَاثِ وَاحِدَةٌ ، وَ قَالَ عُمَرُ بْنُ الْخَطَّابِ رَضِيَ اللهُ عَنْهُ : أَنَّ النَّاسَ اسْتَعْجَلُوْا فِيْ أَمْرٍ كَانَتْ لَهُمْ فِيْهِ أَنَاءَةٌ فَلَوْ أَمْضَيْنَاهُ عَلَيْهِمْ فَأَمْضَاهُ عَلَيْهِمْ . رَوَاهُ مُسْلِمٌ (١)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త(స) కాలంలోనూ, హజ్రత్ అబూబక్ర్ (రజి) ఖిలాఫత్‌లోనూ, హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్‌లోని మొదటి రెండు సంవత్సరాల కాలంలోనూ ఏకకాలంలో ఇవ్వబడిన మూడు విడాకులు 'ఒకే విడాకు'గా పరిగణించబడేది. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఇలా అన్నారు: "ఏ విషయంలో ప్రజలకు (బాగా ఆలోచించుకునే) గడువు ఇవ్వబడిందో దాని గురించి ప్రజలు తొందర పడుతున్నారు (వారి దూకుడు చర్య సున్నత్‌కు విరుద్ధమైనది). కాబట్టి ఇక మీదట మేము (శిక్షగా) ఏక కాలంలో ఇవ్వబడిన మూడు తలాఖ్‌లను 'మూడు'గానే విధించబోతున్నాము.' అంతే (ఆ తరువాత) ఆయన తన నిర్ణయాన్ని అమలు పరిచారు. ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[1]

---

*2. కితాబుత్తలాఖ్ - బాబుత్తలాఖుస్సులాస*

# ఖులా ఆదేశాలు

**104వ అంశం :** తన భర్తను ఇష్టపడని భార్య కొంత నష్టపరిహారం ఇచ్చి భర్త నుండి విడిపోగలదు. షరీయతులో దీనిని 'ఖులా' అంటారు.

**105వ అంశం :** 'ఖులా' పొందడానికి క్రింది షరతులు ఉండాలి.

1. తాను తన భర్తను ఇష్టపడటం లేదన్న విషయాన్ని భార్య వ్యక్తపరచాలి.
2. ఆ అయిష్టత తీవ్రమై, ఒకవేళ వారిద్దరూ విడిపోని పక్షంలో దేవుడు నిర్ధారించిన హద్దులను ఉల్లంఘించే ప్రమాదం కనబడాలి.

**106వ అంశం :** 'ఖులా' వ్యవహారం భార్యాభర్తల పరస్పర అవగాహనతో ఓ కొలిక్కి వస్తే మంచిది. లేదంటే ఇరు కుటుంబాల పెద్దల సంప్రతింపులతో పరిష్కారం కావాలి. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే స్త్రీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు.

**107వ అంశం :** 'ఖులా' పొందినందుకు స్త్రీ నుండి తీసుకోబడే నష్టపరిహారం ఇంచుమించు 'మహర్'కు సమానంగా ఉండాలి.

**108వ అంశం :** 'ఖులా'లో కేవలం ఒక్క విడియాకుతోనే భార్యాభర్తల బంధం పూర్తిగా తెగిపోతుంది. ఒకవేళ భర్త 'ఖులా'ను ఆమోదించకపోతే ఆ వివాహ బంధాన్ని రద్దు పరుస్తున్నట్లు న్యాయస్థానం డిక్రీ జారీ చేస్తుంది.

"ఈ విడాకులు రెండుసార్లే. ఆ తరువాత సక్రమంగా (ఆమెను) ఆపుకోవాలి. లేదంటే ఉత్తమరీతిలో వదలిపెట్టాలి. మీరు వారికి ఇంతకు ముందు ఇచ్చి ఉన్న వాటిలో నుంచి దేన్నయినా తిరిగి తీసుకోవటం ధర్మసమ్మతం కాదు. ఆఁ ఒకవేళ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమన్న భయం వారిరువురికీ ఉంటే అది వేరే విషయం. అందువల్ల దంపతులిద్దరూ అల్లాహ్ ఏర్పరచిన హద్దులకు కట్టుబడి ఉండలేమన్న భయం వారికి కలిగి, అదే సమయంలో స్త్రీ తన భర్తకు కొంత నష్టపరిహారం ఇచ్చి వేర్పడదలిస్తే- అట్టి పరిస్థితిలో ఇరువురిపై ఎలాంటి దోషం లేదు. ఇవి అల్లాహ్ నిర్ధారించిన హద్దులు. (జాగ్రత్త!) వాటిని దాటకూడదు. ఎవరు అల్లాహ్ నిర్ధారించిన హద్దులను మీరిపోతారో వారే దుర్మార్గులు." (అల్ బఖర-229)

teluguislam.net



● హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : హ్రజత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) భార్య దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, 'ఓ దైవప్రవక్తా (స)! నేను సాబిత్ బిన్ ఖైస్ ధార్మికతలోగానీ, ఆయనగారి గుణగణాలలోగానీ ఎలాంటి లోపాన్నీ ఎంచలేను. కాకపోతే ముస్లింగా భర్తకు కృతఘ్నురాలై పాపాన్ని మూటగట్టుకోవటం నాకు ఇష్టం లేదు' అని విన్నవించుకుంది. "మరయితే సాబిత్ (మహర్‌గా) ఇచ్చిన తోటను వాపసు చేస్తావా?" అని దైవప్రవక్త (స) దర్యాప్తు చేయగా 'చేస్తాన'ని ఆమె సమాధానమిచ్చింది. అప్పుడు దైవప్రవక్త(స) సాబిత్ బిన్ ఖైస్‌కు "నువ్వు నీ తోటను తీసేసుకుని ఆమెకు విడాకులిచ్చేయ్" అని ఆదేశించారు. దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

## 109వ అంశం : ఖులా పొందిన మహిళ ఇద్దత్ (గడువు) ఒక రుతువు

హ్రజత్ రబీ బిన్తె మవూజ్ అఫ్రా (రఅ) కథనం : ఈమెగారు దైవప్రవక్త (స)కాలంలో తన భర్త నుండి 'ఖులా' పొందినప్పుడు దైవప్రవక్త(స) ఈమెను ఇలా ఆజ్ఞాపించారు: "ఆమె ఒక రుతుకాలం వరకు ఇద్దత్ పాటించాలి." (తిర్మిజీ 1185. సహీహ్)[2]

వివరణ: ఖులా ఇచ్చిన తరువాత పాటించే ఇద్దత్ (గడువు)లో భర్తకు రాజీపడే అవకాశం మిగిలి ఉండదు. అయితే ఇద్దత్ అనంతరం ఆ స్త్రీ పురుషులిరువురూ పరస్పర అంగీకారంతో వివాహం చేసుకోదలిస్తే చేసుకోవచ్చు (తఫ్‌హీముల్ ఖుర్ఆన్-సంపుటి:1, పేజీ 176)

## 110వ అంశం : అకారణంగా ఖులా పొందే మహిళలు కపటులు

వివరణ: 5వ అంశం క్రింద ఉన్న హదీసును చూడండి.

## 111వ అంశం : పోషించలేని భర్త నుండి భార్య ఖులా పొందగలదు

హ్రజత్ సయీద్ బిన్ ముసయ్యబ్ (రహ్మలై) చెప్పేవారు: "భార్యకు పోషణా ఖర్చులు ఇచ్చేందుకు భర్త వద్ద ఏమీ లేనప్పుడు వారిద్దరి మధ్య వేర్పాటు చేయటం మంచిది." దీనిని మాలిక్ పొందుపరిచారు.[3]

## 112వ అంశం : భర్తలో మగసిరి లోపిస్తే, చికిత్స నిమిత్తం ఏడాది కాలం పాటు వ్యవధి ఇచ్చిన మీదట, భార్య తాను కోరితే ఖులా పొందవచ్చు

హ్రజత్ సయీద్ బిన్ ముసయ్యబ్ (రహ్మలై) తెలిపారు: "ఏ వ్యక్తి అయినా ఒక స్త్రీని వివాహమాడి, ఆమెతో రతిలో పాల్గొనలేకపోతే ఒక సంవత్సర కాలం వ్యవధి (చికిత్స నిమిత్తం) ఇవ్వబడుతుంది. ఈలోగా అతను లైంగిక సామర్థ్యం పొందితే సరి. లేకపోతే ఆ దంపతులను విడదీయాలి." దీనిని మాలిక్ పొందుపరిచారు.[4]

---

*1. కితాబుల్ ఖులా - బాబుల్ ఖులా*

*2. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ- మొదటిభాగం : హ.నెం.945*

*3. ముఅత్తా ఇమామ్ మాలిక్- బాబు జామిఉత్తలాఖ్ పేజి నం. 217, ముసన్నఫ్ అబ్దుర్రజ్జాక్ పేజి.నం.96*

*4. ముఅత్తా ఇమామ్ మాలిక్ - బాబు అజ్‌లుల్లజీ లా యమస్సు అమ్‌రాతిహి-1069, పేజి. నం. 208*

# లియాన్ (శాప ప్రమాణం) ఆదేశాలు

**113**వ అంశం : భర్తకు తన భార్య వ్యభిచారానికి పాల్పడిందన్న గట్టి నమ్మకం కలిగినప్పుడు ఆమె నుండి విడిపోయే పద్ధతేమిటంటే, అతను షరీయత్ న్యాయస్థానానికి వెళ్ళి స్వయంగా సాక్ష్యమివ్వాలి: "నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి, ఈవిడ ఒక వ్యభిచారిణి అని సాక్ష్యమిస్తున్నాను" అని నాలుగుసార్లు పలకాలి. ఐదవసారి "నేను గాని అబద్ధం చెబితే నాపై అల్లాహ్ అభిశాపం పడుగాక!" అనాలి. ఒకవేళ ఆ స్త్రీ గనక తన నేరాన్ని ఒప్పుకుంటే షరీయత్ చట్టం ప్రకారం ఆమెకు శిలా శిక్ష విధించమని కోర్టు ఆదేశిస్తుంది. ఒకవేళ ఆ స్త్రీ ఈ ఆరోపణను నిరాకరించినట్లయితే "ఈ మగవాడు అబద్ధం చెబుతున్నాడని దైవసాక్షిగా చెబుతున్నాను" అని నాలుగుసార్లు చెప్పాలి. ఐదవసారి "ఈ మగవాడు గనక తన ఆరోపణలో సత్యవంతుడైనట్లయితే నాపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుగాక!" అనాలి. ఆ తరువాత వారిద్దరి మధ్య కోర్టు శాశ్వతంగా వేర్పాటు కల్పిస్తుంది. దీనినే షరీయతులో 'లియాన్' అంటారు.

"ఎవరయినా తమ భార్యలపై (అక్రమ సంబంధపు) నింద మోపి, దానికి స్వయంగా తాము తప్ప మరెవరూ సాక్షులు లేనిపక్షంలో వారిలో ప్రతి ఒక్కరూ నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, తాను చెప్పేది నిజం అని పలకాలి (అదే వారి సాక్ష్యం). అయిదవసారి- 'ఒకవేళ తాను చెప్పేది అబద్ధమైతే తనపై అల్లాహ్ శాపం పడుగాక!' అని చెప్పాలి. ఇక ఆ స్త్రీ శిక్ష నుంచి బయటపడే మార్గం ఏమిటంటే, ఆమె నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, 'తన భర్త చెప్పేది అబద్ధం' అని పలకాలి. (అన్ నూర్:6-9)

**114**వ అంశం : లియాన్ (శాప ప్రమాణం చేసిన) తరువాత భర్త చేసిన నిందారోపణ వీగిపోతుంది, భార్యకు విధించవలసిన శిక్ష కూడా రద్దవుతుంది

**115**వ అంశం : శాప ప్రమాణం షరీయత్ కోర్టు ముందరే జరగాలి.

**116**వ అంశం : శాప ప్రమాణానికి ముందు న్యాయమూర్తి ఆ దంపతులిద్దరికీ దైవభక్తి, దైవభీతి గురించి ఉపదేశించి నేరం చేసిన వారు నేరం ఒప్పుకోమని చెప్పాలి. ఇరువురిలో ఏ ఒక్కరు కూడా నేరాన్ని ఒప్పుకోకపోతేనే శాప ప్రమాణం (లియాన్) చేయించాలి.

teluguislam.net



## 117వ అంశం : సాక్ష్యాధారం లేకుండా న్యాయమూర్తి నేరస్థునికి శిక్ష విధించలేడు

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం: హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, తన భార్య షరీక్ బిన్ సహ్మాతో అక్రమ సంబంధం పెట్టుకుందని నిందవేశారు. దానికి దైవప్రవక్త(స), "సాక్షులను తీసుకురా. లేకుంటే నీ వీపుపై (కొరడా) దెబ్బలు పడతాయి" అని చెప్పారు. అప్పుడు హిలాల్ బిన్ ఉమయ్యా(రజి), 'ఓ దైవప్రవక్తా(స)! మాలో ఎవరి భార్య అయినా పరాయి మగవానితో కులుకుతుండగా కంటపడినప్పుడు అతను సాక్షుల్ని వెతుక్కోటానికి వెళ్ళిపోవాల్సిందేనా?' అని ప్రశ్నించారు. అయినప్పటికీ దైవప్రవక్త(స) రెండవసారి కూడా "సాక్షులను తీసుకురా. లేకుంటే నీ వీపుపై దెబ్బలు పడతాయి" అనే చెప్పారు. 'తమరిని సత్యసమేతంగా ప్రభవింపజేసిన వాని సాక్షిగా చెబుతున్నాను! నేను సత్యవంతుణ్ణి. అల్లాహ్ నా వీపుపై (కొరడా) దెబ్బలు పడకుండా తప్పనిసరిగా తన వచనాలను అవతరింపజేస్తాడ'ని హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) కరాకండీగా చెప్పారు. (అదే జరిగింది కూడా) హజ్రత్ జిబ్రయీల్ (అలైహి) దైవ వచనాలను తీసుకుని అవతరించారు. "ఎవరయినా తమ భార్యలపై నింద మోపి..." నుండి "ఒకవేళ అతను చెప్పేది నిజమే అయితే...."వరకు (నూర్:6-9). ఈ వచనాల అవతరణ తరువాత హజ్రత్ హిలాల్ (రజి) వచ్చి శాప ప్రమాణం చేశారు. దైవప్రవక్త(స) (ఆ దంపతులిద్దరినీ ఉద్దేశించి) ఇలా హితోపదేశం చేశారు: "మీరిరువురిలో ఎవరో ఒకరు అబద్ధం చెబుతున్నారన్న విషయం అల్లాహ్‌కు తెలుసు. కాబట్టి మీరిద్దరిలో ఎవరో ఒకరు (అబద్ధం చెబుతున్నవారు) పశ్చాత్తాపం చెందుతారా?" ఏ ఒక్కరూ పశ్చాత్తాపం ప్రకటించలేదు. పైగా ఆ స్త్రీ (శాపప్రమాణం) చేయటానికి లేచి నిలబడింది. (తన భర్త చెప్పేది అబద్ధమని) ఆమె నాలుగుసార్లు సాక్ష్యమిచ్చింది. ఐదవసారి కూడా సాక్ష్యమివ్వబోతూ ఉండగా, జనులు ఆమెను వారించారు. ఎందుకంటే ఐదవ సాక్ష్యం (దైవాగ్రహాన్ని) తప్పనిసరి చేస్తుందని వారు భావించారు (అందుకే బాగా ఆలోచించుకోవమ్మా! అని సూచించారు). హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) ఇలా అంటున్నారు: ఆ స్త్రీ ఆగిపోయింది. ఊగిసలాడసాగింది. ఆమె (తన తప్పును) అంగీకరిస్తుందని మేమనుకున్నాము. కాని ఆమె ఇలా అన్నది: 'నేను నా జాతి వారిని శాశ్వతంగా తలవంపుకు గురిచెయ్యదలచలేదు.' అంతే! ఆమె ఐదవసారి కూడా సాక్ష్యమిచ్చేసింది (అంటే ఈ మగవాడు తన నిందారోపణలో సత్యవంతుడే అయితే అల్లాహ్ ఆగ్రహం నాపై విరుచుకుపడుగాక! అని చెప్పింది). మహాప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఆమెను కనిపెడుతూ ఉండండి. ఆమెకు పుట్టే శిశువు బూడిద రంగు కన్నులు గలది, మందమైన వీపు గలది, లావుపాటి పిక్కలు గలది అయితే అది 'షరీక్' సంతానమై ఉంటుంది." జరిగింది కూడా అదే. (పిల్లవాడు పుట్టిన తరువాత) మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు: 'ఒకవేళ దైవగ్రంథంలోని శాపప్రమాణ చట్టం లేకుండా ఉంటే నేను (ఆ స్త్రీపై) హద్దు విధించేవాణ్ణి." దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

## 118వ అంశం : శాప ప్రమాణం తరువాత పుట్టిన శిశువు తల్లికే ఇవ్వబడు తుంది.

---

*1. మిష్కాతుల్ మసాబీహ్ లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.3307*

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: "దైవప్రవక్త (స) ఒక పురుషుడు- ఒక స్త్రీ మధ్య లియాన్ (శాప ప్రమాణం) జరిపించారు. 'ఈవిడకు పుట్టబోయే బిడ్డ నా బిడ్డ కాదు' అని ఆ పురుషుడు చెప్పసాగాడు. అందువల్ల దైవప్రవక్త (స) వారిద్దరినీ వేరు పరచి, పుట్టబోయే శిశువును ఆ స్త్రీ వంశంతోనే ముడిపెట్టారు." దీనిని బుఖారీ పొందుపరిచారు.[1]

**119వ అంశం : శాప ప్రమాణం ద్వారా విడిపోయే దంపతులు ఇక మీదట ఎట్టి పరిస్థితిలోనూ (పరస్పరం) వివాహం చేసుకోలేరు**

హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) తెలిపారు: "(ఉవైమిర్ మరియు అతని భార్య శాపప్రమాణం చేసినప్పుడు) నేను దైవప్రవక్త(స) దగ్గరే ఉన్నాను. అప్పటి నుంచీ ఒండొకరి మీద ఆరోపించుకుని శాప ప్రమాణం చేసే భార్యాభర్తల విషయంలో ఒక సంప్రదాయం నెలకొన్నది- అదేమిటంటే ఇక మీదట వారెన్నడూ నికాహ్ చేసుకోలేరు."

(అబూదావూద్ 2250 సహీహ్).[2]

**120వ అంశం : శాప ప్రమాణం తరువాత తల్లికి అప్పగించబడిన బిడ్డ తల్లికి వారసుడవుతాడు. అతని వారసత్వ సొమ్ముకు తల్లి వారసురాలవుతుంది.**

**121వ అంశం : శాప ప్రమాణం తరువాత ఆ పురుషుణ్ణి గానీ, స్త్రీనిగానీ వ్యభిచారి(ణి) అని నిందించిన వారు శిక్షార్హు లవుతారు.**

**122వ అంశం : శాప ప్రమాణం తరువాత ఆ పురుషునికి గానీ, స్త్రీకి గానీ కలిగిన సంతానాన్ని 'అక్రమ సంతానం' అని నిందించేవారు కూడా శిక్షార్హు లే.**

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి, ఆయనేమో తన తాత గారి (ర.అన్హుమ్) నుండి సంగ్రహించిన దాని ప్రకారం దైవప్రవక్త (స) శాప ప్రమాణం చేసినవారి గురించి ఏమని నిర్ణయించారంటే; "తల్లి బిడ్డకు, బిడ్డ తల్లికి వారసులవుతారు. ఒకవేళ ఎవరయినా ఆ స్త్రీని 'వ్యభిచారిణి' అనంటే వారికి ఎనభై కొరడా దెబ్బలు వేయబడతాయి. ఒకవేళ ఆ బిడ్డను ఎవరయినా 'అక్రమ సంతానం' అని చెబితే వారికి కూడా ఎనభై కొరడా దెబ్బలు పడతాయి." దీనిని అహ్మద్ పొందుపరిచారు.[3]

**123వ అంశం : దంపతుల మధ్య 'శాప ప్రమాణం' జరగనంత వరకూ శిశువు తండ్రిదిగానే పరిగణించబడుతుంది**

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "భార్యగల వాడికే పిల్లవాడు చెందుతాడు. వ్యభిచారికి శిలా శిక్షే."

(నసాయి 3482. సహీహ్, అబూదావూద్ 2273, బుఖారీ 6750, ముస్లిం 1458).[4]

---

*1. కితాబుత్తలాఖ్ - బాబు యల్ హఖుల్ వలదు బిల్ మలాయనతు*

*2. సహీహ్ సుననె అబీ దావూద్ లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.1969*

*3. నైలుల్ అవ్‌తార్- కితాబుల్లియాన్, బాబు మాజాఅ ఫీఖజపుల్ మలాఅన*

*1. సహీహ్ సుననె నసాయి లిల్ అల్‌బానీ-రెండవ భాగం, హ.నెం.3258*

teluguislam.net



# జిహార్ ఆదేశాలు

**124వ అంశం : భార్యను తల్లి అనో, చెల్లి అనో చెప్పి తన కొరకు నిషేధించు కోవటం తగదు. షరీఅత్‌లో ఈ చేష్టను 'జిహార్' అంటారు.**

**125వ అంశం : 'జిహార్'కు పాల్పడినంతమాత్రాన ఇల్లాలు శాశ్వతంగా నిషిద్ధం (హరామ్) అవదు. కాకపోతే ఆమె వద్దకు పోయే ముందు పరిహారం (కఫ్ఫారా) చెల్లించాలి.**

**126వ అంశం : 'జిహార్'కు పాల్పడినవారు పరిహారంగా ఒక బానిసను విడుదల చేయాలి లేదా నిరంతరం రెండు నెలలు ఉపవాసం పాటించాలి. లేదంటే అరవైమంది నిరుపేదలకు అన్నం పెట్టాలి.**

"మీలో ఎవరయినాసరే తమ భార్యలపై 'జిహార్'ను ప్రయోగించినంత మాత్రాన (నీవు నా తల్లి వీపులాంటిదానవు అని నోరుజారినంత మాత్రాన) వారు వారికి తల్లులైపోరు. వారిని కన్నవారు మాత్రమే వాస్తవానికి వారికి తల్లులు. నిజానికి ఈ విధంగా పలికేవారు అసహ్యమైన మాటను, అబద్ధాన్ని పలికారు. నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడు, క్షమాభిక్ష పెట్టేవాడూను. ఎవరైనా తమ భార్యలపై 'జిహార్'ను ప్రయోగించి, తమ నోటిద్వారా జారి పోయిన(తప్పుడు) మాటను ఉపసంహరించుకుంటే వారు ఒకరినొకరు తాకకముందే అతను ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించాలి. దీనిద్వారా మీకు గుణపాఠం నేర్పబడుతున్నది. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు. ఈ స్థోమతలేనివాడు, భార్యాభర్తలు పరస్పరం ముట్టు కోకముందే అతను రెండు మాసాలపాటు ఎడతెగకుండా ఉపవాసాలు పాటించాలి. ఈపాటి శక్తి కూడా లేనివాడు 60మంది అగత్యపరులకు అన్నం పెట్టాలి. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై మీ పరిపూర్ణ విశ్వాసం రూఢీ కావటానికే ఇది మీపై విధింపబడింది. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. అవిశ్వాసులకు బాధాకరమైన శిక్ష ఖాయం." (అల్ ముజాదలా:2-4)

**127వ అంశం : జిహార్‌ను ప్రయోగించినవాడు పరిహారం చెల్లించకముందే తన భార్యతో సమాగమం జరిపితే పశ్చాత్తాపం ప్రకటించాలి. మళ్లీ పరిహారం చెల్లించనవసరం లేదు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఒక వ్యక్తి మహాప్రవక్త ముహమ్మద్(స) దగ్గరకు వచ్చాడు- అతను తన భార్యపై 'జిహార్' అస్త్రం ప్రయోగించాడు. కాని పరిహారం (కఫ్ఫారా) చెల్లించక ముందే భార్యతో రమించాడు. 'ఓ దైవప్రవక్తా(స)! నేను నా భార్యపై జిహార్‌ను ప్రయోగించాను. కాని పరిహారం ఇవ్వకముందే ఆమెతో సమాగమం జరిపాన'ని అతను తన గోడు వినిపించుకున్నాడు. దానికి ఆయన(స), "అల్లాహ్ నీపై దయదలచుగాక! ఇంతకీ ఏ విషయం నిన్ను దీనికి పురికొల్పిందో చెప్పావు కాదు" అని అడిగితే, 'నేను వెన్నెలలో ఆమె పాద భూషణమును చూశాను. (అంతే. నన్ను నేను నిగ్రహించుకోలేక పోయాను) అన్నాడతను. దానికాయన(స), "సరేలే. పరిహారం చెల్లించనంతవరకూ ఇక ఆమె వద్దకు పోకు" అని ఉపదేశించారు. (తిర్మిజీ-1199, ఇబ్నెమాజా-2065, అబూదావూద్-2221 హసన్).

# ఈలా ఆదేశాలు

**128వ అంశం : నాలుగు మాసాల వరకూ భార్యకు మందలింపుగా ఆమెతో లైంగిక సంబంధాన్ని త్రెంచుకునేందుకు అనుమతి ఉంది. దీనినే షరీయతులో 'ఈలా' అంటారు.**

**129వ అంశం : 'ఈలా' గరిష్ట గడువు (నాల్గు మాసాలు) గడిచాక భర్త తన ఈలాను ఉపసంహరించుకోవాలి లేదా విడాకులు ఇవ్వాలి.**

"ఎవరయితే తమ భార్యలతో సంబంధం పెట్టుకోబోమని ఒట్టేసుకుంటారో వారి కొరకు నాలుగు మాసాల గడువు ఉంది. మరి వారు గనక (ఈ లోగా) మరలివస్తే అల్లాహ్ కూడా క్షమించేవాడు, జాలి చూపేవాడు. ఒకవేళ వారు విడాకులు ఇవ్వాలనే నిశ్చయించుకుంటే, నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ వినేవాడు, అంతా తెలిసినవాడు." (అల్ బఖర- 226,227)

వివరణ: ఏదేని పరమార్ధంతోనో, అవసరం మేరకో పరస్పర అంగీకారంతో భర్త తన భార్యతో నాలుగు మాసాలకన్నా ఎక్కువకాలం కూడా వేరుగా ఉండటం సమ్మతమే, సరైనదే.

**130వ అంశం : వేధించే ఉద్దేశంతో 'ఈలా' చేయటం తగదు**

హజ్రత్ అబూ సర్మా(రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఎవడయినా వేరొకరికి కీడు కలిగిస్తే అల్లాహ్ అతనికి కీడు కలిగిస్తాడు. ఎవడయినా వేరొకరిని ఇబ్బంది పెడితే అల్లాహ్ అతన్ని ఇబ్బందికి గురిచేస్తాడు."

(ఇబ్నుమాజ-2342. ఈ హదీసు హసన్ కోవకు చెందినది.)[1]

**131వ అంశం : 'ఈలా' గరిష్ట గడువు (4 మాసాలు) ముగిసిన మీదట కూడా భర్త భార్యతో లైంగిక సంబంధం ఏర్పరచుకోకపోతే, ఆమెకు విడాకులు కూడా ఇవ్వకపోతే ఆ స్త్రీ షరీయత్ కోర్టును ఆశ్రయించగలదు. కోర్టు జోక్యం చేసుకుని ఆమెను తిరిగి రప్పించుకోవటమో లేదా విడాకులివ్వటమో చేయమని ఆ మగవాణ్ణి శాసిస్తుంది.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: "ఈలా గడువు- నాలుగు మాసాలు- ముగిసిన తరువాత భార్యకు విడాకులిచ్చేలా భర్తపై ఒత్తిడి తీసుకురావటం జరుగుతుంది." దీనిని బుఖారీ పొందుపరిచారు.[2]

---

*1. సహీహ్ సుననె ఇబ్నుమాజ, లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.1897*

*2. కితాబుత్తలాఖ్- ఖౌలుల్లాహు తాలా లిల్లజీన యూలూన మిన్ నిసాయిహిమ్*

teluguislam.net



వివరణ : 'ఈలా' కారణంగా భర్త గనక భార్యకు విడాకులిస్తే సాధారణ విడాకులకు ఉండే ఇద్దతే (గడువే) ఈ విడాకులకూ ఉంటుంది.

## 132వ అంశం : ఒకవేళ భర్త ప్రమాణ గడువు ముగియక ముందే 'ఈలా' నుండి మరలివస్తే, అతను తన ప్రమాణ భంగానికి గాను పరిహారం చెల్లించాలి.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా ఉపదేశించారు: "ఎవరయినా ఏదైనా విషయం గురించి ఒట్టేసుకుని, ఆనక మరో విషయాన్ని దీనికన్నా మేలైనదిగా భావిస్తే తన ప్రమాణ భంగానికిగాను పరిహారం (కఫ్ఫారా) ఇచ్చి, మేలైన దానినే అనుసరించాలి." దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

వివరణ: ప్రమాణ భంగం జరిగినందుకు పరిహారంగా పదిమంది నిరుపేదలకు అన్నం పెట్టాలి లేదా బట్టలు పెట్టాలి లేదా ఒక బానిసకు బానిసత్వం నుండి స్వేచ్ఛను వొసగాలి. ఒకవేళ వీటిలో ఏ ఒక్కటీ చేయలేకపోతే మూడు రోజులపాటు ఉపవాసం పాటించాలి. (వివరాలకు అల్ మాయిద సూరా 89వ ఆయత్ చూడండి)

## 133వ అంశం : మహనీయ ముహమ్మద్ (స) ఒక నెలకాలం పాటు 'ఈలా' పాటించారు

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి)కథనం: మహాప్రవక్త ముహమ్మద్ (స) తమ సతీమణుల నుంచి వేరై 'ఈలా' పాటించిన సమయంలో ఆయన(స) కాలు బెణికి ఉంది. ఆయన(స) 29 రోజుల వరకూ ఇంటిలోని మంచెపైన గడిపారు. 29 రోజుల తరువాత ఆయన(స) దిగివచ్చినప్పుడు జనులు, 'ప్రవక్త (స) ఒక నెలరోజులని ప్రమాణం చేశారు కదా!' అని చెప్పుకోసాగారు. దానికి ఆయన(స) "29 రోజుల నెల కూడా ఉంటుంది కదా!" అని స్పందించారు. ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[2]

---

*1. కితాబుల్ అయిమాన్*

*2. కితాబుత్తలాఖ్: బాబు ఖౌలుల్లాహి త ఆలా*

# ఇద్దత్ (గడువు) ఆదేశాలు

**134వ అంశం : వయసు మీదపడిన కారణంగా ముట్లుడిగిన మహిళల విడాకుల గడువు (ఇద్దత్) మూడు నెలలు.**

**135వ అంశం : పిన్న వయస్సు మూలంగా బహిష్టు (రజస్వల) అవని మహిళల విడాకుల గడువు కూడా మూడు నెలలే.**

**136వ అంశం : గర్భవతులైనవారి విడాకుల గడువు ప్రసవం. అది కొన్ని రోజులూ కావచ్చు, కొన్ని వారాలు లేక నెలలైనా కావచ్చు.**

"మీ స్త్రీలలో ముట్టుపై ఆశ వదులుకున్నవారి విషయంలో మీకేదైనా సందేహముంటే, వారి గడువు మూడు నెలలు. రజస్వల (రుతుస్రావం మొదలు)కాని వారి గడువు కూడా అంతే. గర్భవతుల గడువు వారి ప్రసవం అయ్యే వరకూ ఉంటుంది. ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతనికి అల్లాహ్ అతని వ్యవహారంలో అన్ని విధాలా సౌలభ్యం కల్పిస్తాడు."

(అత్ తలాఖ్-4)

**137వ అంశం : ఇద్దత్ (గడువు) పూర్తి కానంతవరకూ స్త్రీ పునర్వివాహం చేసుకోజాలదు**

"మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చిన తరువాత, వారు తమ గడువు (ఇద్దత్)ను ముగించి, తమ (మాజీ) భర్తలను ధర్మబద్ధంగా పరస్పరం ఇష్టపడి వివాహమాడదలిస్తే మీరు వారికి అడ్డుతగలకండి. మీలో ఎవరయితే అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసిస్తున్నారో వారికి ఈ ఉపదేశం చేయబడుతోంది. ఇందులోనే మీ పరిశుద్ధత, పరిశుభ్రత ఇమిడి ఉన్నాయి. అంతా అల్లాహ్‌కు తెలుసు, మీకు తెలియదు." (అల్ బఖర -232)

**138వ అంశం : తలాఖె రజ్‌యీ ఇచ్చిన భార్యను ఇద్దత్ కాలంలో భర్త తన వెంటనే ఉంచాలి**

**139వ అంశం : తలాఖె రజ్‌యీ ఇచ్చిన భార్య పోషణాభారం ఆమె భర్తపైనే ఉంటుంది**

"మీ స్థోమత మేరకు మీరు ఉండే చోటే (విడాకులు పొందిన) ఆ మహిళలను కూడా ఉండనివ్వండి. వారిని ఇబ్బందులపాలుచేసే ఉద్దేశంతో బాధించకండి. ఒకవేళ వారు గర్భవతులై ఉంటే, వారు శిశువును కనేవరకూ వారికి ఖర్చులు ఇస్తూ ఉండండి. ఆ తరువాత వారు - మీ అభ్యర్థనపై- బిడ్డకు పాలిచ్చినట్లయితే వారికి వారి ప్రతిఫలాన్ని ముట్టజెప్పండి. ధర్మానుసారం

teluguislam.net


పరస్పరం సంప్రతించుకోండి. ఒకవేళ మీరు పరస్పరం గొడవ పడినట్లయితే అతని కోరికపై మరొకామె బిడ్డకు పాలుపడుతుంది." (అత్ తలాఖ్-6)

**140వ అంశం : గర్భవతి కాని మహిళ, సమాగమం జరుపబడిన మహిళ విడాకులు పొందితే ఆమె గడువు (ఇద్దత్) కాలం మూడు రుతువులు**

వివరణ : 11వ అంశాన్ని పేజి 39లో చూడండి.

**141వ అంశం : భర్త తాకకుండానే విడాకులిచ్చిన మహిళకు ఏ విధమైన గడువు (ఇద్దత్) లేదు**

వివరణ : 24వ అంశాన్ని పేజి 41లో చూడండి.

**142వ అంశం : భర్త చనిపోయిన స్త్రీ సంతాప గడువు (ఇద్దత్) నాలుగు మాసాల పది రోజులు**

హజ్రత్ ఉమ్మె అతియా (ర.అ) కథనం : మహనీయ ముహమ్మద్ (స) ప్రవచనం- "ఏ స్త్రీ కూడా మృతుని కొరకు మూడు రోజులకన్నా ఎక్కువ శోకం పాటించకూడదు-తన భర్త కోసం తప్ప. అతని (భర్త) కోసం నాలుగు మాసాల పది రోజులపాటు గడువు ఉంది. ఈ గడువు (ఇద్దత్) కాలంలో స్త్రీ రంగరించబడిన వస్త్రం ధరించరాదు. అది ముందు నుంచే రంగు గలదైతే తప్పులేదు. ఇంకా (ఈ గడువు కాలంలో) ఆమె కాటుక పెట్టుకోవటంగానీ, సుగంధ ద్రవ్యం వాడటం గానీ చేయరాదు. అయితే బహిష్టు స్థితి తొలగినప్పుడు, బహిష్టు రక్తపు దుర్వాసనను దూరం చేయటానికి (సాధారణమైన) సువాసనగానీ, అజ్ఫార్ (అనబడే) ద్రవ్యంగానీ ఉపయోగించవచ్చు." దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

**143వ అంశం : 'ఖులా' పొందిన మహిళ గడువు ఒక రుతుకాలమే**

వివరణ : 109వ అంశం క్రింద ఉన్న హదీసును పేజి 67లో చూడండి.

**144వ అంశం : భర్త చనిపోయిన స్త్రీ ఇద్దత్ (గడువు) కాలం ఎట్టి పరిస్థితిలోనూ తన భర్త ఇంట్లోనే గడపాలి**

**145వ అంశం : తప్పనిసరి పరిస్థితిలో బయటికి వెళ్ళవచ్చుగాని రాత్రయ్యేసరికి ఇంటికి తిరిగి వచ్చేయాలి**

---

*1. ముఖ్తసర్ సహీహ్ ముస్లిం లిల్ అల్బానీ-హ.నెం.864*

హజ్రత్ జైనబ్ బిన్తె కాబ్ బిన్ ఉజ్రా (ర.అ.) కథనం : హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) సోదరి ఫరైఆ బిన్తె మాలిక్ బిన్ సనాన్ (రఅ) తనతో ఏమని చెప్పిందంటే, తాను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి, "నేను ఖుద్రా తెగవారి వద్దకు నా పుట్టింటికి వెళ్ళగలనా? ఎందుకంటే నా భర్తగారు పారిపోయిన బానిసలను వెతకటానికి వెళ్ళారు. ఆయన (మదీనా నగరానికి ఏడు మైళ్ళ దూరాన ఉన్న) 'ఖుదూమ్' వద్దకు వెళ్ళగానే బానిసలు కనిపించారు. కాని వాళ్ళు ఆయన్ని చంపేశారు. నేను నా పుట్టింటికి వెళ్ళగలనా? ఎందుకంటే నా భర్త నాకే ఆధారం గానీ, మనోవర్తిగానీ వదలలేదు" అని విన్నవించుకుంది. "సరే. వెళ్ళు" అని దైవప్రవక్త (స)తనతో చెప్పారని ఫరైఆ (రఅ) తెలిపారు. "నేను అక్కడి నుంచి బయలుదేరాను. అప్పటికింకా మస్జిద్‌లోనో, కుటీరంలోనో ఉన్నాను. దైవప్రవక్త (స) నన్ను (మళ్ళీ) పిలిచారు లేదా ఎవరిచేతనో పిలిపించారు. లేదా నేను రప్పించబడ్డాను- "అవును, (ఇందాక) నువ్వేమన్నావు?" అని ప్రవక్త(స) అడిగారు. అంతకు ముందు చెప్పిందంతా మళ్ళీ చెప్పాను. అప్పుడు దైవప్రవక్త (స) "ఇద్దత్ కాలం పూర్తయ్యేవరకూ నీ ఇంట్లోనే ఉండు" అని ఆదేశించారు. అందువల్ల నేను ఆ ఇంట్లోనే నాలుగు మాసాల పదిరోజుల వరకూ ఉండిపోయాను. హజ్రత్ ఫరైఆ (రఅ) ఇలా అంటున్నారు- హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) ఖలీఫా అయినప్పుడు నా దగ్గరకు సందేశం పంపి ఈ సమస్య గురించి విచారణ జరిపారు. నా పట్ల జరిగినదంతా నేను వివరించగా, దాని ప్రకారమే ఆయన తీర్పు ఇచ్చారు. (అబూదావూద్-2300. సహీహ్ హదీసు)[1]

## 146వ అంశం : కనబడకుండా పోయిన భర్తకోసం భార్య నాలుగేళ్ళు నిరీక్షించిన మీదట ఇద్దత్ పాటించి పునర్వివాహం చేసుకోవచ్చు

హజ్రత్ సాద్ బిన్ ముసయ్యబ్ (రజి) కథనం: హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కనబడకుండా పోయిన భర్త యొక్క భార్య గురించి ఇలా అన్నారు - "ఆమె నాలుగు సంవత్సరాలు ఎదురు చూడాలి. ఆ తరువాత నాలుగు మాసాల పదిరోజులపాటు ఇద్దత్ పాటించి (తాను కోరితే) రెండో వివాహం చేసుకోవచ్చు." - దీనిని మాలిక్ పొందుపరిచారు.[2]

*1. సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్‌బానీ-రెండవ భాగం, హ.నెం.2016*

*2. కితాబుత్తలాఖ్ -నాల్గవ భాగం 1052, పేజి నం. 180.*

teluguislam.net


# స్త్రీ భరణం

**147వ అంశం : భార్య పోషణా బాధ్యత భర్తపై ఉంది**

**148వ అంశం : భార్య పోషణాభారం భర్త ఆర్థిక స్థోమతనుబట్టి ఉంటుంది**

వివరణ: 71వ అంశం క్రింద ఉన్న హదీసును చూడండి.

**149వ అంశం : ఇతర బంధువుల ఖర్చులకన్నా ముందు భార్య భరణం ఇవ్వాలి.**

వివరణ: 72వ అంశం క్రింద ఉన్న హదీసును పేజి 55లో చూడండి.

**150వ అంశం : ఇద్దత్ కాలంలో విడాకులు పొందిన భార్యకు భరణం చెల్లించవలసిన బాధ్యత భర్తది.**

వివరణ: 138, 139వ అంశం క్రిందవున్న ఆయత్‌ను చూడండి.

**151వ అంశం : మూడవ తలాఖ్ తరువాత పోషణాభారం పురుషునిపైన ఉండదు.**

హ్రజత్ ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) కథనం: తన భర్త తనకు మూడు విడాకులు ఇచ్చిన తరువాత దైవప్రవక్త (స) భరణం ఇవ్వమని గానీ, ఇంటి వసతి కల్పించమనిగానీ (ఆమె భర్తకు) ఆజ్ఞాపించలేదు.[1] (ఇబ్నుమాజా-2035, సహీహ్, ముస్లిం-1480)

**152వ అంశం : పోషణా బాధ్యత వహించని భర్త నుండి భార్య విడిపోదలిస్తే విడిపోవచ్చు.**

హ్రజత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స), తన భార్యకు పోషణా ఖర్చులు ఇవ్వని పురుషుని వ్యవహారంలో "వీరిద్దరినీ విడదీయండి" అని తీర్పు ఇచ్చారు. - దీనిని దారె ఖుత్నీ-3829లో పొందుపరిచారు.[2]

**153వ అంశం : ఒకవేళ భర్త కనీస ఖర్చులు కూడా ఇవ్వకపోతే, భార్య తన భర్త అనుమతి లేకుండానే అతని సొమ్ములో నుంచి తీసుకోవచ్చు. అయితే అది భర్తకు భరించ శక్యం కానంతగా ఉండరాదు.**

హ్రజత్ ఆయిషా(ర.అన్హా) కథనం: హ్రజత్ అమీర్ ముఆవియా తల్లి హిందా దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "అబూసుఫ్యాన్ మరీ పిసినారి(అంటే నిత్యావసర ఖర్చులు కూడా సరిగా ఇవ్వడు). నేను గనక అతని సంపదలోనుంచి అతని అనుమతి లేకుండానే తీసుకుంటే నేను పాపం చేసినట్లా?"అని ప్రశ్నించింది. "సముచితమైన రీతిలో నీకు, నీ పిల్లలకు కావలసిన ఖర్చుల్ని (అనుమతి లేకుండానయినా) తీసుకోవచ్చు"అని ఆయన(స) సమాధానమిచ్చారు. దీనిని బుఖారీ పొందుపరిచారు.[3]

---

*(1) సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ-మొదటి భాగం: హ.నెం.1655 (2) నైలుల్ అవ్‌తార్-కితాబున్నుఫ్ఖాత్ - ఈ హదీసు జాయిఫ్. ఇరవావుల్ ఘలీల్ 2161, పేజి నం.229 ఇది సయీద్ ఇబ్నె ముసాయిబ్ వచనం మాత్రమే. (3) ముఖ్తసర్ సహీహ్ బుఖారీ లిల్ జుబైదీ - హ.నెం. 1041*

# శిశు పోషణ - సంరక్షణ

**154వ అంశం : తలాఖ్ ఇచ్చినప్పుడు పిల్లలపై తండ్రి హక్కు ఉంటుంది**

**155వ అంశం : దంపతులు విడిపోయిన తరువాత పిల్లల శిక్షణా హక్కు తల్లికే అధికం**

**156వ అంశం : విడాకులు పొందిన మహిళ గనక పునర్వివాహం చేసుకుంటే పిల్లలపై ఆమెకు గల హక్కు దానంతటదే అంతరించిపోతుంది**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) కథనం: ఒక స్త్రీ ఈ విధంగా విన్నవించుకున్నది- "ఓ దైవప్రవక్తా(స)! వీడు నా పిల్లవాడు. నా గర్భం ఇతని ఆశ్రయంగా, నా చనులు ఇతని కొరకు నీళ్ళ తిత్తిగా, నా ఒడి ఇతనికి ఉయ్యాలగా ఉండేది. కాని ఇతని తండ్రి ఇప్పుడు విడాకులిచ్చేశాడు. ఈ పిల్లవాణ్ణి కూడా నా నుండి వేరుచేయాలనుకుంటున్నాడు". దాని కాయన(స), "నువ్వు పునర్వివాహం చేసుకోకుండా ఉన్నంతకాలం ఈ పిల్లవానిపై నీకే ఎక్కువ హక్కు ఉంది" అని తీర్పు ఇచ్చారు. (అబూదావూద్-2276, హసన్)[1]

**157వ అంశం : ఒకవేళ తండ్రి తన పిల్లవాడికి విడాకులు పొందిన మహిళ చేతనే పాలు త్రాగించాలనుకుంటే వారు పరస్పర సంప్రదింపులతో వేతనం నిర్ధారించుకోవచ్చు**

వివరణ: 139వ అంశం క్రింద ఉన్న ఆయత్‌ను పరిశీలించండి.

**158వ అంశం : విడాకుల తరువాత తల్లి-తండ్రీ ఇద్దరూ పిల్లవాణ్ణి తమ వద్దనే ఉంచుకోవాలని పట్టుబట్టితే పరస్పరం 'చీటీ' వేసి నిర్ణయించుకోవాలి.**

**159వ అంశం : పిల్లవాడు బుద్ధిమంతుడైతే నిర్ణయాధికారం అతనికే ఇవ్వాలి**

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒక మహిళ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నది. "ఓ దైవప్రవక్తా(స)! నా భర్త (విడాకుల అనంతరం) నా పిల్లవాణ్ణి నానుండి లాక్కోవాలని చూస్తున్నాడు. కాని ఈ పిల్లవాడు నాకు చేదోడుగా ఉన్నాడు. నా కోసం అబూఅంబా బావి నుండి నీళ్ళు తోడుకొస్తాడు." "చీటీ వేసుకోవచ్చుకదా!" అని దైవప్రవక్త (స) సూచించగా, "నా కుమారుని విషయంలో నాతో వాదులాడేదెవరు?" అని భర్త మొండి కేశాడు. అప్పుడు దైవప్రవక్త (స) (ఆ పిల్లవాణ్ణి ఉద్దేశించి), "చూడు!ఈతడు నీ తండ్రి. ఈమె నీ తల్లి. వీరిద్దరిలో

---

*1. సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్‌బానీ - రెండవ భాగం, హ.నెం.1991*

teluguislam.net



నీవు కోరిన వారి చేయిపట్టుకోవచ్చు" అన్నారు. అప్పుడు ఆ అబ్బాయి తన తల్లి చేయి పట్టుకున్నాడు. ఆమె అతన్ని తన వెంటబెట్టుకుపోయింది." (అబూదావూద్-2277. సహీహ్)[1]

## 160వ అంశం : అమ్మ తరువాత పిన్నమ్మ శిశు సంరక్షణకు ఎక్కువ హక్కుదారు

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం: హజ్రత్ హమ్జా (రజి) కూతురి విషయంలో హజ్రత్ అలీ, హజ్రత్ జాఫర్, హజ్రత్ జైద్ (ర.అన్హు)లు పోటీపడ్డారు. "ఆ పిల్ల నా బాబాయి కూతురు కాబట్టి నేనే ఆమె సంరక్షణకు ఎక్కువ హక్కుదారుణ్ణి" అని హజ్రత్ అలీ (రజి) చెప్పగా, "ఆమె నా బాబాయి కుమార్తె. మరియు మరదలు కూతురు. కాబట్టి నేనే ఎక్కువ హక్కుదారుణ్ణి" అని హజ్రత్ జాఫర్ (రజి) కూడా చెప్పారు. "ఆమె నా అన్న కుమార్తె (కాబట్టి ఆమెను సాకే హక్కు నాకుంది)" అని హజ్రత్ జైద్(రజి) వాదించారు. అయితే దైవప్రవక్త (స) మాత్రం పిన్నికి అనుకూలంగా తీర్పు ఇచ్చి (అమ్మాయిని హజరత్ జాఫర్‌కిస్తూ) ఇలా అన్నారు: "పిన్నమ్మ అమ్మతో సమానం" - దీనిని బుఖారీ, ముస్లింలు పొందుపరిచారు.[2]

## 161వ అంశం : విడాకుల తరువాత పిల్లవాడు తన తల్లి వద్ద ఉన్నా (లేదా తన తండ్రి వద్ద ఉన్నా) తన తండ్రి (తన తల్లి)ని చూడాలని అనగానే అనుమతి ఇవ్వాలి.

హజ్రత్ ఆయిషా (ర.అ) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "బంధుత్వం (రక్త సంబంధం) అర్ష్ (దైవ సింహాసనము)కు వ్రేలాడుతూ, 'నన్ను కలిపేవాణ్ణి అల్లాహ్ కలుపుతాడు. నాతో తెగత్రెంపులు చేసుకునేవానితో అల్లాహ్ తెగత్రెంపులు చేసుకుంటాడు' అంటుంది. దీనిని ముస్లిం పొందుపరిచారు.[3]

వ సల్లల్లాహు అలా నబియ్యినా ముహమ్మదిన్ వ అలా ఆలిహీ
వ అస్‌హాబిహీ అజ్‌మయీన్

---

1. సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్‌బానీ-రెండవ భాగం, హ.నెం.1992
2. నైలుల్ అవ్‌తార్-కితాబున్నుఫ్‌ఖాత్, బాబుమన్ అహఖ్ఖు బికఫాలతిహి.
3. కితాబుల్ బిర్ర్ వస్సిలతుర్రహీము వ తహ్రీము ఖతఅయ్‌తుహా

## మా ప్రచురణలు

1. ఏక దైవారాధన (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ) - ముహమ్మద్ ఇక్బాల్ కైలానీ
2. ఖుర్ఆన్ హదీసుల వెలుగులో ప్రవక్త(స) విధానం (తెలుగు, ఇంగ్లీష్, హిందీ) ”
3. శుచీ శుభ్రతల ఆదేశాలు (ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ) - ముహమ్మద్ ఇక్బాల్ కైలానీ
4. నమాజ్ ఆదేశాలు (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ) ”
5. ఇస్లాంలో జనాజా ఆదేశాలు (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్) ”
6. దురూద్ శుభాలు (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్) ”
7. ప్రార్థనల పుస్తకం (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్) ”
8. జకాత్ పుస్తకం (ఉర్దూ, ఇంగ్లీష్) ”
9. ఉపవాసాల ఆదేశాలు (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్) ”
10. మస్నూన్ హజ్జ్-ఉమ్రా విధానం (తెలుగు, ఉర్దూ) ”
11. నికాహ్ ఆదేశాలు (తెలుగు, ఉర్దూ) ”
12. తలాఖ్ ఆదేశాలు (తెలుగు, ఉర్దూ) ”
13. స్వర్గ సందర్శనం (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్) ”
14. నరక విశేషాలు (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్) ”
15. షిఫా అత్ ఆదేశాలు (తెలుగు, ఉర్దూ) ”
16. సమాధి సంగతులు (తెలుగు, ఉర్దూ) ”
17. ప్రళయ సంకేతాలు (ఉర్దూ) ”
18. ప్రళయ విశేషాలు (ఉర్దూ) ”
19. ఇస్లాంలో స్నేహం - విరోధం (ఉర్దూ) ”
20. దివ్యఖుర్ఆన్ ప్రాశస్త్యం (ఉర్దూ) ”
21. ఖుర్ఆన్ బోధనలు (ఉర్దూ) ”
22. కారుణ్య ప్రవక్త (స) విశిష్ఠత (ఉర్దూ) ”
23. కారుణ్య ప్రవక్త (స) వారి హక్కులు (ఉర్దూ) ”
24. ఇస్లాంలో మస్జిదుల వ్యవస్థ (ఉర్దూ) ”
25. వస్త్రధారణ నియమాలు (ఉర్దూ)
26. మంచిని పెంపొందించటం - చెడులను నిర్మూలించటం (ఉర్దూ) ”
27. మస్నూన్ నమాజ్ (తెలుగు) - హాఫిజ్ యం.డి. అబ్దుర్రౌఫ్ ఉమరి
28. ఇస్లాం మూల సూత్రాలు (తెలుగు) - ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ (రహ)
29. ఇస్లామీయ విశ్వాసాలు (తెలుగు) - అల్లామా ఇబ్నె తైమియ (రహ)
30. ప్రవక్త విధేయతే పరమావధి (తెలుగు) - అల్లామా ఇబ్నె బాజ్ (రహ)
31. పరలోకం (తెలుగు) - INGC (రియాద్)

హదీస్ పబ్లికేషన్స్, హైదరాబాద్